

'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి. దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 344

మంగళవారం 5-3-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చరిత్ర సృష్టించిన భారత జట్లు
టేబుల్ టెన్నిస్ టీమ్ విభాగంలో తొలిసారి ఒలింపిక్స్‌కు అర్హత -12లో



రెండుగా టాటా మోటార్స్
వాణిజ్య, ప్యాసింజర్ వాహనాలతో వేర్వేరు యూనిట్ల ఏర్పాటుకు నిర్ణయం -13లో



మారిన గుండెతో 4 దశాబ్దాలు
గుండె మార్పిడి చేయించుకున్న తర్వాత ఎక్కువ కాలం జీవించి ఉన్న వ్యక్తిగా నెదర్లాండ్స్‌వాసి గిన్నిస్‌కెక్కాడు.
- వివరాలు 6లో



ఆ హత్య సునీత దంపతుల కుట్రే!
'వైఎస్ వివేకాను ఆయన కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిదే హత్య చేయించి ఉండొచ్చు' అని వివేకాకు పీఏగా చేసిన కృష్ణారెడ్డి అన్నారు.
- వివరాలు 10లో



'కాళేశ్వరం' బాధ్యులపై చర్యలు
మేడిగడ్డ పియర్ల కుంగుబాటు బాధ్యులపై చర్యలు ప్రారంభించామని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి హైకోర్టుకు తెలిపారు.
- వివరాలు 5లో



ఈనాడు ఒత్తిళ్లతో ఆత్మహత్య
ఈనాడు దినపత్రిక యాజమాన్యం ఒత్తిళ్లు తట్టుకోలేక ఓ మహిళా ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడింది.
- వివరాలు 14లో

అబద్ధాలు.. దోపిడీ

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల చరిత్రలో ఉన్నవి ఈ రెండే

ఆదిలాబాద్ బీజేపీ బహిరంగ సభలో ప్రధాని ఫైర్



- రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు పోయి కాంగ్రెస్ వచ్చినా అయ్యేదేమీ లేదు
- కాళేశ్వరం అవినీతిని కాంగ్రెస్ కప్పిపుచ్చుతోంది... మీరు తిన్నారు, మేము తింటామనే రీతిలో వ్యవహరిస్తోంది
- తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం
- మోదీ గ్యారంటీ అంటే.. గ్యారంటీగా పూర్తయ్యే గ్యారంటీ
- వికసిత్ భారత్– వికసిత్ తెలంగాణ లక్ష్యంగా పెట్టుకొని అభివృద్ధి చేస్తాం
- కుటుంబ పాలనలో ఇండియా కూటమి పార్టీలు నిండా మునిగాయని ధ్వజం
- ఈసారి 400కు పైగా లోక్‌సభ సీట్లలో గెలుస్తామన్న ప్రధాని మోదీ

సాక్షి, ఆదిలాబాద్: కుటుంబ పార్టీల ముఖాలు వేర్వేరుగా ఉన్నా వారి చరిత్ర ఒకటేనని.. అబద్ధాలు ఆడటం, దోచుకోవడమనే రెండు అంశాలు వాటి చరిత్రలో తప్పకుండా ఉంటాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. తెలంగాణలో టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారినా మార్పేమీ లేదని.. ఇప్పుడు బీఆర్ఎస్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా అయ్యేదేమీ లేదని విమర్శించారు. ఆ రెండు పార్టీలూ ఒక్కటేనన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగితే కాంగ్రెస్ దానిపై విచారణ చేయకపోగా కప్పిపుచ్చుతోందని ఆరోపించారు. 'మీరు బాగుపడ్డారు.. మేమూ బాగుపడతాం.. మీరు తిన్నారు.. మేమూ తింటాం..' అన్నట్టుగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల తీరు ఉందని విమర్శించారు. సోమవారం ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం బీజేపీ విజయ సంకల్ప సభలో ప్రసంగించారు. వివరాలు మోదీ మాటల్లోనే..

''ఇది ఎన్నికల సభ కాదు.. ఎన్నికల తేదీలు ఇంకా ప్రకటించలేదు. నాకు ఎన్నికలు ముఖ్యం కాదు.. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యం.. మీరంతా వికసిత్ భారత్ కోసం ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది. దేశ అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయల పనులు చేపట్టాం. ఈ పదిహేను రోజుల్లో దేశంలో పలు ఐఐటీలు, ట్రిపుల్‌ఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్‌లను ప్రారంభించాం. తెలంగాణలో కూడా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఆత్మనిర్భర్ భారత్ నుంచి వికసిత్ భారత్‌గా మారింది.

కుటుంబ పార్టీలను నమ్మొద్దు

అవినీతి, కుటుంబ పాలనలో ఇండియా కూటమి నేతలు నిండా మునిగారు. వారి తీరును నేను మిగతా 2వ పేజీలో ▶

తెలంగాణ సర్కారుకు సంపూర్ణంగా సహకరిస్తాం: మోదీ

కేంద్రంతో ఘర్షణకు వెళ్లబోం: సీఎం రేవంత్

నేడు సికింద్రాబాద్, సంగారెడ్డిలలో

మోదీ పర్యటన

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- 'విజయ సంకల్ప సభ'లో ప్రసంగం

- వివరాలు 2లో

'రామగుండం' యూనిట్ జాతికి అంకితం

రాష్ట్రానికి సంబంధించి రూ. 6,697 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు 2లో



ఎన్టీపీసీ 3వ దశ ప్రాజెక్టుకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్‌రెడ్డి



జస్టిస్ పి.వి.సంజయ్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.బోపన్న, సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా

చట్టసభల్లో అవినీతీ... విచారణార్హమే

సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు

1998 నాటి ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు కొట్టివేత

- చట్టసభల్లో మాట్లాడడానికి, ఓటేయడానికి లంచాలా?!
- ఆర్టికల్ 105(2), 194(2) కల్పించే రక్షణ వాటికి వర్తించదు
- వాటి వర్తింపునకు రెండు నిబంధనలు విధించిన ధర్మాసనం
- ప్రజాప్రతినిధుల అవినీతి ప్రజాస్వామ్యానికే ముప్పంటూ ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: అవినీతికి పాల్పడే ప్రజాప్రతినిధులు రాజ్యాంగ రక్షణ మాటున దాక్కోలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చట్టసభల్లో ఓటేయడానికి, మాట్లాడడానికి లంచం తీసుకొనే ఎంపీలు, ఎమ్మెల్యేలు విచారణ నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేసింది. ఇలాంటి కేసుల్లో వారికి విచారణ నుంచి రాజ్యాంగపరమైన రక్షణ ఉంటుందంటూ 1998లో జేఎంఎం లంచం కేసులో ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన తీర్పును కొట్టేసింది! ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన విస్తృత రాజ్యాంగ ధర్మాసనం సోమవారం ఏకగ్రీవంగా చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. చట్టసభల్లోపల ఎంపీలు, మిగతా 10వ పేజీలో ▶

పెళ్లింట మృత్యుగంట
రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం

ముగ్గురు కుమారులను చంపి..
తానూ ఉరేసుకుని
నగదు లావాదేవీల నేపథ్యంలో ఓ తండ్రి దురాగతం

విద్యుత్ వైర్లు తెగిపడి..
ముగ్గురు మృతి

తోటి విద్యార్థిని కొట్టి చంపేశారు

చంపడానికొచ్చి... హతమయ్యాడు

- వివరాలు 5లో

ఇదండీ సంగతి



వద్దు సార్! ఆ తృణమూల్‌తో పొత్తు మనకు ఉపయోగం ఉండదు!

విద్యపై ఖర్చు భవితకు పెట్టుబడే

ఉద్యోగ నియామకాల ప్రక్రియను వేగవంతం చేశాం: సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

- 3 నెలల్లోనే 30 వేల ఉద్యోగాలకు నియామకపత్రాలిచ్చాం
- గత ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరించిందని విమర్శ
- గుంటూరు కార్పొరేట్ స్కూళ్లలో చదివిన వ్యక్తి తనపై విమర్శలు చేస్తున్నాడని ఎద్దేవా
- సీఎం చేతుల మీదుగా గురుకుల, పోలీసు ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేత



ఓ ఉద్యోగికి నియామక పత్రాన్ని అందిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి, పొన్నం తదితరులు

సాక్షి, హైదరాబాద్: విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ఆ శాఖకు చేస్తున్న ఖర్చు భవిష్యత్ తరానికి పెట్టుబడిగా భావిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఎల్బీ స్టేడియం వేదికగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు మిగతా 2వ పేజీలో ▶

ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాల్సిందే..

కాంగ్రెస్ సర్కారు మాట నిలబెట్టుకోవాలి: కేటీఆర్

- అప్పట్లో ఎల్ఆర్ఎస్‌తో దోచుకుంటున్నారని మమ్మల్ని తప్పుబట్టి ఇప్పుడు మీరు దోపిడీ చేస్తున్నారా?
- 25 లక్షల కుటుంబాలపై రూ. 20వేల కోట్ల భారం మోపితే ఒప్పుకోం
- ఎల్ఆర్ఎస్‌పై కోమటిరెడ్డి వేసిన కేసు ఏమైంది?
- సర్కారు నిర్ణయానికి వ్యతిరేకంగా 6న నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, 7న కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతిపత్రాలిస్తామని వెల్లడి



3లో



దరఖాస్తులు 66.30 లక్షలు.. కట్టేవి 4.16 లక్షలు

'ఇందిరమ్మ'లబ్ధిదారుల ఎంపిక కత్తిమీద సామేనా?

- ప్రజాపాలనలో ఇళ్ల కోసం 80 లక్షల దరఖాస్తులు
- గతంలో లబ్ధి పొందిన 14.75 లక్షల మంది దరఖాస్తులు పక్కకు
- మిగిలిన దరఖాస్తులు 66.30 లక్షలు... వీలైనంతగా వడపోసే యత్నంలో యంత్రాంగం

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారనుంది. ఈ పథకం కింద ప్రస్తుత సంవత్సరం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే జరిగితే రాష్ట్రవ్యాప్తంగా 4.16 లక్షల ఇళ్లను నిర్మిస్తారు. కానీ ఇళ్ల కోసం ప్రజలు సమర్పించిన దరఖాస్తులు పేరుకుపోయి ఉన్నాయి. ఏకంగా 66.30 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

భారీ కోత ఎలా?

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధి కోసం కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు వచ్చిపడ్డాయి. రకరకాల పథకాలకు దరఖాస్తు చేసిన ప్రజలు ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కూడా టిక్ చేశారు. ఈ విధంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన మొత్తం దరఖాస్తులు ఏకంగా 80 లక్షలు దాటాయి. వాటిని మిగతా 2వ పేజీలో ▶

నలుగురితో బీఆర్ఎస్ తొలి జాబితా

సిట్టింగ్ ఎంపీలు నామా, మాలోత్ కవితకు మళ్లీ చాన్స్

- కరీంనగర్‌లో వినోద్, పెద్దపల్లి నుంచి కొప్పుల
- పాలమూరు 'స్థానిక' అభ్యర్థిగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి!



సోమవారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి తరఫున పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు సోమవారం ఖరారు చేశారు. నలుగురు అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను కేసీఆర్ ప్రకటించగా, అందులో ఇద్దరు సిట్టింగ్ ఎంపీలకు తిరిగి పోటీ చేసే అవకాశం కల్పించారు. నామా నాగేశ్వర్‌రావు ఖమ్మం నుంచి, మాలోత్ కవిత మహబూబాబాద్ (ఎస్టీ) స్థానాల నుంచి తిరిగి బరిలోకి దిగనున్నారు. ఇక కరీంనగర్ నుంచి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, పెద్దపల్లి (ఎస్సీ) నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీ చేస్తారు. ఆదివారం ఉమ్మడి కరీంనగర్, సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కేసీఆర్ తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. ఆయా సమావేశాల్లో పార్టీ నేతలు చర్చించి అభ్యర్థుల పేర్లకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు కేసీఆర్ ప్రకటించారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

శ్రీశైలానికి 'ఎలివేటెడ్ కారిడార్'ను పరిశీలించండి

ప్రధాని మోదీకి జస్టిస్ ఎన్వీ రమణ లేఖ



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి వెళ్లే మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సిద్ధం చేయాలని గతంలో ఆదేశించిన అంశాన్ని మరోసారి పరిశీలించి, పనులకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధాని నరేంద్రమోదీకి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సోమవారం లేఖ రాశారు. దక్షిణ కాశీగా పిలిచే ఈ పుణ్యక్షేత్రానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని, ఎంతోకాలంగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారంటూ గత సంవత్సరం ఫిబ్రవరిలో ఆయన లేఖ రాశారు. దీనికి స్పందించి కేంద్రం డీపీఆర్‌ను సిద్ధం చేయాలని గత మేలో ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలపై త్వరితగతిన చర్యలు చేపట్టి కార్యరూపం దాల్చేలా చూడాలని ప్రధానిని జస్టిస్ రమణ కోరారు.

భద్రాద్రి రాముడి సన్నిధిలో ఐదో గ్యారంటీ అమలు

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 11న శ్రీకారం చుట్టనున్న సీఎం: పొంగులేటి



సత్తుపల్లి: ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీల్లో నాలుగు అమలు చేస్తుండగా.. ఐదో హామీ అయిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని భద్రాచలం శ్రీరాముడి సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 11న ప్రారంభిస్తారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో సోమవారం నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్ష ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని 11వ తేదీన భద్రాచలం పర్యటనకు వస్తున్న సీఎం లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక 25,200 ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించామని చెప్పారు. ధరణి సైట్‌ను ప్రక్షాళన చేసే దిశగా కమిటీని నియమించామని, 2.45 లక్షల ఫిర్యాదుల పరిష్కారానికి సర్వే జరుగుతోందని తెలిపారు. ఏ శాఖలోనైనా ఉద్యోగులు అవినీతికి పాల్పడితే వెంటనే డిస్మిస్ చేస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు.

85 ఏళ్ల వృద్ధులకు మాత్రమే ఇంటి నుంచి ఓటు: ఈసీ




సాక్షి, హైదరాబాద్: ఇకపై ఎన్నికల్లో ఇంటినుంచి ఓటేసే సదుపాయాన్ని 85 ఏళ్లు, ఆపై వయసున్న వయోజనులకు మాత్రమే కల్పించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిబంధనలను సవరిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. 80 ఏళ్లు, ఆపై వయసున్న వయోజనులకు ఇంటి నుంచి ఓటేసే సదుపాయం కల్పించాలని పాత నిబంధనలు పేర్కొంటుండగా, తాజాగా ప్రభుత్వం 85 ఏళ్లకు వయసును పెంచింది.

సీఎంను కలిసిన దక్షిణాఫ్రికా బృందం

సాక్షి, హైదరాబాద్: జర్నలిజం అండ్ పబ్లిక్ రిలేషన్స్ అనే అంశంపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న 29 మంది దక్షిణాఫ్రికా అధికారులు, పాత్రికేయుల బృందం సోమవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలుసుకుంది. విదేశాంగ మంత్రిత్వ శాఖలోని ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కో–ఆపరేషన్(ఐటెక్) విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి 9 వరకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. శిక్షణ నిమిత్తం హైదరాబాద్ వచ్చిన అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డీజీ శశాంక్ గోయల్ పాల్గొన్నారు.

'కృష్ణా' ప్రాజెక్టులను అప్పగించం

- కృష్ణా బోర్డుకు అసెంబ్లీ తీర్మానం పంపిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను అప్పగించబోమని రాష్ట్ర ప్రభుత్వం గత నెల 17న శాసనసభలో చేసిన తీర్మానం ప్రతిని కృష్ణా బోర్డు(కేఆర్‌ఎంబీ)కు ప్రభుత్వం పంపించింది. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఇటీవల కృష్ణా బోర్డుకు లేఖ రాశారు. ప్రాజెక్టుల అప్పగింత వ్యవహారంపై రాష్ట్రంలో రాజకీయ దుమారం చెలరేగడంతో వాటిని కృష్ణాబోర్డుకు అప్పగించరాదని పేర్కొంటూ శాసనసభలో ప్రభుత్వం తీర్మానించడం తెలిసిందే.

కృష్ణా బోర్డు సభ్యునిగా 'శంఖువ'

కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ) సభ్యుడు అజయ్‌గుప్తా చండీగఢ్‌లోని ఐబీబీ సీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆర్.ఎస్.శంఖువను బోర్డు సభ్యునిగా నియమిస్తూ కేంద్ర జలశక్తి శాఖ అండర్ సెక్రటరీ అనిల్‌కుమార్ శర్మ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.



ఆదిలాబాద్ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ, బండి సంజయ్, కిషన్‌రెడ్డి తదితరులు



సభలో ప్రధాని మోదీ పిలుపు మేరకు నినాదాలు చేస్తున్న జనం

అబద్ధాలు.. దోపిడీ

సాక్షి, ఆదిలాబాద్: ప్రధాని మోదీ పర్యటనలో రాష్ట్రానికి సంబంధించి రూ.6,697 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రామగుండంలో ఎన్టీపీసీ రూ.6 వేల కోట్లతో నిర్మించిన రెండో థర్మల్ పవర్ యూనిట్‌ను జాతికి అంకితం చేశారు. రూ.70 కోట్ల వ్యయంతో పూర్తిచేసిన అంబారి– ఆదిలా

రామగుండం థర్మల్ పవర్ యూనిట్ జాతికి అంకితం

బాద్– పింపాలకుట్టి రైల్వేలైన్‌ను ప్రారంభించారు. వీటితోపాటు ఎన్‌హెచ్ 163పై రూ.136 కోట్లతో చేపట్టిన హైదరాబాద్–భూపాలపట్నం రహదారి పనులకు, ఎన్‌హెచ్ 353బీపై రూ.491 కోట్లతో చేపట్టిన ఆదిలాబాద్–బేల రహదారి విస్తరణ (32 కిలోమీటర్లు) పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

▶ మొదటి పేజీ తరువాయి

ప్రశ్నిస్తుంటే.. వారు నాపై ప్రతిదాడి చేస్తున్నారు. మోదీకి కుటుంబం లేదని విమర్శిస్తున్నారు. ఆ కుటుంబ పార్టీలను నమ్మొద్దు. ఎవరికైనా జైలుశిక్ష పడకపోతే రాజకీయాలకు పనికి రారని అన్నా అంటారు. పేదలు, దళితులు, ఆదివాసీల అభివృద్ధి కోసం మా ప్రభుత్వం కృషి చేస్తోంది. గత పదేళ్లలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయట పడ్డారు. వచ్చే 25 సంవత్సరాల్లో.. అంటే 2047 నాటికి ప్రపంచంలో సమృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడమే మా లక్ష్యం. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో 400కుపైగా లోక్‌సభ స్థానాల్లో విజయం సాధిస్తాం.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం. మోదీ గ్యారంటీ అంటే.. గ్యారంటీగా పూర్తయ్యే గ్యారంటీ. గతంలో నేను చెప్పిన విధంగా సమ్మక్క–సారలమ్మ కొలువున్న చోట గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నాం. తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేయనున్నాం. పత్తి రైతులకు ప్రయోజనకరంగా మద్దతు ధరను రికార్డు స్థాయిలో పెంచడం జరిగింది. దేశంలో ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కులను నిర్మిస్తుండగా.. అందులో ఒకటి తెలంగాణలో చేపడుతున్నాం. వికసిత్ భారత్– వికసిత్ తెలంగాణ లక్ష్యంగా పెట్టుకొని అభివృద్ధి చేస్తాం.

రామ్‌లల్లా ఆశీర్వాదం ఉంటుంది

రామ మందిరం బంగారు తలుపులు, ధ్వజ స్తంభం నిర్మాణంలో తెలంగాణ పాత్రను దేశం గుర్తించింది. రామ్‌లల్లా ఆశీర్వాదం తెలంగాణ ప్రజలపై ఉంటుంది. రాంజీ గోండ్, కుమురంభీం వంటి యోధుల త్యాగాలకు తగ్గట్టుగా గత ప్రభుత్వాలు వ్యవహరించలేదు. మేం 2014 నుంచి ఆదివాసీల అభివృద్ధికి పాటుపడుతున్నాం. ఆదివాసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేశాం. హైదరాబాద్‌లో రాంజీ గోండ్ మ్యూజియం ఏర్పాటు చేస్తున్నాం. పీఎం జన్‌మన్ యోజనతో అంతరించిపోతున్న గిరిజన జాతుల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నాం

140 కోట్ల మంది ప్రజలే నా కుటుంబం

దేశంలోని 140 కోట్ల ప్రజలంతా నా కుటుంబమే. చిన్ననాడు ఒక కలతో ఇల్లు విడిచి బయటకు వచ్చాను. దేశ ప్రజల కోసమే నా జీవితాన్ని అంకితం చేశాను. ప్రతి క్షణం ప్రజల కోసమే పరితపిస్తాను. నాకంటూ ప్రత్యేకంగా కలలు లేవు. ప్రజల కలల సాకారమే నా లక్ష్యం. కోట్ల మంది ప్రజలు నన్ను ఇంటి మనిషిగా భావిస్తారు. 'మేరా భారత్– మేరా పరివార్..'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాగా సభలో ఓబీసీ మోర్చా జాతీయాధ్యక్షుడు కె.లక్ష్మణ్, బీసీ కమిషన్ జాతీయ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం, ఎంపీ బండి సంజయ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగులో ప్రసంగం మొదలుపెట్టి..

ప్రధాని మోదీ తన ప్రసంగంలో పలుమార్లు తెలుగులో మాట్లాడి ఆకట్టుకున్నారు. ప్రసంగం మొదట్లోనే 'నా తెలంగాణ కుటుంబ సభ్యుల్లారా.. నమస్కారం' అంటూ ప్రారంభించారు. మధ్యలో 'అబ్‌కీ బార్.. చార్‌సౌ పార్..' అని మొదట హిందీలో చెప్పి తర్వాత.. 'ఈసారి నాలుగు వందల సీట్లు.. బీజేపీకే ఓటు వేయాలి..' అని తెలుగులో పిలుపునిచ్చారు. 'మోదీ గ్యారంటీ అంటే.. గ్యారంటీగా పూర్తయ్యే గ్యారంటీ..'' అని చెప్పారు. 'మై హూ.. మోదీకా పరివార్' అని చెప్పిన మోదీ తర్వాత 'మై హూ..' అంటూ 'మోదీకా పరివార్' అంటూ జనంతో చెప్పించారు.



పక్కపక్కనే మోదీ, రేవంత్..

ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలతోపాటు పార్టీ పరంగా నిర్వహించే బహిరంగ సభలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో హెలికాప్టర్ ద్వారా ఆదిలాబాద్ చేరుకున్నారు. తొలుత అధికారిక కార్యక్రమాల వేదిక వద్దకు వచ్చారు. దేశవ్యాప్తంగా రూ.56 వేల కోట్లతో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అందులో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి రూ.6,697 కోట్ల విలువైన పనులు ఉన్నాయి. ఈ అధికారిక వేదికపై ప్రధాని మోదీతోపాటు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు–కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులు ఆసీనులయ్యారు. ఇందులో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ పక్కపక్కనే కూర్చోవడం గమనార్హం.

తెలంగాణ సర్కారుకు సంపూర్ణంగా సహకరిస్తాం: మోదీ

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా తోడుగా ఉంటుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి సంపూర్ణంగా సహకరిస్తామని తెలిపారు. తెలంగాణలో గత పదేళ్లలో వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించామన్నారు. ఎన్టీపీసీ రెండో యూనిట్‌తో కొత్తగా 800 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తోందని వివరించారు. కాగా బహిరంగ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని 17 ఎంపీ సీట్లలో బీజేపీ గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ఎంఐఎం సీటును సైతం బీజేపీ కైవసం చేసుకునేలా ఆశీర్వదించాలన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు, కేసీఆర్‌కు ఉనికి లేదన్నారు.

కేంద్రంతో ఘర్షణకు వెళ్లబోం: సీఎం రేవంత్

అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణ వైఖరి ఉంటే రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని.. తాము కేంద్రంతో ఎలాంటి ఘర్షణ వాతావరణానికి వెళ్లబోమని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలసి ముందుకెళ్తామన్నారు. ఏ రాజకీయాలు ఉన్నా ఎన్నికల సమయంలో మాత్రమేనని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించినందుకు, హైదరాబాద్‌లో స్కైవేల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు ఇచ్చినందుకు ప్రధాని మోదీకి రేవంత్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీపీసీలో ఇంకా చేపట్టాల్సి ఉన్న పనుల కోసం రాష్ట్ర సర్కారు తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లక్షన్నర ఎకరాలకు నీళ్లు అందిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు కోసం మహారాష్ట్రలో 1,800 ఎకరాల భూసేకరణ జరపాల్సి ఉందని.. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ప్రధాని మోదీ కృషి చేయాలని కోరారు. ప్రధాని మోదీ రాష్ట్ర అభివృద్ధికి పెద్దన్నలా సహకరించాలని.. హైదరాబాద్ మెట్రోకు, మూసీ నది అభివృద్ధికి కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు సికింద్రాబాద్, సంగారెడ్డిలలో మోదీ పర్యటన

ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకోనున్న ప్రధాని

- అక్కడి నుంచి పటాన్‌చెరుకు..
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- అనంతరం రాజకీయ ప్రసంగం
- సోమవారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకుని బస

వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న కార్యక్రమాలివీ..

- ➤ రూ.1,298 కోట్లతో ఎన్‌హెచ్–65పై సంగారెడ్డి చౌరస్తా నుంచి మదీనాగూడ వరకు 31 కిలోమీటర్ల మేర ఆరు లేన్లుగా విస్తరణ
- ➤ రూ.399 కోట్లతో ఎన్‌హెచ్–765డిపై మెదక్–ఎల్లారెడ్డి మధ్య 2 లైన్ల హైవే విస్తరణ.

జాతికి అంకితం చేయనున్న ప్రాజెక్టులివీ..

- ➤ రూ.3,338 కోట్లతో నిర్మించిన పారాదీప్–హైదరాబాద్ గ్యాస్ పైప్‌లైన్
- ➤ రూ.400 కోట్లతో చేపట్టిన సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్
- ➤ రూ.1,409 కోట్లతో నిర్మించిన ఎన్‌హెచ్–161లోని కంది–రామసానిపల్లె సెక్షన్‌లో 4 వరుసల జాతీయ రహదారి
- ➤ రూ.323 కోట్ల ఖర్చుతో చేసిన ఎన్‌హెచ్–167 మిర్యాలగూడ–కోదాడ సెక్షన్ జాతీయ రహదారి విస్తరణ
- ➤ రూ.1,165 కోట్లతో హైదరాబాద్–సికింద్రాబాద్‌లలో 103 కిలోమీటర్ల పొడవున చేపట్టిన ఎంఎంటీఎస్ ఫేజ్–2 ప్రాజెక్టు.
- ➤ ఘట్‌కేసర్– లింగంపల్లి మధ్య కొత్త ఎంఎంటీఎస్ రైలు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్/ పటాన్‌చెరు/ పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ రెండో రోజు మంగళవారం సికింద్రాబాద్, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సోమవారం రాత్రే ప్రధాని హైదరాబాద్‌కు చేరుకుని రాజ్‌భవన్‌లో బస చేశారు. మంగళవారం ఉదయం రాజ్‌భవన్ నుంచి బయలుదేరి సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. అక్కడ అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేసిన తర్వాత బేగంపేట ఎయిర్‌పోర్టుకు వస్తారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10:45 గంటల సమయంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు శివార్లలోని పటేల్‌గూడలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు వస్తారు. తొలుత అధికారిక వేదికపై వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. తర్వాత సమీపంలోనే ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికపై ప్రసంగం చేస్తారు.

సభకు ఏర్పాట్లు పూర్తి.. భారీగా బందోబస్తు

ప్రధాని సభ కోసం పటాన్‌చెరులోని పటేల్‌గూడ సభా వేదిక వద్ద 23 ఎకరాల్లో భారీగా ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాలను ఫ్లెక్సీలు, కటౌట్లు, కాషాయ జెండాలతో నింపేశారు. అధికారిక కార్యక్రమాల కోసం ఒకటి, రాజకీయ ప్రసంగం కోసం మరొకటి.. రెండు వేదికలను ఏర్పాటు చేశారు. ప్రధాని ముందుగా అధికారిక కార్యక్రమాలు నిర్వహించి, తర్వాత బహిరంగ సభా వేదికపై ప్రసంగిస్తారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని మెదక్, జహీరాబాద్ లోక్‌సభ సీట్లతోపాటు సమీపంలోని నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులకు మద్దతు కూడగట్టేలా ప్రధాని సభను నిర్వహిస్తున్నారు. కాగా ప్రధాని పర్యటన సందర్భంగా మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయం, అక్కడి నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకునే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయనున్నారు.

రేపు బీజేపీ ఎన్నికల కమిటీ భేటీ

- రాష్ట్రంలోని 8 పెండింగ్ లోక్‌సభ సీట్లకు అభ్యర్థులను ప్రకటించే చాన్స్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ బుధవారం ఢిల్లీలో సమావేశం కానుంది. రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ స్థానాలకు గాను ఇటీవల 9 స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ఖరారు చేసిన తెలిసిందే. బుధవారం నాటి భేటీలో పెండింగ్‌లోని మిగతా 8 స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించే అవకాశాలు ఉన్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల బలాబలాలపై బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకత్వాలు కసరత్తు పూర్తిచేశాయి. ఈ క్రమంలోనే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న, ఏకాభిప్రాయం కుదిరిన 9 మందితో తొలి జాబితాను ప్రకటించారు. టికెట్ కోసం పోటీ ఉన్న ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, మెదక్ స్థానాల్లో ఎవరిని బరిలోకి దింపితే బాగుంటుందనే దానిపై కసరత్తు చేశారు. పార్టీపరంగా అంతగా బలమైన నాయకులు లేని వరంగల్, నల్లగొండ, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్‌లలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి నేతల చేరికలపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్‌కు చెందిన మరో సిట్టింగ్ ఎంపీ బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పార్టీ నాయకులు చెప్తున్నారు. కానీ సదరు ఎంపీ ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానానికి బీజేపీ అభ్యర్థిని ప్రకటించేయడంతో.. ఆయనను మరో సీటు నుంచి బరిలో దిగాల్సిందిగా బీజేపీ నాయకత్వం కోరినట్టు తెలిసింది. దీనిపై సదరు ఎంపీ పెద్దగా ఉత్సాహం చూపడం లేదని సమాచారం. అయితే సీట్లపై ప్రాథమిక కసరత్తు ముగిసిన నేపథ్యంలో.. కొన్ని కొత్తపేర్లు తెరమీదకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

...కట్టేవి 4.16 లక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాథమికంగా పరిశీలించిన అధికారులు, గతంలో ఇందిరమ్మ ఇళ్లు పొందిన 14.75 లక్షల మంది కూడా మళ్లీ దరఖాస్తు చేసినట్టు గుర్తించారు. దీంతో మొదటి వడపోతలో భాగంగా ఆ దరఖాస్తులను పక్కన పెట్టేశారు. దీంతో 66.30 లక్షల దరఖాస్తులు మిగిలాయి. వాటి నుంచి లబ్ధిదారుల ఎంపిక ఎలా అన్న ఆందోళన అధికారుల్లో నెలకొంది. మొదటి ఏడాదిలో 4.16 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి సంవత్సరం ఎలాంటి ఆటంకాలు లేకుండా మంజూరు చేస్తూ వెళ్లినా, వచ్చే ఐదేళ్లలో అటుఇటుగా 20 లక్షల ఇళ్లను మాత్రమే ఇచ్చే అవకాశం ఉంటుంది. ఇవి ఏమూలకూ చాలవు. దీంతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చే ప్రమాదముందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో దరఖాస్తులను రకరకాల అంశాల ఆధారంగా వడపోసి వీలైనంత మేర తగ్గించే కసరత్తు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా సొంత ఇల్లు లేని నిరుపేదలు 30 – 35 లక్షల మంది ఉంటారన్న అంచనా ఉంది. ఒకవేళ దీన్ని పరిగణనలోకి తీసుకుని తగ్గించినా.. దరఖాస్తుల్లో ఆ సంఖ్య మేరకు పోను మిగిలినవారు అంటే సుమారు 30 లక్షల మంది తప్పకుండా అనర్హులే అవుతారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆర్‌సీసీ కప్పు ఉంటే ఔటే..: ప్రాథమికంగా రూపొందించుకున్న నిబంధనల ప్రకారం.. ఆర్‌సీసీ పైకప్పు ఉన్న సొంత ఇల్లు ఉంటే ఇందిరమ్మ పథకానికి అర్హత ఉండదు. చుట్టూ కాంక్రీట్ గోడలు ఉండి, కప్పు భాగంలో రేకులు, తడకలు, పెంకులు లాంటివి ఉంటే అర్హత వస్తుంది. దీంతో ఇప్పుడు గుట్టలాగా పేరుకుపోయి ఉన్న దరఖాస్తుల్లో.. అలా ఆర్‌సీసీ పైకప్పుతో ఉన్న సొంతింటిదారులు ఎవరున్నారని వెతికి పట్టుకునే పనిలో అధికారులున్నారు.


తెల్ల రేషన్‌కార్డు ఉంటేనే.. : ఇందిరమ్మ ఇల్లు పొందాలంటే కచ్చితంగా నిరుపేదలై ఉండాలి. తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారినే ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. దీంతో ఈ దరఖాస్తుదారుల్లో ఎంతమందికి తెల్ల రేషన్ కార్డు ఉందో, ఎంతమంది తప్పుడు రేషన్‌కార్డు నంబర్లు నమోదు చేశారో అన్న వివరాలను కూడా వాకబు చేస్తున్నారు.

ఈ సంవత్సరం సొంత జాగా ఉన్నవారికే!

సొంత జాగా ఉన్నవారికే ఈ సంవత్సరం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. సొంత జాగా లేని అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం స్థలం కేటాయించి మరీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. కాగా మొదటి సంవత్సరం మాత్రం సొంత జాగా లేని వారిని పరిగణనలోకి తీసుకోకూడదని నిర్ణయించినట్లు సమాచారం.

కాంగ్రెస్‌లోకి రామగుండం మేయర్

పెద్దపల్లి, గోదావరిఖని: పెద్దపల్లి జిల్లా రామగుండంలో బీఆర్‌ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బంగి అనిల్‌కుమార్‌తోపాటు 17 మంది కార్పొరేటర్లు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు సమక్షంలో వారు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మేయర్ అనిల్‌కుమార్‌తోపాటు కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, సాగంటి శంకర్, వేగోళపు రమ, ఇంజపురి పులేందర్, దుబాసి లలిత, తాళ్ల అమృతమ్మ, కలువల శిరీష, పొన్నం విద్య, దొంతు శ్రీనివాస్, కొమ్మ వేణు, జెట్టి జ్యోతి, గనుముక్కల మహాలక్ష్మి, నీలం పద్మ, బాలరాజ్‌కుమార్, మేకల సదానందం, జనగామ కవిత, సరోజినితోపాటు మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు.




కాంగ్రెస్‌లో చేరిన రామగుండం నగర మేయర్, కార్పొరేటర్లు

విద్యపై ఖర్చు భవితకు పెట్టుబడే

▶ మొదటి పేజీ తరువాయి

ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఉద్యోగ నియామకాల ప్రక్రియ వేగవంతం చేసినట్లు వివరించారు. ప్రభుత్వం ఏర్పాటైన 3 నెలల కాలంలోనే వివిధ శాఖలకు సంబంధించి 30వేల ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసి నియామక పత్రాలు అందించామని ఆయన చెప్పారు. తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ)తో పాటు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, టీఎస్‌పీఎస్సీల ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన 5192 మంది అభ్యర్థులకు సోమవారం ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ మాట్లాడుతూ 'ఇరవై ఏళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ ఎల్బీ స్టేడియం వేదికగా అధికారం చేపట్టింది. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఉచిత విద్యుత్ పథకం అమలుపై అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి తొలి సంతకం చేశారు. గతేడాది డిసెంబర్ 7న కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రభుత్వాన్ని చేపట్టింది కూడా ఎల్బీ స్టేడియంలోనే. ఆరు గ్యారెంటీలకు ఇక్కడే సంతకం చేశాం. ఇప్పుడు వరుసగా ఉద్యోగ నియామక పత్రాల పంపిణీని ఎల్బీ స్టేడి యం వేదికగానే జరుపుతున్నాం.''అని అన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల ఆకాంక్షలను గాలికి వదిలేసిందనీ, కేవలం వారి కుటుంబ సంక్షేమమే ధ్యేయంగా ఫాంహౌజ్ మత్తులో జోగిందని విమర్శించారు.



కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు

మిగిలిన వారికి త్వరలో ఇస్తాం

కొత్తగా 6,546 మంది ఉద్యోగాలకు అర్హత సాధించినప్పటికీ ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో 5,192 మంది లెక్చరర్లు, టీచర్లు, కానిస్టేబుళ్లు, మెడికల్ సిబ్బందికి నియామక పత్రాలు ఇస్తున్నట్లు సీఎం వెల్లడించారు. మిగతా వారికి త్వరలోనే అందిస్తామని వివరించారు. 'గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన వ్యక్తిని నేను. నాకు ఇంగ్లీష్ మాట్లాడడం రాదని గుంటూరు, గురజాల కార్పొరేట్ స్కూళ్లలో చదివిన వ్యక్తి ఈ మధ్య విమర్శలు చేస్తున్నాడు. అప్పట్లో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా బోధన సాగింది. ఇప్పుడు అలా కాదు. అద్భుతమైన ప్రతిభ ఉన్న వారు ఉద్యోగాలు సాధిస్తున్నారు. కొత్తగా నియమితులైన గురుకుల టీచర్లు విద్యార్థులకు అత్యుత్తమంగా బోధించాలి. వారికి పాఠ్యాంశ బోధనతో పాటు సామాజిక స్పృహ కలిగేలా... సంస్కృతి, సాంప్రదాయాలు, విలువలతో కూడిన జీవితం గడిపేలా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు.

ప్రతి నియోజకవర్గంలో నాలెడ్జ్ సెంటర్: భట్టి

రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఉద్యోగాలకు సిద్ధమయ్యే నిరుద్యోగులు నాలెడ్జ్ సెంటర్ల ద్వారా ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు భట్టి వివరించారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలియకపోయేదని, కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిరుద్యోగ అభ్యర్థుల కోసం జాబ్ క్యాలెండర్‌ను రూపొందించి త్వరలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా పాల్గొన్నారు.

మోదీ విమర్శలు విడ్డూరం

- కాళేశ్వరం అవినీతిపై కేంద్రం ఎందుకు దర్యాప్తు చేయించలేదు?
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీకు ఒకట్రెండు సీట్లే
- మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలది అవినీతి, బంధుప్రీతి అని ప్రధాని మోదీ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సీబీఐ, ఈడీ లాంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ఎంతో మందిని అరెస్ట్ చేయించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తెలిసీ కేసీఆర్ ప్రభుత్వంపై ఎందుకు దర్యాప్తు చేయించలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ దోపిడీపై ఎందుకు విచారణకు ఆదేశించలేదో సమాధానం చెప్పాలని కాంగ్రెస్‌ను నిలదీయడం ఏమిటని ఆయన విమర్శించారు. సోమవారం తెలంగాణ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో మంత్రి మాట్లాడారు. ఆదిలాబాద్ బహిరంగ సభలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీకి ఒకటో, రెండో సీట్లు రావడం కూడా కష్టమేనని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను తేల్చడంలో కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, నీటి వాటా తేల్చకుండా తెలంగాణ ప్రజల ఓట్లు అడిగే నైతిక హక్కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి లేదని ధ్వజమెత్తారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్రం జాతీయ హోదాను ఎందుకు కల్పించడం లేదని నిలదీశారు. కుల, మతాల పేరుతో చిచ్చు పెట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేస్తూ బీజేపీ ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తోందని నిప్పులు చెరిగారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను గత ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే నాలుగు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేసిందని, 28 వేల పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేశామని, డీఎస్సీ, గ్రూప్–1 నోటిఫికేషన్ ఇచ్చామని జూపల్లి అన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాల్సిందే..

కాంగ్రెస్ సర్కారు మాట నిలబెట్టుకోవాలి: కేటీఆర్

- అప్పట్లో ఎల్‌ఆర్‌ఎస్‌తో దోచుకుంటున్నారని మమ్మల్ని తప్పుబట్టి ఇప్పుడు మీరు దోపిడీ చేస్తున్నారా?
- 25 లక్షల కుటుంబాలపై రూ.20 వేల కోట్ల భారం మోపితే ఊరుకోం
- ఎల్‌ఆర్‌ఎస్‌పై కోమటిరెడ్డి వేసిన కేసు ఏమైంది?
- రేవంత్, భట్టి, ఉత్తమ్, సీతక్కల మాటలు ఏమయ్యాయి?
- ఎల్‌ఆర్‌ఎస్‌పై సర్కారు నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్నట్టు వెల్లడి
- 6న నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు.. 7న కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతిపత్రాలు


మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

రూ.20 వేల కోట్లు దోచుకునే పన్నాగం

ఎల్‌ఆర్‌ఎస్‌లో భాగంగా దరఖాస్తు చేసుకున్న 25 లక్షల 44 వేలమంది లబ్ధిదారుల్లో ఒక్కొక్కరిపై కనీసం రూ.లక్ష చొప్పున భారాన్ని మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. మార్చి 31వ తేదీలోగా రాష్ట్ర ప్రజల నుంచి ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా రూ.20 వేల కోట్లు దోచుకునేలా పన్నాగం పన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి చార్జీలు తీసుకోకుండా అమలు చేయాలి. ఈ డిమాండ్‌తో ఈ నెల 6న రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలను చేపడతాం. 7న ప్రతి జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు వినతి పత్రాలు అందజేస్తాం. హైదరాబాద్ నగరంలో ప్రత్యేకంగా హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపడతాం. **- కేటీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 25 లక్షల కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు ఆరోపించారు. ప్రజల నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండా ఎల్‌ఆర్‌ఎస్ కింద ప్లాట్లు, లే అవుట్లను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి కేటీఆర్ మాట్లాడారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ నేతలు చేసిన విమర్శలు, ఇచ్చిన హామీల వీడియో క్లిప్పింగులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే ...

''ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్, భట్టి విక్రమార్క సహా చాలా మంది కాంగ్రెస్ నేతలు ఎల్‌ఆర్‌ఎస్‌ను తప్పుపట్టారు. తాము అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని రద్దు చేస్తామన్నారు. ప్రజల దగ్గర ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండానే రెగ్యులరైజ్ చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజల రక్తాన్ని తాగుతున్నారంటూ భట్టి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రిజిస్ట్రేషన్ అయిన స్థలాలకు మళ్లీ ఎందుకు డబ్బులు కట్టాలని కూడా అడిగారు. నాడు భట్టి విక్రమార్క చేసిన డిమాండ్‌నే నేను పునరుద్ఘాటిస్తున్నా. రాష్ట్ర ప్రజల జేబుల నుంచి రూ.20 వేల కోట్లు దోచుకోవడానికి కాంగ్రెస్ సర్కారు ఎల్‌ఆర్‌ఎస్ స్కీం అమలు చేస్తుంటే భట్టి ఎందుకు మాట్లాడడం లేదు? ఆగమేఘాల మీద మార్చి 31వ తేదీ లోపల ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు కట్టాలని దరఖాస్తుదారులకు నేరుగా ఫోన్ కాల్స్ చేస్తున్నారు, ఇది రాష్ట్ర ప్రజల రక్తాన్ని తాగడం కాదా? ప్రజలెవరూ ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు కట్టవద్దు.

ఆ మాటలేవీ గుర్తులేవా?

తమ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తే.. 'నో ఎల్‌ఆర్‌ఎస్ – నో బీఆర్‌ఎస్'అన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈరోజు ప్రజలకు ఏం సమాధానం చెప్తారు? ఇప్పుడు ప్రజలు నో కాంగ్రెస్ అంటున్నారనే విషయం తెలియడం లేదా? అప్పుడు ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. రాష్ట్ర ప్రజల దగ్గర ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో సర్కారు డబ్బులు లాక్కోవడంపై స్పందించాలి. ఎల్‌ఆర్‌ఎస్ అంటే డబ్బులు దోచుకోవడానికేనని ప్రస్తుత మంత్రి సీతక్క అప్పట్లో మాట్లాడారు. మరి ఈరోజు ప్రజల నుంచి డబ్బులు దోచుకుంటున్నప్పుడు ఎందుకు మాట్లాడటం లేదు? ఎల్‌ఆర్‌ఎస్‌పైన మంత్రి కోమటిరెడ్డి అప్పట్లో కోర్టులో కేసువేశారు. ఆ కేసును వెనక్కి తీసుకున్నారా? లేక ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి కేసు వేస్తారా?..''అని కేటీఆర్ ప్రశ్నించారు. మార్చి 31 కల్లా డబ్బులు కట్టి తీరాలని ప్రజల మెడమీద కత్తి పెట్టారని, ప్రభుత్వ ఖజానా నింపడానికే ఈ కార్యక్రమం తీసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 6, 7 తేదీలలో జరిగే ఆందోళన కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు కట్టాలని అడుగుతున్న అధికారులను నిలదీయాలన్నారు.

ఎమ్మెల్సీ మనదే.. రెండు ఎంపీ సీట్లూ మనవే

'స్థానిక'ఎమ్మెల్సీతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు లోక్‌సభ సీట్లను గెలుచుకునేందుకు పకడ్బందీ కార్యాచరణ రూపొందిస్తున్నట్టు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశమై.. లోక్‌సభ ఎన్నికల కార్యాచరణపై, మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై చర్చించారు. ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఒకట్రెండు రోజుల్లోనే ఈ రెండు లోక్‌సభ నియోజకవర్గాలపైన పార్టీ అధినేత కేసీఆర్ విస్తృతస్థాయి సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్సీతోపాటు రెండు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే విజయం దక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే మారుతున్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా పార్టీ నేతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైంది

నిలదీసే రోజులు ముందున్నాయి: హరీశ్‌రావు

- ఖమ్మం, మహబూబాబాద్ బీఆర్‌ఎస్ నేతలతో భేటీ


సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఇప్పటికే వ్యతిరేకత ప్రారంభమైందని, అడుగడుగునా కాంగ్రెస్‌ను నిలదీసే రోజులు ముందున్నాయని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ నిలదీయడం బీఆర్‌ఎస్ పార్టీకే సాధ్యమవుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు నామా నాగేశ్వర్‌రావు, మాలోత్ కవితతో పాటు ఆయా సెగ్మెంట్ల పరిధిలోని ముఖ్యనేతలతో తెలంగాణ భవన్‌లో హరీశ్ సోమవారం భేటీ అయ్యారు. కేసీఆర్ ఆదేశాల మేరకు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై నేతలతో చర్చించారు. కాంగ్రెస్ మోసాలను నిలదీస్తూ ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని, అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే విఫలమైన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. రుణమాఫీ, విద్యుత్ కోతలు, ట్యాంకర్లతో పొలాలకు నీరు, గ్యాస్ సబ్సిడీలో 70 శాతం లబ్ధిదారులకు మొండి చేయి వంటి అంశాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గల్లీలో కాంగ్రెస్ ఉన్నా ఢిల్లీ వేదికగా తెలంగాణ గొంతు వినిపించేందుకు బీఆర్‌ఎస్ ఎంపీలు అవసరమనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ శ్రేణులు పక్కా ప్రణాళికతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రసార మాధ్యమాలతో పాటు సోషల్ మీడియా వేదికగా ప్రజలను జాగృతం చేయాలని హరీశ్ పిలుపునిచ్చారు.

ఉద్యోగాల్లో మహిళలకు అన్యాయం: కవిత



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో మహిళలకు అన్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 3ను తక్షణమే రద్దుచేయాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు జరుగుతున్న అన్యాయాలను నిరసిస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న ధర్నా చౌక్ వద్ద నల్ల రిబ్బన్‌లతో నిరసన చేపడుతున్నట్లు కవిత ప్రకటించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవలి గురుకుల పోస్టుల్లో 626 పోస్టులకు కేవలం 77 పోస్టులు మాత్రమే మహిళలకు దక్కడాన్ని గుర్తు చేశారు. 'ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దన్నగా అభివర్ణించడాన్ని స్వాగతిస్తున్నాం. కానీ ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో పెద్దన్న ఒక్క రూపాయి కూడా రాష్ట్రానికి ఇవ్వకున్నా రేవంత్ ప్రశ్నించలేదు. బడేమియాతో చోటేమియా రేవంత్‌కు ఉన్న బంధానికి ఈ వ్యాఖ్యలు అద్దంపడుతున్నాయి. అవినీతి నిరోధక చట్టాన్ని ప్రజాప్రతినిధులకు కూడా వర్తింపచేస్తూ తీర్పును ఇవ్వడాన్ని మేము స్వాగతిస్తున్నాం. రాష్ట్రంలో ఓటుకు కోట్లు కేసులో సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాన ముద్దాయిగా ఉన్నారు. ఈ కేసును త్వరగా చేపట్టాలని ప్రధానికి విజ్ఞప్తి చేస్తున్నాం'అని కవిత పేర్కొన్నారు.


మాతృమూర్తిని కోల్పోయి బాధలో ఉన్న పార్టీ ఎంపీ దామోదరరావును సోమవారం ఆయన నివాసంలో పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

పార్టీని వీడే నేతలతో నష్టం లేదు

- ఓటమిని పాఠంగా తీసుకుని ముందుకు వెళ్దాం
- పార్టీ శ్రేణులకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు
- ఎన్టీఆర్‌లాంటి నేతకే ఒడిదుడుకులు తప్పలేదు
- కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది
- రాబోయే రోజుల్లో ప్రజలు బీఆర్‌ఎస్ విలువ తెలుసుకుని ఆదరిస్తారని వ్యాఖ్య
- త్వరలో ఖమ్మంలో బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడి
- ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల నేతలకు దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్: పార్టీని వీడి వెళ్లే నేతలతో బీఆర్‌ఎస్‌కు ఎలాంటి నష్టం లేదని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని.. పార్టీ ఓడిపోయిన చోట్ల కూడా నేతలు ధైర్యంగా ముందుకు వెళ్లి కేడర్‌లో ఆత్మస్థైర్యం నింపాలని పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం తెలంగాణ భవన్‌లో జరిగిన ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. గతంలో ఎన్టీఆర్ వంటి నేతకే రాజకీయాల్లో ఒడిదుడుకులు తప్పలేదని.. మనకూ తప్పవనే విషయాన్ని అర్థం చేసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుదామని బీఆర్‌ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీపై అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. ఈ వ్యతిరేకతను బీఆర్‌ఎస్ సద్వినియోగం చేసుకునేలా పార్టీ నేతలు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు.

త్వరలో ఖమ్మంలో బహిరంగ సభ

లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా త్వరలో ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని కేసీఆర్ తెలిపారు. ''కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మన పదేళ్ల పాలనలో ప్రజలకు చేయాల్సిందంతా చేశాం. దళితబంధు వంటి మంచి పథకం తెచ్చాం. ఎన్నికల్లో ఓట్లు ఆశించి అమలు చేయలేదు. రాష్ట్రంలో ప్రతి పథకాన్ని మనం ఆయా వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకునే అమలు చేశాం. అయినా ప్రతిపక్ష పాత్ర పోషించాలని మనకు ఓటర్లు తీర్పునిచ్చారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ విలువను ప్రజలు తెలుసుకుని కచ్చితంగా ఆదరిస్తారు..''అని పేర్కొన్నారు.

భద్రాచలం ఎమ్మెల్యే గైర్హాజరు

కేసీఆర్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరుకాలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో బీఆర్‌ఎస్ తరఫున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే అయిన వెంకట్రావు.. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కుటుంబ సమేతంగా కలసిన విషయం తెలిసిందే. ఆయనకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సన్నిహితుడిగా పేరుంది. నిజానికి అసెంబ్లీ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరినా.. చివరి నిమిషంలో తిరిగి బీఆర్‌ఎస్‌లోకి వచ్చి ఎన్నికల్లో పోటీచేశారు. మరోవైపు సీఎం రేవంత్‌తో తెల్లం వెంకట్రావు భేటీ అయిన నేపథ్యంలో.. భద్రాచలానికి చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. ఎమ్మెల్యే పార్టీని వీడినా.. స్థానిక నేతలు అభద్రతా భావానికి లోనుకావొద్దని, పార్టీ వెంటే కొనసాగితే గుర్తింపునిస్తామని భరోసా ఇచ్చారు.

11న కాంగ్రెస్‌లోకి వెంకట్రావు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఈ నెల 11న కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవం సందర్భంగా బూర్గంపాడులో జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్ సమక్షంలో వెంకట్రావు కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

నలుగురితో బీఆర్‌ఎస్ తొలి జాబితా

▶ మొదటి పేజీ తరువాయి


వినోద్ కుమార్


కొప్పుల ఈశ్వర్

శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గాలకు సంయుక్త ఎన్నికల ఇన్‌చార్జీలుగా ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలను కేసీఆర్ నియమించారు.

నేడు ఉమ్మడి పాలమూరు నేతలతో భేటీ

లోక్‌సభ ఎన్నికల సన్నాహక భేటీలో భాగంగా కేసీఆర్ మంగళవారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు లోక్‌సభ నియోజక వర్గాలకు చెందిన పార్టీ ముఖ్య నేతలతో భేటీ అవుతారు. నాగర్‌కర్నూలు సిట్టింగ్ ఎంపీ పి.రాములు ఇప్పటికే బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఆయన కుమారుడు పి.భరత్‌ను బీజేపీ నాగర్‌కర్నూలు అభ్యర్థిగా ప్రకటించింది. మరోవైపు మహబూబ్‌నగర్ సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి బీఆర్‌ఎస్ టికెట్ దక్కదనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ రెండు స్థానాల నుంచి బీఆర్‌ఎస్ తరఫున ఎవరు బరిలోకి దిగుతారనే ఆసక్తి నెలకొంది. అయితే మంగళవారం నాటి భేటీ తర్వాత అభ్యర్థులను ప్రకటించే అవకాశముంది.

'స్థానిక' అభ్యర్థిగా ఆల ఖరారు..నేడు ప్రకటన

ఎమ్మెల్యేగా ఎన్నికైన కసిరెడ్డి నారాయణరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక నోటిఫికేషన్ సోమవారం వెలువడింది. దీంతో అభ్యర్థి ఎంపికపై బీఆర్‌ఎస్ కసరత్తు పూర్తి చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ముఖ్య నేతలతో సోమవారం తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డితో పాటు పార్టీ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ వెంకట్‌రాంరెడ్డి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. చర్చల అనంతరం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేశారు. మంగళవారం జరిగే భేటీ అనంతరం ఆయన పేరును అధికారికంగా ప్రకటించనున్నారు.

రాహుల్‌గాంధీతో పోటీకైనా రెడీ: నామా



వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ పోటీ చేసినా ఎదుర్కొనేందుకు తాను సిద్ధమని బీఆర్‌ఎస్ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు ప్రకటించారు. తనను మరోమారు ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు నామా కృతజ్ఞతలు తెలిపారు. 'ఖమ్మం జిల్లా ప్రజల ఆశీస్సులతో రెండుసార్లు ఎంపీగా గెలిచా. అసెంబ్లీలో ఎన్నికల్లో ఓడినా పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉంటారు'అని నామా ధీమా వ్యక్తం చేశారు.

బయ్యారం కోసం పోరాటం: మాలోత్ కవిత



మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా మరోమారు పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన కేసీఆర్‌కు ఎంపీ మాలోత్ కవిత ధన్యవాదాలు తెలిపారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం పార్లమెంటు వేదికగా తన పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి తప్పు చేశామనే చర్చ ప్రజల్లో జరుగుతోందని పేర్కొన్నారు. మహబూబాబాద్‌లో మళ్లీ బీఆర్‌ఎస్‌దే విజయమని అన్నారు.









మెజారిటీ వైపు ఉండటమే జీవితపు ఉద్దేశం కాదు,
వెర్రివాళ్లలో కలిసిపోకుండా తప్పించుకోవడం!
– మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 5 మార్చి 2024

ఎన్నదగిన తీర్పు

చట్టసభల సభ్యులు చెట్లకూ, పుట్లకూ ప్రాతినిధ్యం వహించరు. ఓటు హక్కున్న పౌరులు వారిని ఎన్నుకుంటారు. తమ ప్రతినిధులుగా చట్టసభలకు పంపుతారు. అలా ఎన్నికైనవారి ప్రవర్తన అందరికీ ఆదర్శనీయంగా వుండాలనీ, వుంటుందనీ జనం ఆశిస్తారు. అందుకు భిన్నంగా వున్నపక్షంలో ఆ సభ్యులపై మాత్రమే కాదు... ఆ చట్టసభలపైనే ప్రజలు నమ్మకం కోల్పోతారు. కనుకనే సోమవారం సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమైనది. చట్టసభల్లో ఓటేయటానికీ లేదా ప్రసంగించటానికీ లంచం తీసుకునే ప్రజాప్రతినిధులు చట్టపరమైన చర్యలనుంచి తప్పించుకోలేరంటూ ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన ఈ ఏకగ్రీవ తీర్పు మన ప్రజాస్వామ్యానికి పట్టిన అనేకానేక చీడల్లో ఒకదాన్ని తొలగించటానికి దోహదపడుతుందని భావించాలి. 1993 సంవత్సరంలో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై లోక్‌సభలో వచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని ఓడించటానికి అయిదుగురు జేఎంఎం సభ్యులు, జనతాదళ్ (ఏ) సభ్యుడొకరు లక్షలాది రూపాయలు లంచం తీసుకున్నారన్నది ప్రధానమైన ఆరోపణ. నాటి ప్రధాని పీవీ, ఈ ఆరుగురు సభ్యులూ ఆ తీర్మానాన్ని ఓడించటానికి ఉమ్మడిగా నేరపూరిత కుట్రకు పాల్పడ్డారన్నది ఆ ఆరోపణ సారాంశం.

లంచావతారాలైన ప్రభుత్వోద్యోగులు ముడుపులు తీసుకుంటే అవినీతి నిరోధక విభాగాలు అరెస్టు చేస్తాయి. వారి నేరం రుజువైన పక్షంలో శిక్ష కూడా పడుతుంది. ఇదే పని మరింత భారీ స్థాయిలో చేసే ప్రజాప్రతినిధి చట్టపరిధిలోకి ఎందుకు రారన్నది సామాన్యులకొచ్చే సందేహం. నిజానికి 1998లో అయిదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఇలాంటి ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పిస్తూ తీర్పు వెలువరించినప్పుడు రాజ్యాంగ నిపుణులు నివ్వెరపోయారు. ఈ తీర్పు పార్లమెంటరీ వ్యవస్థ పనితీరును తీవ్రంగా దెబ్బతీస్తుందనీ, ప్రజాస్వామ్యం పతనమవుతుందనీ హెచ్చరించారు. నాటి సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ కేసును అర్థం చేసుకున్న తీరూ, చట్టసభల సభ్యులకు రక్షణకల్పించే రాజ్యాంగ అధికరణ 105కు చెప్పిన భాష్యమూ లోపభూయిష్ఠం. పార్లమెంటు నిర్వహణ ప్రక్రియకు సంబంధించిన నిబంధనలూ, ఇతరత్రా ఆదేశాలకు లోబడి పార్లమెంటు సభ్యులకు వాక్ స్వాతంత్ర్యం వుంటుందన్నది 105(1) అధికరణ చెప్పిన మాట. సభలో సభ్యులు చేసే ప్రసంగాలు, ఏదైనా అంశంపై వారు వేసే ఓటు, సమర్పించే నివేదికలు న్యాయస్థానాల్లో సవాలు చేయటానికి అతీతమైనవని 105(2) అధికరణ చెబుతోంది. కానీ వారు చేసే ప్రసంగాలూ, వేసే ఓటూ వెనక ముడుపుల ప్రమేయం వున్నప్పుడు కూడా రక్షణ పొందగలరా అన్నదే ప్రధాన ప్రశ్న. అయితే చిత్రంగా నాటి ధర్మాసనంలోని మెజారిటీ సభ్యులు అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసిన అయిదుగురు జేఎంఎం ఎంపీలకూ 105(2) అధికరణ కింద రక్షణ వుంటుందని భావించారు. అయితే అదే తరహాలో లంచం తీసుకుని కూడా ఓటింగ్‌కు గైర్హాజరైన జనతాదళ్(ఏ) సభ్యుడు అజిత్ సింగ్‌కు మాత్రం ఆ రక్షణ వర్తించదని తీర్పునిచ్చారు. నాటి ముడుపుల కేసులో ఆరోపణ లెదుర్కొన్న అయిదుగురు జేఎంఎం సభ్యుల్లో ఒకరైన శిబూ సోరెన్ కుమార్తె సీతా సోరెన్ ఎమ్మెల్యేగా వుంటూ 2012లో రాజ్యసభ ఎన్నికల్లో ఒక స్వతంత్ర సభ్యుడికి ఓటేస్తానని మాటిచ్చి ముడుపులు తీసుకున్నారు. అయితే ఎన్నిక బహిరంగ విధానంలో జరగటంతో గత్యంతరం లేక తన పార్టీ ఎంపిక చేసిన సభ్యుడికి అనుకూలంగా ఓటేశారు. దానిపై నమోదైన కేసులో తనకు పీవీ కేసు తీర్పే వర్తిస్తుందనీ, కేసు కొట్టేయాలనీ ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కానీ లంచం తీసుకుని కూడా అప్పట్లో ఓటింగ్‌కు గైర్హాజరైన అజిత్ సింగ్ విషయంలో సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయమే సీతా సోరెన్‌కు కూడా వర్తిస్తుందని హైకోర్టు భావించి ఆ పిటిషన్‌ను తోసిపుచ్చటంతో 2014లో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఏదైనా కొత్త అంశం తెరపైకొచ్చినప్పుడు గత తీర్పులు నిశితమైన పరీక్షకు నిలబడక తప్పనిస్థితి ఏర్పడుతుంది. ఇప్పుడు సీతా సోరెన్ అప్పీల్ సర్వోన్నత న్యాయస్థానానికి ఆ మాదిరి అవకాశాన్నిచ్చింది. పౌరస్వేచ్ఛ పౌరులకు చట్టం ఇచ్చిన బహుమతి మాత్రమేననీ, ఆత్యయిక పరిస్థితి వున్నప్పుడు దాన్ని వెనక్కి తీసుకునే హక్కు రాజ్యానికుంటుందనీ ఏడీఎం జబల్‌పూర్ కేసుగా ప్రసిద్ధిచెందిన హెబియస్ కార్పస్ పిటిషన్ కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం మెజారిటీ తీర్పు వెలువరించింది. ధర్మాసనంలోని జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా ఒక్కరే దాంతో విభేదించారు. ఎమర్జెన్సీ కాలంలో నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం ఈ తీర్పును అడ్డం పెట్టుకుని దేశవ్యాప్తంగా వేలాదిమంది పౌరులను జైళ్లపాలు చేసింది. ఆ తీర్పును 1978లో సుప్రీంకోర్టు సవరించుకుంది. అలాగే 2017లో పుట్టస్వామి కేసులో గోప్యత హక్కుపై వెలువరించిన తీర్పు సందర్భంగా ఏడీఎం జబల్‌పూర్ కేసును సుప్రీంకోర్టు కొట్టేసింది. తమ తీర్పు ఏ పర్యవసానాలకు దారితీస్తుందో, ఎలాంటి దుస్సంప్రదాయాలకు సాకుగా మారుతుందో గమనించుకోవటం న్యాయస్థానాలకు తప్పనిసరి. ప్రజాప్రతినిధులు పార్లమెంటులో వ్యవహరించే తీరుపై లంచాల ప్రభావంవున్నా వారు చర్యకు అతీతులన్న గత భావనను ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తోసిపుచ్చటం హర్షించదగింది. ముడుపులు ఎక్కడైనా ముడుపులే. ప్రజాప్రతినిధులు అటువంటి ప్రలోభాలకు లొంగితే వారి అనైతికత మొత్తం వ్యవస్థనే నాశనం చేస్తుంది. చట్టసభలపై ప్రజానీకానికుండే విశ్వాసం కుప్పకూలుతుంది. అవినీతి కేసుల్లో దోషులందరికీ ఒకే చట్టం, న్యాయం వర్తిస్తుందన్న తాజా తీర్పు ఎన్నదగింది.

అమెరికా రాజకీయాల్లో భారతీయులు

విశ్లేషణ



ప్రశాంత్ ఝా

సిద్ధాంతపరంగా అమెరికా రెండు పార్టీల రాజకీయ వ్యవస్థను కలిగి ఉంది. కానీ ఆచరణలో, రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీలు రెండూ తమలో తామే సంకీర్ణాలుగా ఉంటున్నాయి. రిపబ్లికన్ పార్టీ దాని ఆధిపత్య స్థానంలోని కరడుగట్టిన మితవాదులకూ, పార్టీ లోపలే తమ వాణిని అట్టిపెట్టుకోవడానికి ఘర్షణ పడుతున్న గతకాలపు సంప్రదాయవాదులకూ మధ్య గొప్ప అంతర్యుద్ధానికి సాక్షీభూతంగా ఉంది. ఇక డెమోక్రటిక్ పార్టీ శిబిరం...సెంట్రిస్టులు, సెంటర్–లెఫ్టిస్టులు, లెఫ్టిస్టులకు నిలయంగా ఉంటోంది. అయితే, మితవాద పక్షం నుంచి ప్రగతిశీల వామపక్షాల వరకు, అమెరికాకు చేతనత్వం కలిగిస్తున్న ఐదు రాజకీయ పక్షాలలోనూ భారతీయ అమెరికన్ నాయకులు ప్రధాన పాత్రధారులుగా ఉండటమే ఇప్పుడు ప్రత్యేకంగా ప్రస్తావనార్హం.

కరుడుగట్టిన మితవాదం (ఫార్–రైట్)తో ప్రారంభిద్దాం. ఈ రాజకీయ ధోరణి, కింది విధానాలను కలిగివుంది. 1.కార్పొరేట్ పన్ను తగ్గింపుల ద్వారా ఆర్థిక స్థితిస్థాపకతను నిర్మించడంపై అమెరికా దృష్టి కేంద్రీకరించాలి. ఇంధన వాడకాన్ని ఎంతకైనా పెంచాలి. ఇప్పటికే ఉన్న ట్రేడింగ్ ఏర్పాట్లపై పూర్తిగా తిరోగమించాలి. 2. అమెరికా తన అంతర్జాతీయ కట్టుబాట్లను తగ్గించుకోవాలి. ఐరోపా నుండి వెనక్కి తగ్గాలి. ఎక్కువగా చైనాపై దృష్టి పెట్టాలి. 3. అమెరికా తన సరిహద్దులను పటిష్ఠంగా కాపాడుకోవాలి. సామాజిక జనాభా మార్పులు సంఘర్షణలను ఆహ్వానిస్తున్నాయి. వలసదారులు శ్వేత క్రైస్తవ జనాభా రాజకీయ ఆధిపత్యానికి కలగబోయే ముప్పును సూచిస్తున్నారు. 4. అమెరికా 'మేలుకొలుపు' (వోకిజం) రాజకీయాలను తిప్పికొట్టాలి. అవి లైంగికత లేదా జాత్యహంకారంపై విద్యా బోధన లేదా నిశ్చయాత్మక చర్య లేదా యుద్ధ వ్యతిరేక ఉద్యమాలు వంటివి ఏవైనా కావచ్చు. 5. అమెరికన్ ఫెడరల్ ప్రభుత్వం, నిఘా సంస్థలు రాజకీయంగా రాజీ పడ్డాయి. వీటి సిబ్బందిని తగ్గించడంతో సహా నాటకీయంగా రీబూట్ చేయడం అవసరం.

డోనాల్డ్ ట్రంప్ ఈ ధోరణికి నిజమైన మార్గదర్శకుడు, ముఖచిత్రం కూడా. అయితే, ఈ రోజు ఈ ఉద్యమం తదుపరి తరం ముఖాలలో వివేక్ రామస్వామి కూడా ఉన్నారు. నిజానికి, వాషింగ్టన్ డీసీలో జరిగిన కన్జర్వేటివ్ రాజకీయ కార్యాచరణ సమావేశంలో, ట్రంప్ ఉపాధ్యక్షుడి ఎంపికగా రామస్వామి కూడా ఫేవరెట్‌లలో ఒకరుగా ఉద్భవించారు.

మధ్యేవాద–సంప్రదాయవాద ధోరణిని పరిశీలిద్దాం. ఈ అంతరిస్తున్న మితవాద రిపబ్లికన్‌ల తరం మూడు కీలక అంశాలలో, కరుడుగట్టిన మితవాదం నుండి భిన్నంగా ఉంటుంది. 1. అంతర్జాతీయ కట్టుబాట్ల పరంగా, అమెరికా బలం... పొత్తులపై, 'నాటో' కూటమి పట్ల నిబద్ధతపై, భాగస్వామ్యాలపై ఆధారపడి ఉంటుందని ఈ స్కూల్ విశ్వసిస్తుంది. ఐరోపాలో రష్యా సవాలును, ఇండో–పసిఫిక్‌లో చైనా సవాలును, పశ్చిమాసియాలో ఇరాన్‌ను అమెరికా కలిసి ఎదుర్కోవాలని నమ్ముతుంది. 2. సంస్కృతీ యుద్ధాల పరంగా – మితవాద రిపబ్లికన్ లు అబార్షన్, తుపాకీ హక్కులు, విద్యపై పార్టీ ఎజెండాతో సరిపెట్టుకుంటారు. అన్నింటికీ మరీ ఎక్కువ ఆందోళన చెందకుండా విభిన్న దృక్కోణాల పట్ల అంగీకారంగా ఉంటారు. 3. మితవాద రిపబ్లికన్‌లు అమెరికన్ సంస్థలపై విశ్వాసం కలిగి ఉంటారు. అలాగే ప్రజాస్వామ్య నియమాలకు కట్టుబడి ఉంటారు. ఇది యునైటెడ్ స్టేట్స్ క్యాపిటల్ మీద జనవరి 6న జరిగిన మూక దాడి సమర్థకుల నుండి వైరుధ్యాన్ని సూచిస్తుంది.

సెనేట్‌లో మిచ్ మెక్‌కానెల్ ఈ విభాగానికి నాయకత్వం వహిస్తుండగా, నిక్కీ హేలీ ఇప్పుడు మితవాద రిపబ్లికన్ పార్శ్వానికి ప్రజాముఖంగా ఉన్నారు. ఆమె అయోవా, న్యూ హాంప్‌షైర్ ప్రైమరీలలో ట్రంప్ చేతిలో ఓడిపోయారు. తన సొంత రాష్ట్రం సౌత్ కరోలినాలోనూ ఓడారు. నెవాడాలో అయితే 'ఈ అభ్యర్థులు ఎవరూ కారు' విభాగంలో పోల్ అయిన ఓట్ల కంటే తక్కువ ఓట్లను పొందడం అనేది ఈ భావజాలం ఈరోజు రాజకీయంగా ఎంత బలహీనంగా ఉందో చూపిస్తుంది. కానీ మొత్తంగా నియోజకవర్గాల పరంగా ఈ వర్గం ప్రభావం చూపుతుంది. న్యూ హాంప్‌షైర్‌లో హేలీకి వచ్చిన 43 శాతం ఓట్లు, సౌత్ కరోలినాలో వచ్చిన 39 శాతం ఓట్లలో ఇది కనిపిస్తుంది. గెలవడానికి సరిపోదు కానీ, ఈ వర్గాలు ఇంటిలోనే ఉంటే మాత్రం సార్వత్రిక ఎన్నికల్లో ట్రంప్ అవకాశాలు నాటకీయంగా మసకబారుతాయి.



వివేక్ రామస్వామి



కమలా హారిస్



రో ఖన్నా



నిక్కీ హేలీ



రాజా కృష్ణమూర్తి



ప్రమీలా జయపాల్

డెమోక్రాట్లలో సెంట్రిస్టులు, సెంటర్ లెఫ్టులు, లెఫ్టులు...

ఇక మనం డెమోక్రటిక్ పార్టీ శిబిరానికి మరలుదాం. డెమోక్రటిక్ సెంట్రిస్ట్‌లకు, సెంటర్–లెఫ్ట్‌కు అధ్యక్షుడు జో బైడెన్ నాయకత్వం వహిస్తున్నారు. వివిధ ప్రపంచ రంగాల్లో అమెరికా పాత్రకు సంబంధించి మధ్యేవాద రిపబ్లికన్‌ల నిబద్ధతను ఈ స్కూల్ కూడా పంచుకుంటుంది. ఇది కరుడుగట్టిన మితవాద, ప్రగతిశీల భావజాలాలు రెండింటినీ కలుపుకొని, అమెరికాలో పెట్టుబడి వికాసంతో కొత్త పారిశ్రామిక విధానాన్ని నడిపించింది. ఇది అబార్షన్ హక్కులపై ప్రగతిశీల దృక్పథాన్ని కనబరుస్తుంది. అయితే దీనిని ప్రజారోగ్య సమస్యగా, మహిళల హక్కుల సమస్యగా చూస్తుంది. ఇది నిర్మాణాత్మక జాతి వివక్షను గుర్తిస్తుంది కానీ పెరుగుతున్న సంస్కరణలను కూడా విశ్వసిస్తుంది. అధిక లోటును దృష్టిలో ఉంచుకుని సామాజిక భద్రతా వలయాన్ని విస్తరించేందుకు ఇది కట్టుబడి ఉంది. వలసలపై, మరింత కఠినమైన చట్ట అమలు, మరింత మానవీయ విధానం రెండింటి మధ్య సమతుల్యతను సాధించడానికి ప్రయత్నిస్తుంది.

భారతీయ అమెరికన్లలో, ఇల్లినాయికి చెందిన కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి మధ్యేవాది(సెంట్రిస్ట్). కానీ సిలికాన్ వ్యాలీ నుండి హౌస్ రిప్రజెంటేటివ్‌గా ఉన్న రో ఖన్నా మాత్రం సెంటర్–లెఫ్ట్ వర్గానికి చెందిన అత్యంత ప్రముఖ హక్కుదారు. ఆయన మధ్యేవాదులకు, అభ్యుదయవాదులకు కుడివైపున ఉన్న స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. పైగా 2028లో అధ్యక్ష ఎన్నికల కోసం తానూ ఒక రాయి విసరాలని భావిస్తున్నారు. మార్కెట్‌కు సాంకేతిక పరిజ్ఞానం, మధ్య అమెరికాలో శ్రామిక వర్గానికి ఆర్థిక దేశభక్తి గురించి ఈయన మాట్లాడతారు. బహుళవాదం, మైనారిటీలకు ప్రాతినిధ్యం గురించి మాట్లాడతారు. చైనాపై కఠినమైన జాతీయ భద్రతా చర్యలు, గాజాలో కాల్పుల విరమణ, కార్పొరేట్ దోపిడీ, ప్రచార సంస్కరణల భాష గురించి కూడా మాట్లాడతారు.

చివరగా, ప్రగతిశీల ధోరణిలోకి వెళ్లి చూడండి. వారు తమ సొంత అంతర్గత వైరుధ్యాలను కలిగి ఉన్నప్పటికీ, విస్తృతంగా చెప్పాలంటే, ప్రగతిశీలురు స్వేచ్ఛా వాణిజ్యంపై సందేహాస్పదంగా ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ చర్యలను సైనిక–పారిశ్రామిక సముదాయం నడపడాన్ని వ్యతిరేకిస్తారు. అసమానత, దాన్ని ఎదుర్కొనే విధానపరమైన నిర్ణయాల్లో జాతి, లింగవివక్షలను ప్రాథమిక అంశాలుగా తీసుకుంటారు. కార్పొరేట్ అధికారానికి బలమైన ప్రత్యర్థులు. అధిక పన్నుల ప్రతిపాదకులకు వ్యతిరేకులు. తీవ్రమైన వాతావరణ విధాన రక్షకులు. ప్రపంచంలోని మానవ హక్కుల వంటి సమస్యలపై మరింత చురుకైన అమెరికన్ జోక్యానికి లాబీయిస్టులు.

ఈ విభాగంలోని ప్రముఖ ముఖాలు దేశ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, హౌస్ ప్రోగ్రెసివ్ కాకస్ చైర్ ప్రమీలా జయపాల్. పురోగామి విశ్వాసాలను కమలా హారిస్ పంచుకుంటున్నప్పటికీ, విదేశాంగ విధానాల విషయంలో మాత్రం ఆమె సెంట్రిస్ట్ వైఖరికి మారినట్టు కనిపిస్తోంది.

ఈ ఐదు రకాల ధోరణులు... అమెరికా రాజకీయాలు ఈరోజు ఎందుకు సందడిగా విభజించబడి ఉన్నాయో, పైగా మునుపెన్నడూ లేనంత సంక్లిష్టంగా ఎందుకు ఉన్నాయో వివరించడంలో సహాయపడవచ్చు. పైగా భారతీయ అమెరికన్లు అక్కడ తమ కొత్త నేల భవిష్యత్తు గురించి ప్రజాస్వామ్యబద్ధంగా, తరచుగా ఒకరితో ఒకరు వాదించుకుంటున్నారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్
('ది హిందూస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అంతా మురికి...



నేను చెప్పినట్టుగా, బీజేపీ ఇంకేమాత్రమూ వాషింగ్ మెషీన్ కాదు. అవినీతి పరులని ముద్ర పడిన అందరినీ ఏరుకుంటున్న డస్ట్‌బిన్. అవినీతిపరులను చేర్చుకునే బీజేపీ శాఖ లాగానూ, వాళ్ల తరఫున బలవంతపు వసూళ్లకు పాల్పడే శాఖ గానూ 'ఈడీ' ద్విపాత్రాభినయం చేస్తోంది.

– ప్రియాంక చతుర్వేది, మహారాష్ట్ర రాజ్యసభ ఎంపీ

పశువులు



జార్ఖండ్‌లో స్పెయిన్ యాత్రికురాలి మీద జరిగింది దారుణాతి దారుణం. 'జాతి గర్వం' కోసం పోరాడే సమయం ఇది కానేకాదు. ఏ సమాజంలోనైనా దుర్నీతికీ, హింసకూ తావులేదు. ఆమె కోలుకోవాలి. ఒక ఉదాహరణగా నిలిచేలా నిందితులకు వేదన కలగాలి. (ఏడుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని వార్త.)

– అద్వైత కళ, స్క్రీన్ రైటర్

ఎందుకు సిగ్గు?



చరిత్ర ప్రకారం, హిందూ దేవతలు, వారి లైంగికత పట్ల సిగ్గుపడేవారు మూడు రకాల జనాలు: 1. ముస్లిం పాలకులు. 2. వలసవాద పాలకులు. 3. జాతీయవాద పురుషులు (ఎక్కువగా సాత్విక శాకాహారులు).

– దేవ్‌దత్ పట్నాయక్, మైథాలజిస్ట్

ముందు దేశం



మీరు బీజేపీ క్రైస్తవ ముఖమా అని ఒకరు నన్ను చీదర పుట్టించేలా అడిగారు. బీజేపీకి హిందూ, క్రైస్తవ, ముస్లిం, సిక్కు ముఖాలు లేవనీ, మేమందరమూ ఇండియా ముఖాలమనీ బదులిచ్చాను.

– సేవియో రోడ్రిగ్స్, బీజేపీ గోవా నాయకుడు

ఉండకూడని అధికారం



అంతర్జాతీయ సంబంధాల్లో రావాల్సిన మార్పు ఏదైనా ఉంది అంటే అది, ఐక్యరాజ్య సమితిలో వీటోను వీటో చేయడం. ఉమ్మడి కార్యాచరణను నిలపగలిగే అధికారం ఏ ఒక్క దేశానికో ఉండకూడదు.

– ప్రియంవద గోపాల్, ప్రొఫెసర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

సముచిత పురస్కారం

మల్టీమీడియా జర్నలిస్ట్, 'ఇండియా టుడే' మాజీ సీనియర్ ఎడిటర్ ఎస్. వెంకట్ నారాయణ్ అర్ధ శతాబ్దం పైగా దేశ విదేశాలలో గణుతికెక్కిన ప్రముఖ పాత్రికేయులు. 1979–84 మధ్యకాలంలో ఇండియా టుడేలో ఆయన పనిచేశారు. ఆయన జర్నలిస్ట్‌గా ప్రపంచంలో 65 దేశాలు పర్యటించారు. పాత్రికేయునిగా ఆయన 1968లో గుజరాత్ లోని అహ్మదాబాద్‌లో 'ద టైమ్స్ ఆఫ్ ఇండియా' విలేఖరిగా తన ప్రస్థానం ప్రారంభించారు. 'లండన్ సండే టైమ్స్'లో 1975లో సమ్మర్ స్కాలర్‌గా, 1978లో అమెరికా 'బోస్టన్ గ్లోబ్'లో గెస్ట్ రైటర్‌గా ప్రతిభ కనబరచారు.

తెలంగాణ హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో 1943 సెప్టెంబర్ 6వ తేదీన ఎస్. వెంకట్ నారాయణ్ జన్మించారు. హైదరాబాద్ నిజాం కళాశాలలో పట్టభద్రులై, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచీ 1967లో జర్నలిజంలో పీజీ కోర్స్‌లో ప్రథమ స్థాయిలో నిలచి 'షోయబుల్లా ఖాన్ స్వర్ణ పతకం' అందుకున్నారు. శ్రీలంకలోని 'ది ఐలాండ్' వార్తా పత్రిక కోసం రాసిన నారాయణ్, విదేశాలలో అనేక టీవీ, రేడియో నెట్‌వర్క్‌ల కోసం పని చేస్తున్నారు. 1999లో ఫారిన్ కరస్పాండెంట్స్ క్లబ్‌కు నాయకత్వం వహించిన మొదటి భారతీయుడు వెంకట్ నారాయణ్. ప్రస్తుతం అనేక జాతీయ అంతర్జాతీయ పత్రికలు, మేగజీన్లకు అనేక అంశాలపై వ్యాసాలు రాస్తున్నారు.




ఎస్. వెంకట్ నారాయణ్

భారత ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, వీపీ సింగ్, ఐకే గుజ్రాల్; పాకిస్తాన్ అధ్యక్షుడు జనరల్ జియా ఉల్ హక్, పాకిస్తాన్ ప్రధానులు బేనజీర్ భుట్టో, ఇమ్రాన్ ఖాన్; శ్రీ లంక అధ్యక్షులు జేఆర్ జయవర్ధనే, చంద్రికా కుమారతుంగ, మహింద రాజపక్స; జింబాబ్వే అధ్యక్షుడు రాబర్ట్ ముగాబె, భూటాన్ రాజు జిగ్మే సింఘె వాంగ్చుక్ సహా వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధానులు, రాజులనూ, ఉన్నత స్థాయి మంత్రులనూ, ఇతర ప్రముఖులనూ ఇంటర్వ్యూ చేసిన ఘనత సాధించారు. 1998లో కాకతీయ విశ్వ విద్యాలయం నుంచీ జర్నలిజంలో గౌరవ డాక్టొరేట్ అందుకున్నారు. 1983లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ సాధించిన అద్భుతమైన ఎన్నికల విజయాన్ని తనదైన శైలిలో 131 పేజీల పుస్తకంలో ఆవిష్కరించారు వెంకట్ నారాయణ్. బహుముఖ సమర్థత కలిగిన ఎన్టీర్ వ్యక్తిత్వాన్ని సింహావలోకనం చేశారు.

– నందిరాజు రాధాకృష్ణ

(నేడు హైదరాబాద్ రవీంద్ర భారతిలో ప్రముఖ పాత్రికేయుడు ఎస్. వెంకట్ నారాయణ్‌కు పొత్తూరి స్మారక పురస్కార ప్రదానం)

ఇతరుల మంచిని గ్రహించిన జీవధార...



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

మహాకవులు విశ్వనాథ, సురవరం ప్రతాపరెడ్డి దృష్టిలో రాయలు కళింగాంధ్రం నుంచి పెనుగొండ వరకు విస్తరించిన మహా సామ్రాజ్య వైభవానికి శ్రీకాకుళం కేంద్రమయింది. కాబట్టే – సకల దోషాలకు శ్రీకాకుళం 'పిడుగుపాటు'గా తోచింది!

కనుకనే –

"ఇమ్ముగం గాకుళమ్ము మొదలీవరకుంగల యాంధ్ర పూర్వరా / జ్యమ్ముల పేరు చెప్పిన హృదంతరములో చలించిపోవు నా / ద్రమ్ముగు చిత్తవృత్తుల పురాభవ నిర్ణయమేని ఎన్ని జ / న్మమ్ములుగాగ నీతనువునన్ బ్రవహించునా యాంధ్రరక్తముల్"

అని విశ్వనాథ కీర్తిస్తే... తెలుగు తెలంగాణ ప్రాంతం నుంచి సురవరం వారు ప్రాంతీయ భేదాలకు అతీతంగా యావదాంధ్రులకు నిష్కల్మషమైన ఆత్మీయ ఆశీస్సులతో ప్రాతినిధ్యం వహించిన మహనీయుడు. తెలుగువారి ఉనికిపట్టుల సుదీర్ఘ చారిత్రక ఆధారాలను అందించిన చారిత్రికుడు సురవరం వారు. క్రీ.శ. 1000 నుండి 1907 దాకా ఎనిమిది యుగాల తెలుగువారి ఆచార వ్యవహారాలను వెల్లడించిన సంస్కర్త. రాజరాజ నరేంద్రునికి 400 ఏండ్లకు ముందే తెలుగుదేశంలో విరివిగా వ్యాపించిన హేతువాద బౌద్ధ ధర్మం ఎందుకు మాయమై పోయిందో తేట తెల్లం చేసిన పండితుడు సురవరం. ఆంధ్రుల తొమ్మిది శతాబ్దాల సాంఘిక చరిత్ర సంగ్రహంగానే అందించినా తెలుగు వారి భాషా సంస్కృతుల ఖ్యాతిని ఎన్ని పోలికలతో, ఎంత గంభీరంగా ఆయన చాటారో అందమైన ఈ క్రింది పద్యం తెలుపుతుంది:

"పరిపూర్ణ పావనాంభస్స రంగోద్వేగ
గౌతమీ గంభీరగ మనమునకు
ఆలంపురీ నందనారామ విభ్రాజి
మల్గోబ ఫలరాజ మధుర రుచికి
ఆంధ్రీకుమారీ సమాయుక్త పరిపూత
తుంగా పయస్సు మాధుర్యమునకు
ఖండశర్కరజాతి, ఖర్జూర, గోక్షీర,
ద్రాక్షాదియుత రామరసమునకును
అమృత నిష్యంది పల్లకీ ష్లోదమునకు
రాగిణీ దివ్య సమ్మోహరావమునకు
తేనెతేటల ననకంపు సోనలకును
సాటియగును మా తెనుగు భాషామతల్లి!

(ఆంధ్రీనది = తుంగభద్రకు ఉపనది; రామరసం = మహారాష్ట్ర వారి మధుర రసం; జాజికాయ, జాపత్రి, ఏలకులు, బాదం, ద్రాక్ష, పాలు, దోస, సార, కరెపుచ్చ మున్నగు వాటి విత్తులు, సొంఠి, చెక్కెర, కుంకుమ పువ్వు వగైరా వస్తువులు నూరి కలిపినదాన్ని రామరసం అంటారు. అలాగే ఆలంపూరు, బనగానపల్లె – మల్గోబ, దిల్ పసందు అనే మామిడిపండ్లకు ప్రసిద్ధ స్థలాలు)

రెండో మాట



తెలుగు వారికి ఇంత ప్రాచీన చరిత్ర, సంస్కృతీ వైభవం ఉన్నా పరాయి పాలనలో సుదీర్ఘ కాలం పాటు కాలం వెళ్లబుచ్చవలసి రావడాన్ని జాతి ఈసడించుకొంది. అందుకే అస్వతంత్రతా బతుకును తెలుగు వారు 'ఇంక భరించలేరని' తీర్మానించుకుని తెగబడవలసి వచ్చింది. అప్పుడు గానీ, విశ్వనాథ అన్నట్టు ఆంధ్రులు ఇళ్ల ద్వారబంధాలపై ఏనాటినుంచో అజాపజా లేకుండా మూలుగుతున్న 'తొలి తెలుగు లిపిని పోల్చుకుని కూడబలుకు కోలేక పోయారు'! ఇలాంటి అస్వతంత్రతా బతుకు తెలుగువారి కెందుకు అని తీర్మానించుకుని తిరగబడాల్సి వచ్చింది. పొట్టి శ్రీరాముల ఆత్మార్పణంతోగాని ఆంధ్ర రాష్ట్ర అవతరణ సిద్ధించలేదనీ విశ్వనాథ ప్రకటించారు. కనుకనే శ్రీకాకుళాన్ని 'కలుషములకెల్ల పిడుగు' అని చాటాడు. ఎలా? తెలుగుతల్లులు శౌర్య రసాన్ని ఉగ్గుపాలతో రంగరించి మరీ 'బొడ్డు కోయని కూనకే' పోసి పెంచినవాళ్లు గనుక!


అందుకే 300 ఏళ్ల కిందటనే తమిళ పండితుడైన అయ్యప్ప దీక్షితులు... తమిళం సహా ఇతర భారతీయ భాషల వారికి లేని ప్రత్యేక సంస్కృతి ఆంధ్రులకు ఉందని అన్నారు. 'ఆంధ్రుల నుండి వారి భాష, భాషలోని నుడికారం, వారి భావాలు, వారి శిల్పకళలు, వారి పల్లెపాటలు, కథలు, విశ్వాసాలు, వారి చరిత్ర, సాంఘిక ఆచారాలను తీసివేస్తే, రేపే వారు అడవి జాతులతో కలిసిపోయే ప్రమాదం ఉంద'ని హెచ్చరించారు. ఇతరులలోని ఉత్తమ కళ లను స్వీకరించి తమ వాటితో మేళవించుకోగల్గడం నాగరిక లక్షణం. కనుకనే ఆంధ్రులు తమ భాషకు శ్రావ్యతను సమకూర్చి కర్ణాటక సంగీతమనే పేరుతో ఉత్తమ కళను మొత్తం దక్షిణాపథానికే వ్యాప్తి చేయగలిగారు. ఈ కారణం చేతనే కూచిపూడి నృత్యం, రామప్పగుడిలోని నృత్య శిల్పాలు ప్రసిద్ధిలోకి వచ్చాయి. అందువల్లనే శ్రీకాకుళానికి అంత పేరూ, ప్రతిష్ఠా! కనుకనే అప్పటికీ, ఇప్పటికీ, మరెప్పటికీ –

'చిరు తరంగముల్ కలిసి, జీబులుకట్టిన వంశధారలో /తరుముకు వచ్చె తెల్గుల ప్రతాప శిఖల్....'

abkprasad2006@yahoo.co.in

మార్గదర్శకత్వం అవసరం

భగవత్తత్వం బోధపరుచుకోవడానికి అడ్డదారి మార్గాలంటూ ఏవీ లేవని, వ్యక్తిలో లేనిది ఏదీ విశ్వంలో లేదు గనుక, ఏ వ్యక్తికైనా అందుకు అంతర దృష్టి ఒకటే సరియైన మార్గమని తత్త్వవేత్తలు చెబుతారు. జ్ఞాన సముపార్జనకు అడ్డదారి ప్రయత్నాల వలన ఉపయోగం ఉండదు సరికదా ఎంతో విలువైన సమయం వృథా అవుతుంది. అదేగాకుండా తగిన ఫలితం లభించక నిరాశ మొదలై, వ్యక్తిత్వాన్ని మరింతగా కృంగదీసేదిగా పరిణమిస్తుందనీ పెద్దల బోధనలు చెబుతాయి. పెద్దలు నిర్దేశించిన ఒక క్రమమైన పద్ధతిలో ప్రయత్నించి సాధన చేయడం వలననే వేదాంత విషయక జ్ఞాన సముపార్జన సాధ్యమౌతుందని మహా భారతం కూడా బోధించింది. ఆంధ్ర మహాభారతం, శాంతిపర్వం, చతుర్థాశ్వాసంలోని ఈ క్రింది పద్యంలో మనసుకు హత్తుకునే ఒక అర్థవంతమైన ఉదాహరణతో ఈ సంగతి విశదీకరించబడింది.



జ్యోతిర్మయం

**అనలము దోచునే తరువునందు గుఠారముఖంబు లైన సా
ధనముల ద్రెవ్వ? సజ్జనహితా! తగ ద్రచ్చిన గాక; యట్ల యి
త్తనువు నలంగ జేసి పరతత్త్వము గాంతు మనంగ రాదు; వి
న్నునువున నాగమోక్తమథనం బొనరించిన గాని యారయన్.**

చెట్టులో అగ్ని నిక్షిప్తమై ఉంటుంది. అలాగని గొడ్డలితో నరికి చెట్టు లోపలి అగ్నిని చూద్దామని ప్రయత్నిస్తే కనబడుతుందా? కనపడదు కదా! కానీ ఒక చెట్టుకు మరొక చెట్టు రాపిడి వలన అగ్ని పుట్టి అడవులను దహించి వేయడం తెలిసిందే. అలాగే ఆగమ కర్మలలో అగ్నిని రాజెయ్యడానికి ఎండిన రెండు చెట్టు కొమ్మల ముక్కలతో (అరణులు) రాపిడి ద్వారా నిప్పును పుట్టించడం కూడా చూస్తూవుంటాం. ఇది దేనిని చెబుతుంది అంటే, ఏ విషయాన్నైనా ఎలా గ్రహింపుకు తెచ్చుకోవాలో అలా ప్రయత్నం చేస్తే ఆ ప్రయత్నం సఫలం అవుతుంది కాని, అడ్డదిడ్డమైన పద్ధతులు అవలంబించడం వలన ప్రయోజనం వుండదు అన్న సంగతిని చెబుతుంది. శరీరాన్ని నిద్రాహారాలకు దూరం చేసినందువలన పరమమైన జ్ఞానం లభిస్తుందని చేసే ప్రయత్నం ఆ కారణం చేతనే సరైనది కాదని పెద్దలు చెబుతారు. గురువు మార్గదర్శకత్వంలో నిర్దేశిత పద్ధతులలో ప్రయత్నించడం వలననే అది సాధ్యపడుతుంది అని పై పద్యంలో భావం. ఒక సందర్భంలో మనువుకు దేవగురువైన బృహస్పతికి జరిగిన సంభాషణలో, బృహస్పతి మనువుకు చెప్పిన మాటలు ఇవి.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.దశమి రా.1.43 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** మూల ఉ.11.23 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.9.50 నుండి 11.22 వరకు, తదుపరి రా.8.46 నుండి 10.18 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.39 నుండి 9.27 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.47 వరకు, **అమృతఘడియలు:** లేవు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.20, **సూర్యాస్తమయం:** 6.03.

విద్యుత్ వైర్లు తెగిపడి ముగ్గురి మృతి

వరంగల్ జిల్లా మోత్యతండాలో దుర్ఘటన


సునీల్


రవి


దేవేందర్

పర్వతగిరి: విద్యుత్ వైర్లు తెగిపడి ముగ్గురు దుర్మరణం పాలైన విషాద ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మోత్యతండాలో చోటుచేసుకుంది. వివరాలిలా.. మోత్యతండాలో సోమవారం దుర్గమ్మ పండుగ చేసుకుంటున్నారు. సాయంత్రం 6 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన భూక్య రవి(35) ఇంటి వద్ద ట్రాలీ ఆటోలో తెచ్చిన టెంట్ హౌస్ సామగ్రిని దించుతున్న క్రమంలో విద్యుత్ తీగలు ఆకస్మాత్తుగా తెగి కింద పడ్డాయి. ఈ క్రమంలో టెంట్ హౌస్ వర్కర్ సునీల్(19)తో పాటు భూక్య రవి, ఆయన కొడుకు జశ్వంత్, రవి బంధువు రాయపర్తి మండలం జగన్నాథపల్లి కొత్తతండాకు చెందిన గుగులోతు దేవేందర్(30)కు విద్యుత్ షాక్ తగిలింది. దేవేందర్‌తో పాటు తొర్రూరు మండలం జమస్తాన్‌పురం గ్రామం సుందర్‌నాయక్‌తండాకు చెందిన టెంట్ హౌస్ వర్కర్ భానోతు సునీల్ అక్కడికక్కడే మృతి చెందారు. 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో భూక్య రవి మార్గమధ్యలో మరణించాడు. అతడి కుమారుడు భూక్య జశ్వంత్ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, పండుగ పూట ముగ్గురు మృతిచెందడంతో తండాలో ఒక్కసారిగా విషాదచాయలు నెలకొన్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సింగిల్ ఫేస్ వైర్లు తెగి పడటంతోనే ఈ ముగ్గురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయంటూ తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓవర్ లోడ్ కారణంగా విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

'కాళేశ్వరం' బాధ్యులపై చర్యలు షురూ

- హైకోర్టుకు తెలిపిన ఏజీ
- కుంగుబాటుకు బాధ్యులైన అధికారులను తొలగిస్తాం
- ఎన్‌డీఎస్‌ఏ కమిటీ నివేదిక తర్వాత మరిన్ని చర్యలు • న్యాయ విచారణ అంశాన్ని కూడా పరిశీలిస్తున్నాం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ పియర్ల కుంగుబాటుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సమర్పించిన ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు ప్రారంభించామని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి హైకోర్టుకు తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఏర్పాటు చేసిన కమిటీ పూర్తి స్థాయి పరిశీలన చేసి నివేదిక సమర్పించిన తర్వాత మరిన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. పదవీ విరమణ పొందిన సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తితో విచారణ అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామన్నారు.

పిల్‌పై విచారణ: మేడిగడ్డ ఘటనకు కారకులెవరో తేల్చేందుకు గాను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దర్యాప్తునకు ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. కాంగ్రెస్ నేత జి.నిరంజన్ గత నవంబర్‌లో ఈ పిల్ దాఖలు చేశారు. కాగా ఫైలింగ్ నంబర్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున న్యాయవాది టి.నరేందర్‌రావు, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి, కేంద్రం తరపున న్యాయవాది ఎల్.ప్రణతిరెడ్డి, సీబీఐ తరపున స్పెషల్ పీపీ టి.సృజన్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వం కొన్ని అవకతవకలు గుర్తించింది

మేడిగడ్డ రిజర్వాయర్ కుంగుబాటుపై ప్రభుత్వ దర్యాప్తు ఎంత వరకు వచ్చింది? ఏం చర్యలు తీసుకున్నారు? తదితర వివరాలతో నివేదిక అందజేయాలని గత నెల విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇందుకు సంబంధించిన నివేదికను ధర్మాసనానికి ఏజీ అందజేశారు. అనంతరం వాదనలు వినిపించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కొన్ని అవకతవకలు జరిగినట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఎన్‌డీఎస్‌ఏ అధికారులు గత ఏడాది అక్టోబర్ 24, 25 తేదీల్లో ప్రాజెక్టును సందర్శించి ప్రాథమిక విచారణ జరిపారు. మేడిగడ్డ బ్యారేజీ పియర్ కుంగిపోవడానికి కారణాలను ఎన్‌డీఎస్‌ఏ సమర్పించింది. 'ప్రణాళిక, రూపకల్పన, నాణ్యత, నియంత్రణ, ఆపరేషన్–నిర్వహణకు సంబంధించిన సమస్యలతో పాటు పియర్లు ఏకశిలగా ఉండటంతో కదిలి పగుళ్లు ఏర్పడ్డాయి. ఇతర కారణాలు కూడా ఉండొచ్చు. కచ్చితమైన కారణాలను గుర్తించడానికి పూర్తి స్థాయిలో దర్యాప్తు జరపాలి..'అని ప్రాథమికంగా అభిప్రాయపడింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. ఈ విభాగం ప్రాథమిక విచారణ జరిపి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించింది. దీని ఆధారంగా ఈఎన్‌సీ వెంకటేశ్వర్లును తొలగించాం. ఇతర అధికారులపై కూడా చర్యలు తీసుకుంటాం. అయితే 'కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్, 1952లోని సెక్షన్ 3(1) ప్రకారం హైకోర్టు/సుప్రీంకోర్టు మాజీ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది'అని వివరించారు. ఈ నేపథ్యంలో తదుపరి విచారణను ధర్మాసనం 4 నెలలకు వాయిదా వేసింది.

ధాన్యం మిల్లింగ్ గడువు మే 15 వరకు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: గత సంవత్సరం (2022–23) యాసంగి ధాన్యం మిల్లింగ్ గడువు (సీఎంఆర్)ను మే 15 వరకు పొడిగిస్తూ కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ దీపేంద్ర సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మిల్లింగ్ గడువు పెంచాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 23న కేంద్రానికి లేఖ రాసింది. గత సంవత్సరం యాసంగికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ వచ్చే మే 15 వరకు పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది.

47 మంది డీఎస్పీల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా మరో మారు పెద్ద సంఖ్యలో డీఎస్పీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 47 మంది సివిల్ డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవి గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పెళ్లి తేదీ కోసం వస్తుండగా ఘోర ప్రమాదం


రోషిణి


రుమానా


వాసీఫారిఫత్


సలీమాబీ


అబ్దుల్ రహమాన్

పెళ్లింట మృత్యు గంట

- ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం • మృతుల్లో ఏడు నెలల పాప సహా ముగ్గురు చిన్నారులు
- కొత్తకోట హైవే టెక్కలయ్య దర్గా సమీపంలో దుర్ఘటన

కొత్తకోట రూరల్: పెళ్లి ముహూర్తం పెట్టుకునేందుకు కారులో బయలుదేరిన ఆ కుటుంబాన్ని మృత్యువు వెంటాడింది. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో జరిగిన ఘోర ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు సహా ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వనపర్తి జిల్లా కొత్తకోట జాతీయ రహదారి–44పై ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. కొత్తకోట ఎస్‌ఐ మంజునాథరెడ్డి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన మహ్మద్ ముఖ్తార్ అహ్మద్ కుమారుడు ఖాజాకుత్బుద్దీన్ అలియాస్ అలీకి హైదరాబాద్ బండ్లగూడలోని గౌస్‌నగర్‌కు చెందిన ఓ యువతితో పెళ్లి సంబంధం కుదిరింది. సోమవారం పెళ్లి తేదీని నిర్ణయించాలనుకున్నారు. ఆదివారం రాత్రి 8.30 గంటలకు బళ్లారి నుంచి ఖాజాకుత్బుద్దీన్ అక్క, ఆమె భర్త, వారి పిల్లలు, చెల్లెలు, ఆమె భర్త వారి పిల్లలు, నాన్నమ్మ కలిసి మొత్తం 12 మంది కుటుంబ సభ్యులతో మారుతీ ఎర్టిగ కారులో బయలుదేరారు.

డ్రైవర్ నిద్ర మత్తుతో..

రాత్రి 2 గంటల సమయంలో అంతా గాఢ నిద్రలో ఉండగా.. కారు నడుపుతున్న కుత్బుద్దీన్‌ను కూడా నిద్ర మత్తు ఆవరించింది. దీంతో అదుపు తప్పిన కారు టెక్కలయ్య దర్గా సమీపంలో పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సలీమాబీ (95), వాసీఫారిఫత్ (7 నెలలు), అబ్దుల్ రహమాన్ (39), రుమానా (2), రోషిణి (4) అక్కడికక్కడే దుర్మరణం పాలవగా.. కుత్బుద్దీన్, షాజహాన్ బేగం, హబీబ్, ఖదీరున్, హుస్సేన్, షఫీ అహ్మద్ గాయపడ్డారు. కుత్బుద్దీన్ వనపర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా సీట్ల మధ్య చిక్కుకున్న ఓ చిన్నారి సురక్షితంగా బయటపడింది. కొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కారులో స్థలం లేకపోవడంతో రైల్లో హైదరాబాద్‌కు బయలుదేరిన ఖాజాకుత్బుద్దీన్ తండ్రి మహ్మద్ ముఖ్తార్ అహ్మద్, తల్లి జమీలాభాను సోమవారం ఉదయం వనపర్తి ఆస్పత్రికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు.

బంధువు అంత్యక్రియలకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి


జనార్దన్‌రెడ్డి, ప్రతిభ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. సదాశివనగర్‌కు చెందిన భార్యాభర్తలు ఏనుగు జనార్దన్‌రెడ్డి(47), ఏనుగు ప్రతిభ(36) సోమవారం ఉదయం స్కూటీపై పద్మాజివాడికి బయల్దేరారు. ఈ క్రమంలో నిజామాబాద్ వైపునకు అతివేగంతో దూసుకొచ్చిన గుర్తు తెలియని ట్రక్కు ఢీకొట్టింది. ప్రతిభపైనుంచి వాహనం వెళ్లడంతో ఘటనాస్థలంలోనే మృతి చెందింది. జనార్దన్ తీవ్రగాయాల పాలయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని జనార్దన్‌ను కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడు జనార్దన్‌రెడ్డి కొన్నేళ్లుగా పౌల్ట్రీ వ్యాపారంతోపాటు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ప్రస్తుతం సింగిల్ విండో డైరెక్టర్‌గా కొనసాగుతున్నాడు. జనార్దన్, ప్రతిభలకు ఇద్దరు కొడుకులు కాగా, ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో చిన్న కొడుకు రుతిక్‌రెడ్డి మృతి చెందాడు. పెద్ద కొడుకు కార్తీక్‌రెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లో చదువుతున్నాడు.

ముగ్గురు కుమారులను చంపి..

తానూ ఉరేసుకుని..

- నగదు లావాదేవీల నేపథ్యంలో ఓ తండ్రి దారుణం
- రూ.లక్ష కట్టిన వారికి ఏడాది పాటు ప్రతినెలా రూ.50వేలు ఇస్తామంటూ వసూళ్లు
- ఏపీ రాజాంలోని ఓ ఫౌండేషన్ పేరిట దందా
- మొదట్లో బాగానే సాగినా తర్వాత చేతులెత్తేసిన వైనం
- డబ్బులిచ్చిన వారి ఒత్తిళ్లు తట్టుకోలేక దురాగతం


మృతి చెందిన పిల్లలు

శంకర్‌పల్లి: కన్నతండ్రే కాలయముడై ముగ్గురు పసి పిల్లలను పాశవికంగా హత్య చేశాడు. చిన్నారులకు పడుకున్న మంచానికే ఉరేసి.. నిద్రలోనే అనంతలోకాలకు పంపించాడు. ఆ తర్వాత తాను కూడా ఉరేసుకున్నాడు. ఈ దారుణ ఘటన రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం టంగటూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నీరటి రవికుమార్(35) బయోసీడ్ కంపెనీలో ఉద్యోగి. విధుల్లో భాగంగా ఏపీకి వెళ్లి వచ్చే క్రమంలో విజయనగరం జిల్లా రాజాంలో జీఎస్‌ఎన్ ఫౌండేషన్ సభ్యులతో పరిచయం ఏర్పడింది. వీరిలో గుంటూరుకు చెందిన తిరుపతిరెడ్డితో సాన్నిహిత్యం పెరిగింది. ఈయన ప్రోద్బలంతో జీఎస్‌ఎన్ సంస్థ పేరిట రవికుమార్ గ్రామాల్లో డబ్బు వసూలు చేశాడు. రూ.లక్ష కట్టిన వారికి ప్రతి నెలా రూ.50 వేల చొప్పున 12 నెలల పాటు చెల్లించేవాడు. ఏడాదిలోపే ఆరు రెట్లు ఎక్కువగా ఇస్తుండడంతో గ్రామాల్లో గ్రూపు సభ్యులు పెరిగారు. ఇలా సుమారు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు వసూలు చేశాడు. దందా ప్రారంభంలో సమయానికి వాయిదాలు చెల్లించినా.. ఆతర్వాత ఇబ్బందులు పడ్డాడు. దీనికి తోడు 2023 డిసెంబర్ నుంచి ఫౌండేషన్ కార్యకలాపాలు నిలిపివేసినట్లు తెలుస్తోంది. దీంతో డబ్బులు ఇచ్చిన వ్యక్తుల నుంచి ఒత్తిడి పెరగడంతో గ్రామంలో ఉండలేక భార్య శ్రీలత, చిన్నకుమారుడు ఉదయ్‌కిరణ్(7)ను తీసుకుని శంకర్‌పల్లికి మకాం మార్చాడు. ఉదయ్‌కిరణ్ పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో యూకేజీ చదువుతుండగా.. పెద్ద కుమారుడు సాయికిరణ్(13), రెండో కుమారుడు మోహిత్(10) చిలుకూరులోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 6, 5వ తరగతి చదువుతున్నారు. ఆదివారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో శ్రీలత బుల్కాపురంలోని తన పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రవి.. చిన్నకుమారుడిని వెంటపెట్టుకుని చిలుకూరు రెసిడెన్షియల్ పాఠశాలకు చేరుకున్నాడు. పిల్లలకు కటింగ్ చేయించుకుని తీసుకువస్తానని చెప్పి ఇంటికి చేరుకున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత పడుకున్న మంచానికే ఉరేసి ముగ్గురు పిల్లలను చంపేశాడు. అనంతరం తన పొలంలో ఉన్న షెడ్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం ఇరుగుపొరుగు వారు గమనించడంతో విషయం బయటకు వచ్చింది. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మోకిల పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

తోటి విద్యార్థిని కొట్టి చంపేశారు

- మాస్ కాపీయింగ్‌కు చీటీలు రాయొద్దన్నందుకు ఆగ్రహం
- డిగ్రీ విద్యార్థిపై మూకుమ్మడి దాడి
- బోధన్‌లోని బీసీ వసతి గృహంలో ఘటన
- పోలీసుల అదుపులో నిందితులు


వెంకట్

బోధన్‌టౌన్(బోధన్): మాస్ కాపీయింగ్ వ్యవహారంలో తోటి విద్యార్థులు చేసిన దాడిలో డిగ్రీ విద్యార్థి మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం తిప్పాపూర్ తండాకు చెందిన వెంకట్ (23) బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతూ స్థానిక బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు హాస్టల్ వార్డెన్ స్వామి.. వెంకట్‌కు స్టడీఅవర్‌లో లీడర్ బాధ్యతను అప్పగించారు. ఈ క్రమంలో స్టడీ అవర్‌లో ఇంటర్ విద్యార్థి అనిల్ మాస్ కాపీయింగ్‌కు పాల్పడేందుకు చీటీలు రాయడాన్ని గమనించిన వెంకట్ మందలించాడు. అయితే వెంకట్ చేయి చేసుకున్నాడని అనిల్ అదే వసతి గృహంలో ఉంటూ డిగ్రీ చదువుతున్న తన అన్న దిలీప్‌కు చెప్పాడు. అనంతరం దిలీప్, అనిల్‌తో పాటు తోటి విద్యార్థులు శివ, కృష్ణ, లక్ష్మణ్, పరమేష్, నితిన్ రాత్రి 11 గంటల సమయంలో నిద్రిస్తున్న వెంకట్ గదికి వెళ్లి దాడి చేశారు. దీతో వెంకట్ స్పృహ తప్పి కింద పడిపోయాడు. ఫిట్స్ వచ్చాయని భావించిన విద్యార్థులు మొదట వెంకట్ చేతిలో తాళం చేతులు పెట్టారు. ఫలితం లేకపోవడంతో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వెంకట్‌ను పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఆందోళనకు గురైన విద్యార్థులు అక్కడి నుంచి పరారయ్యారు.

పోలీసు స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన: మృతుడు వెంకట్ కుటుంబ సభ్యులు, బంధువులు బోధన్‌కు చేరుకొని పోలీస్‌స్టేషన్ ఎదుట రహదారిపై ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు చేరుకుని ఘటనకు కారణమైన వారిని అరెస్టు చేశామని చెప్పారు. కాగా, పోలీసులు వార్డెన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వార్డెన్ స్వామిని సస్పెండ్ చేసి, వాచ్‌మన్ గంగాధర్‌ను విధుల నుంచి తొలగించామని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి ప్రకటించారు. మృతుడు వెంకట్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

విచారణకు ఆదేశాలు..

నిజామాబాద్ అర్బన్: బీసీ వసతి గృహంలో తోటి విద్యార్థుల దాడిలో డిగ్రీ విద్యార్థి వెంకట్ మృతి ఘటనపై బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ సీరియస్ అయ్యారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా బీసీ వసతి గృహ ఇన్‌చార్జి అధికారి రమేశ్, అదనపు అధికారి గంగకిషన్ బోధన్ వెళ్లి విచారణ చేశారు. మాస్‌కాపీయింగ్ వ్యవహారమే ఘటనకు ప్రధాన కారణమని నిర్ధారించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ అందజేశారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

పాలకుర్తి(రామగుండం): యాసంగిలో పండిస్తున్న పంటలకు నీరందక ఎండిపోతున్నాయనే ఆవేదనతో పెద్దపల్లి జిల్లా వేంనూర్‌లో అన్నదాతలు సోమవారం రోడ్డెక్కారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండేడ గ్రామాల రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేంనూర్ పంప్‌హౌస్ నుంచి నందిమేడారం వెళ్లే పైప్‌లైన్ నుంచి ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నీరందక కళ్ల ముందే పంటలు ఎండిపోతున్నాయని, రూ.లక్షలు నేలపాలవుతున్నాయని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయాన్ని ధర్మపురి ఎమ్మెల్యేకు విన్నవించినా స్పందన లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సాగునీరు విడుదల చేయాలని, లేకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దాదాపు 50 మంది రైతులు పాల్గొన్నారు.

పసుపు పంటకు రికార్డు ధర

- క్వింటాకు రూ.15,111 చెల్లింపు

మెట్‌పల్లి: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మార్కెట్‌లో సోమవారం పసుపు పంట రికార్డు ధర పలికింది. క్వింటాకు రూ.15,111 చెల్లించి కొనుగోలు చేశారు. ఈ సీజన్ ప్రారంభంలో అత్యధికంగా రూ.13,555 పలుకగా.. తర్వాత రూ.14 వేలు దాటింది. తిరిగి రూ.13 వేలకు పడిపోయింది. ప్రస్తుతం రూ.15 వేలకు పైగా పలికింది. ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండకు చెందిన మహిళా రైతు వర్షిణి తీసుకొచ్చిన పసుపు నాణ్యతగా ఉండడంతో ఈ ధర చెల్లించారు. కొన్నేళ్లుగా పసుపు పంటకు ఆశించిన ధర అందక రైతులు తీవ్ర నిరాశ చెందుతూ వస్తున్నారు. ఈ సీజన్‌లో గిట్టుబాటు ధర అందుతుండడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చంపడానికొచ్చి.. హతమయ్యాడు

- ప్రేమిస్తున్నానంటూ మూడేళ్లుగా యువతి వెంటబడిన యువకుడు
- యువతి జన్మదినాన్ని డెత్ డేగా మారుస్తానంటూ పోస్టులు
- కత్తితో యువతి తల్లి, తాతపై దాడి
- యువతి కుటుంబ సభ్యుల ఎదురుదాడిలో మృతి


బోగ మహేశ్

మల్యాల(చొప్పదండి): ప్రేమ పేరుతో మూడేళ్లుగా వేధిస్తున్న యువకుడు.. నేరుగా ఆ యువతి ఇంటికే వెళ్లి కుటుంబ సభ్యులపై కత్తితో దాడికి తెగబడ్డాడు. యువతి కుటుంబ సభ్యులు ఆత్మరక్షణ కోసం ఆ యువకుడిపై దాడి చేయగా.. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన బోగ మహేశ్ తన దూరపు బంధువైన తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నానంటూ మూడేళ్లుగా ఫోన్‌లో వేధిస్తున్నాడు. భరించలేని ఆ యువతి ఈనెల 2న మల్యాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కక్ష పెంచుకున్న మహేశ్ ఆ యువతిని చంపేందుకు కత్తితో సోమవారం మధ్యాహ్నం 2.20 గంటలకు తక్కళ్లపల్లిలోని యువతి ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయానికి మొదట యువతి తల్లి కనపడగా.. ఆమెపై కత్తితో దాడికి యత్నించాడు. తప్పించుకునే క్రమంలో కత్తి ఆమె కాలికి తగిలింది. అనంతరం అక్కడే మంచంలో పడుకున్న యువతి తాతపైనా దాడి చేసి కత్తితో పొడవగా అయనకూ గాయాలయ్యాయి. ఈ క్రమంలో యువతి తల్లి అక్కడే ఉన్న తన తమ్ముడు నర్సయ్యతో కలిసి మహేశ్‌ని ఆపే ప్రయత్నం చేస్తుండగానే మరోసారి దాడికి యత్నించాడు. ఈ క్రమంలో ముగ్గురి మధ్య జరిగిన ఘర్షణలో మహేశ్ కింద పడిపోయాడు. అక్కడే ఉన్న బండరాయితో మహేశ్‌పై యువతి తల్లి దాడి చేయగా.. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దాడిలో గాయపడిన నర్సయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించారు.

పంచాయితీ పెట్టించినా మారని తీరు

యువతికి దూరపు బంధువు కావటంతో పరిచయం పెంచుకున్న మహేశ్.. ఆమె ఫోన్ నంబర్ తీసుకున్నాడు. ప్రేమించాలంటూ మూడేళ్లుగా వెంటపడి వేధిస్తున్నాడు. విషయాన్ని యువతి తన తల్లిదండ్రులకు చెప్పడంతో రెండేళ్ల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి కొంతకాలం యువతికి ఫోన్ చేయకుండా దూరంగా ఉన్న మహేశ్.. ఇటీవల కొద్దిరోజులుగా ఫోన్‌లో వేధిస్తున్నాడు. ఈ క్రమంలో పలుమార్లు పంచాయితీ పెట్టించారు. పెద్దలతో నూ హెచ్చరించారు. అయినా అతడిలో మాత్రం మార్పు రాలేదు.

యువతి జన్మదినాన్ని డెత్ డేగా మారుస్తానంటూ పోస్టులు

యువతి జన్మదినం ఈనెల 6న ఉండగా.. డెత్‌డేగా మారుస్తానంటూ మహేశ్ పోస్టులు పెడుతున్నాడు. దీంతో ఈనెల 2న పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని సదరు యువతి తెలిపింది. కాగా, మహేశ్ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో యువతితోపాటు తల్లి, అన్న, వదిన, అమ్మమ్మ, తాతయ్యపై కేసు నమోదు చేసినట్లు మల్యాల ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్ స్థానిక పోలీసులతో కలిసి పరిశీలించారు. యువతి ఇంటి వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పరివార్

ప్రధానిపై లాలూ విమర్శలతో రాజకీయ రగడ

మోదీకి సంతానమెందుకు లేదన్న ఆర్జేడీ నేత

- కుటుంబం లేదు, హిందువే కాదని వ్యాఖ్యలు
- తనకు దేశమంతా కుటుంబమేనన్న మోదీ
- మతి చెడి తనపై విమర్శలంటూ ధ్వజం
- ప్రధానికి మద్దతుగా ఏకమైన బీజేపీ నేతలు
- తామంతా మోదీ కుటుంబమేనంటూ ప్రకటనలు
- సోషల్ ప్రొఫైల్స్‌లో 'మోదీ కా పరివార్' క్యాప్షన్
- లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీకి సరికొత్త నినాదం!



"నువ్వేమీ మరీ అంత పెద్దవాడివి కాదు. మాట్లాడితే కుటుంబ రాజకీయాలంటూ మాపై పదేపదే దాడికి దిగుతున్నావ్! కుటుంబాల గురించి నీకెందుకు? నీకు సంతానం ఎందుకు లేదో చెప్పు. కుటుంబమే లేదు నీకు. అయోధ్యలో రామాలయం కట్టామంటూ గొప్పలు చెప్పుకుంటావు. కానీ నువ్వసలు హిందువువే కాదు. అమ్మ మరణిస్తే ప్రతి హిందువూ శిరోముండనం చేయించుకుంటాడు. నువ్వు మాత్రం చేయించుకోలేదు. కారణమేంటో చెప్పు! దేశమంతటా విద్వేష వ్యాప్తి చేస్తున్నావ్!" - పట్నా ర్యాలీలో మోదీపై లాలూ విమర్శలు



"ఇండియా కూటమిలోని విపక్ష నేతలంతా అవినీతి, వారసత్వ, సంతుష్టీకరణ రాజకీయాల్లో పీకల్లోతున కూరుకుపోయారు. పార్టీ ఏదైనా ఝూట్-లూట్ (అబద్ధాలు, దోపిడీ) అన్నదే వాళ్లందరి నైజం. దీనిపై ప్రశ్నిస్తే నాకు కుటుంబమే లేదంటూ ఆక్షేపిస్తున్నారు. 140 కోట్ల మంది భారతీయులే నా కుటుంబం. నా భారతదేశమే నా కుటుంబం. ఒక సేవకునిలా ప్రజా క్షేమానికే నా జీవితాన్ని అంకితం చేశా. దేశసేవ చేయాలనే కలను నిజం చేసుకోవడానికి చిన్న వయసులోనే ఇల్లు వీడా. నా జీవితమంతా తెరిచిన పుస్తకం. ప్రతి భారతీయునికీ ఆ విషయం తెలుసు" - ఆదిలాబాద్ సభలో మోదీ

న్యూఢిల్లీ/ఆదిలాబాద్: ప్రధాని నరేంద్ర మోదీపై ఆర్జేడీ నేత లాలూప్రసాద్ విమర్శలు పెను రాజకీయ వివాదానికి దారితీశాయి. దేశవ్యాప్తంగా మంటలు రాజేశాయి. మోదీకి కుటుంబమూ లేదు, సంతానమూ లేరంటూ ఆదివారం పట్నా జన్‌సందేశ్ ర్యాలీలో లాలూ ఎద్దేవా చేశారు. ఆయనసలు హిందువే కాదంటూ ఆక్షేపించారు. కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, రాహుల్‌తో పాటు ఇండియా కూటమికి చెందిన విపక్ష నేతల సమక్షంలో లాలూ చేసిన ఈ వ్యాఖ్యలకు మోదీ సోమవారం గట్టిగా కౌంటరిచ్చారు. దేశం కోసమే జీవితాన్ని అంకితం చేశానని చెప్పారు. భారతదేశం, 140 కోట్ల మంది ప్రజలే తన కుటుంబమని పునరుద్ఘాటించారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ సభలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలను బీజేపీ నేతలంతా వెంటనే అందిపుచ్చుకున్నారు. తామంతా మోదీ కుటుంబమేనంటూ ఆయనకు పెద్ద ఎత్తున మద్దతుగా నిలిచారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా మొదలుకుని రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, జి.కిషన్‌రెడ్డి, అర్జున్‌రామ్ మేఘ్వాల్ తదితర కేంద్ర మంత్రులు, నేతలంతా ఈ మేరకు ప్రకటనలు చేశారు. మోదీపై లాలు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. విపక్షాలపై పెద్దపెట్టున విరుచుకుపడ్డారు. తామంతా మోదీ కుటుంబమేనంటూ ప్రధానికి బాసటగా నిలిచారు. అంతేగాక సోషల్ మీడియా అకౌంట్లలో తమ పేరు పక్కన 'మోదీ కా పరివార్' అంటూ జోడించుకున్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ ముఖ్యమంత్రులు, రాష్ట్రాల మంత్రులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు కూడా ఇదే బాటపట్టి 'మోదీ కా పరివార్' అంటూ సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు. చివరికి ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ కూడా తన ఎక్స్ ప్రొఫైల్‌కు 'మోదీ కా పరివార్' అని చేర్చుకున్నట్టు ట్రోల్స్ వెల్లువెత్తుతున్నాయి! విపక్షాలు మరోసారి లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీకి చేజేతులా పదునైన నినాదమే అందించాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

చిల్లర వ్యాఖ్యలు: బీజేపీ

మోదీపై వ్యక్తిగత విమర్శలు విపక్షాలకు కొత్తేమీ కాదంటూ బీజేపీ ఆగ్రహం వెలిబుచ్చింది. "17 ఏళ్లుగా ఇలాంటి చిల్లర వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నాయి. ఇది నిజంగా బాధాకరం" అని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది అన్నారు. విపక్షాల రాజకీయ దురహంకారానికి దేశ ప్రజలు తగిన విధంగా బదులు చెబుతారన్నారు. "మొత్తం దేశాన్నే తన కుటుంబంగా మార్చుకున్నారు మోదీ. అందుకే ఎంత పని చేసినా ఆయనకు అలుపే రాదు. గత పదేళ్లలో మోదీ ఒక్క సెలవు కూడా తీసుకోలేదు" అని చెప్పారు. మోదీకి సంతానం లేదన్న లాలు వ్యాఖ్యలను కూడా సుధాన్షు తీవ్రంగా తప్పుబట్టారు. "హిందూ మతం గురించి లాలుకేం తెలుసు? అసలు విపక్ష ఇండియా కూటమిలో ఒక్కరు కూడా హిందువు లేదు! సనాతన ధర్మంలో భక్తికే పెద్దపీట తప్ప కుమారునికి కాదు. భారత్‌లో గురుశిష్య సంప్రదాయముంది తప్ప తండ్రీ కొడుకుల సంప్రదాయం లేదు. రామభక్తుడైన హనుమంతునికే ఊరూరా గుళ్లున్నాయి. రాముని కుమారులు లవకుశులకు ఎక్కడైనా ఆలయముందా?" అని ప్రశ్నించారు. "మోదీ నాయకత్వంలో 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడం మోదీ లక్ష్యమైతే ఎలాగైనా అధికారం సాధించి 2047 దాకా కూడా దాన్ని తమ కుటుంబాల గుప్పిట్లోనే ఉంచుకోవడం విపక్షాల లక్ష్యం" అంటూ దుయ్యబట్టారు. వీలైనంత భారీగా అవినీతికి పాల్పడి, తద్వారా తాము, తమ కుటుంబాలు మాత్రమే తరతరాలకు సరిపడా సంపద పోగేసుకోవాలన్నది విపక్షాల ఉద్దేశమని ఆరోపించారు.

నేరగాళ్లే మోదీ పరివారం: కాంగ్రెస్

ఇండియా కూటమి నానాటికీ బలోపేతమవుతుండటం చూసి అధికార బీజేపీలో అక్కసు పెరిగిపోతోందని కాంగ్రెస్ ఆరోపించింది. సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే 'మోదీ కా పరివార్' పేరిట కొత్త డ్రామాకు తెర తీసిందని మండిపడింది. "రైతులను కార్లతో తొక్కించి చంపిన నేరగాడి తండ్రయిన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా, క్రీడాకారిణులను లైంగికంగా వేధించిన ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్ వంటి బీజేపీ నేతలే నిజమైన మోదీ కుటుంబం. అదే 'మోదీ కా అస్లీ పరివార్'" అంటూ ఎద్దేవా చేసింది. "మణిపూర్ హింసాకాండకు బలైన మహిళలకు మోదీ కుటుంబంలో చోటేది? ఢిల్లీ శివార్లలో నిరసన గళమెత్తుతున్న రైతులను తన కుటుంబంగా చెప్పుకోగలరా? ఉపాధి లేక నిత్యం ఆత్మహత్యల బాట పడుతున్న నిరుద్యోగ యువతను తన కుటుంబమని చెప్పుకోరేం? బీజేపీ సర్కారు కేవలం క్రూరమైన నేరగాళ్లు, మోదీ సన్నిహిత పెట్టుబడిదారుల కోసం మాత్రమే పని చేస్తోంది" అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ దుయ్యబట్టారు. "రైతుల హత్య, మహిళలపై అత్యాచారాలు... ఇదే నిజమైన మోదీ కుటుంబం" అంటూ కాంగ్రెస్ నేతలంతా విమర్శలు గుప్పిస్తున్నారు. బ్రిజ్‌భూషణ్, అజయ్ మిశ్రా తదితరులు తమ సోషల్ హ్యాండిల్స్‌కు 'మోదీ కా పరివార్' అని జోడించుకోవడాన్ని విస్తృతంగా షేర్ చేస్తున్నారు. సంఘ్ పరివార్ కాస్తా చివరికి మోదీ పరివార్‌గా మారిందంటూ ఎద్దేవా చేస్తున్నారు.

2019లో 'మై భీ చౌకీదార్'

సాక్షి, న్యూఢిల్లీ: మోదీపై విపక్షాలు వ్యక్తిగత విమర్శలు చేయడం ఇది తొలిసారి కాదు. 2007 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మోదీపై 'మౌత్ కా సౌదాగర్ (మృత్యు వ్యాపారి)' అంటూ అప్పటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లో మత అల్లర్లకు కారకుడనే అర్థంలో ఆమె చేసిన విమర్శలు వివాదానికి దారితీశాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బాగా నష్టం చేశాయి. అనంతరం 2018లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మోదీని ఉద్దేశించి 'చౌకీదార్ చోర్ హై' (కాపలాదారే దొంగ) అంటూ రాహుల్ ఎద్దేవా చేశారు. తాను దేశానికి చౌకీదార్‌లా ఉంటానన్న మోదీ వ్యాఖ్యలపై రాహుల్ ఎక్కుపెట్టిన ఆ విమర్శలూ 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పాటు విపక్షాలన్నింటికీ తీవ్రంగా చేటు చేశాయి. ఆ వ్యాఖ్యలను బీజేపీ ప్రచారాస్త్రంగా మార్చుకుని ఘనవిజయం సాధించింది. మోదీ తన ట్విట్టర్ ప్రొఫైల్‌లో 'నరేంద్ర మోదీ చౌకీదార్' అని చేర్చుకున్నారు. బీజేపీ నేతలు కూడా 'మై భీ చౌకీదార్' అని ప్రొఫైల్స్‌లో చేర్చుకున్నారు.

ఆ రోజే క్యాన్సర్ బయటపడింది

ప్రస్తుతం క్యాన్సర్‌ను జయించా: ఇస్రో ఛైర్మన్ సోమ్‌నాథ్



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సూర్యుడి సంబంధ పరిశోధన కోసం భారత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆదిత్య ఎల్-1 మిషన్ ప్రయోగంతో ఆనందంలో మునిగిపోయిన ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమ్‌నాథ్‌నూ అశుభ వార్త ఒకటి కొద్దిరోజులపాటు కలవరపాటుకు గురిచేసింది. ఆయన కడుపులో పెరుగుతున్న క్యాన్సరే అందుకు కారణం. శస్త్రచికిత్స, కీమోథెరపీ తర్వాత ఆయన ప్రస్తుతం క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్ రెండో తేదీన జరిగిన ఘటన తాలూకు వివరాలను ఆయన ఇటీవల వెల్లడించారు. టార్మాక్ మీడియా సంస్థ వారి ' రైట్ టాక్' కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అందరితో ఆ విషయాలను పంచుకున్నారు. '' సెప్టెంబర్ రెండో తేదీన ఆదిత్య ఎల్-1 మిషన్ లాంచ్ ప్రక్రియకు కొద్ది వారాల ముందు నుంచే కడుపు నొప్పిగా అది మొదలైంది. మొదట అదే ఏడాది జూలై 14వ తేదీన చంద్రయాన్-3 ప్రాజెక్ట్ సందర్భంగానూ అనారోగ్యం బారినపడ్డా. ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పని ఒత్తిడి కారణంగా అలా అయ్యిందేమో అనుకుని దానిని సంగతి వదిలేశా. కానీ ఆ తర్వాతా కడుపు నొప్పి నన్ను వెంటాడింది. ఇక లాభం లేదనుకుని ఆదిత్య ఎల్-1 ప్రయోగం విజయవంతంగా పూర్వవగానే అదే రోజు చెన్నైలోని ఓ ఆస్పత్రిలో స్కానింగ్‌లు, టెస్ట్‌లు చేయించుకున్నా. పెద్ద పేగులో చిన్నపాటి క్యాన్సర్ కణితి పెరుగుతోందని పరీక్షల్లో బయటపడింది. ఆ వార్త విని నా కుటుంబసభ్యులంతా షాక్‌కు గురయ్యారు. కుటుంబసభ్యులే కాదు ఇస్రోలో శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, ఇంజనీర్లు హతాశులయ్యారు. శస్త్రచికిత్స తప్పదని వైద్యులు సూచించడంతో నాలుగు రోజులు ఆస్పత్రికే పరిమితయ్యా. సర్జరీ, కీమో థెరపీ తర్వాత ఇప్పుడు పూర్తిగా కోలుకున్నా. ఏటా స్కానింగ్, చెకప్ చేయించుకుంటా. నాకు క్యాన్సర్ వంశపారంపర్యంగా వచ్చిందని చెబుతున్నారు. దాన్ని జయించా. చిన్నపాటిది కాబట్టి మొదట్లోనే గుర్తించి శస్త్రచికిత్సతో తొలగించారు'' అని సోమ్‌నాథ్ చెప్పుకొచ్చారు.



నెదర్లాండ్స్‌లోని తన నివాసంలో భార్య పెట్రాతో బెర్ట్ జాన్సెన్

మారిన గుండెతో 4 దశాబ్దాలు

గిన్నిస్ ప్రపంచ రికార్డ్ సృష్టించిన నెదర్లాండ్స్ వ్యక్తి

ఆమ్‌స్టర్‌డ్యామ్: గుండె కండరాల సమస్య కారణంగా అవయవాలకు అతని గుండె సరిగా రక్తాన్ని సరఫరా చేయలేని పరిస్థితి. ఈ దుస్థితి ఇలాగే ఉంటే మరో 6 నెలలకు మించి బతకవు అని వైద్యులు కరాఖండిగా చెప్పేశారు. అదేకాలంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి గుండె ఈయనకు సరిగ్గా సరిపోయింది. వెంటనే హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీతో ఈయనకు వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. 1984లో గుండె మార్పిడి చేయించుకున్నాక ఇప్పటికీనిక్షేపంగా ఉన్నారు. ప్రపంచంలో గుండె మార్పిడి చేయించుకున్న తర్వాత అత్యధిక కాలం జీవించి ఉన్న వ్యక్తిగా గిన్నిస్ రికార్డు సృష్టించిన నెదర్లాండ్స్ వాసి, 57 ఏళ్ల బెర్ట్ జాన్సెన్ కథ ఇది. ప్రస్తుతం గ్లైడర్ పైలెట్‌గా పనిచేస్తున్న ఇతనికి గుండె మార్పిడి చికిత్స జరిగి నేటికి 39 ఏళ్ల 8 నెలల 29 రోజులు. 17 ఏళ్లకు ఫ్లూ వ్యాధి సోకినపుడు వైద్యులు పరీక్షలు చేసి కార్డియో మయోపతి అనే సమస్య ఉందని గుర్తించారు. త్వరగా గుండె మార్చకపోతే ప్రాణానికే ప్రమాదమని తేల్చారు. లండన్ ప్రమాదంలో మరణించిన వ్యక్తి గుండె సరిపోలడంతో ఆయనకు ఆ గుండెను అమర్చారు. 'హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తే 16 ఏళ్లకు మించి బతకరనేది అవాస్తవం. గుండె మార్పిడి అద్భుతం అనేందుకు నేనే నిలువెత్తు నిదర్శనం. బర్త్‌డేను అయినా పెద్దగా పట్టించుకోనుగానీ ఆపరేషన్ జరిగిన తేదీ నా జీవితంలో అత్యంత ముఖ్యమైన రోజు' అని జాన్సెన్ వ్యాఖ్యానించారు. 'గుండె మార్పిడి చేయించుకున్న వ్యక్తి జీవనశైలి ఆరోగ్యకరంగా ఉండాలి' అని ఆపరేషన్ చేసిన ప్రఖ్యాత వైద్యుడు మ్యాగ్డీ యాకూబ్ చెప్పారు. '40 ఏళ్ల క్రితం నెదర్లాండ్స్‌లో ఇలాంటి ఆపరేషన్ సౌకర్యాలు లేవు. అందుకే జాన్సెన్‌ను లండన్‌లోని హేర్‌ఫీల్డ్ ఆస్పత్రిలో గుండెమార్పిడి చేశా' అని చెప్పారు.

మరింత గడువివ్వండి

ఎలక్టోరల్ బాండ్ల వివరాలపై సుప్రీంలో ఎస్‌బీఐ పిటిషన్

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్న ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించేందుకు గడువును జూన్ 30వ తేదీ వరకు పొడిగించాలని కోరుతూ ఎస్‌బీఐ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గత నెలలో ఎలక్టోరల్ బాండ్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు మార్చి 6వ తేదీలోగా బాండ్ల వివరాలను ఎన్నికల సంఘానికి అందించాలంటూ ఆదేశించిన విషయం తెలిసిందే. దాతల వివరాలను రహస్యంగా ఉంచేందుకు కోడ్‌ల రూపంలో వాటిని వేర్వేరుగా ఉంచామని, వాటిని ఒక చోట చేర్చి సరిపోల్చేందుకు చాలా సమయం పడుతుందని అందులో వివరించింది. రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలిచ్చే పథకం రాజ్యాంగ విరుద్ధమంటూ ఫిబ్రవరి 15న విచారణ సమయంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

హైతీలో తీవ్ర అరాచకం

- రాజధానిలోని జైలుపై దాడి.. 3,700 మంది ఖైదీల పరారీ
- ప్రధాని గద్దె దిగాలంటూ సాయుధ గ్రూపుల డిమాండ్

పోర్ట్ ఆఫ్ ప్రిన్స్: కరేబియన్ దేశం హైతీలో అరాచకం రాజ్యమేలుతోంది. రాజధాని పోర్ట్ ఆఫ్ ప్రిన్స్‌లోని జైలుపై సాయుధ దుండగులు ఆదివారం దాడులు చేశారు. అంతకుముందు పలు పోలీస్‌స్టేషన్లపైనా దాడులు చేశారు. జైల్లుపై దాడి ఘటనలో 12 మంది చనిపోగా, సుమారు 3,700 మంది ఖైదీలు పరారయ్యారు. అయితే, అధ్యక్షుడు మొయిజెను హత్య చేసిన కొలంబియా మాజీ సైనికులు సహా సుమారు 100 మంది ఖైదీలు జైలులోని తమ బ్యారక్‌లలోపలే ఉండిపోయారని సీఎన్ఎన్ తెలిపింది. బయటికొస్తే సాయుధ ముఠాలు చంపేస్తాయని వారంతా భయపడుతున్నట్లు పేర్కొంది. కాగా, రాజధాని పోర్ట్ ఆఫ్ ప్రిన్స్ నగరాన్ని గుప్పెట పెట్టుకున్న ప్రధాన సాయుధ ముఠా ప్రధానమంత్రి ఆరియల్ హెన్రీ గద్దె దిగాలంటూ డిమాండ్ చేసింది. 2021లో అధ్యక్షుడు జొవెనెల్ మొయిజెను ఆయన నివాసంలో హత్య చేయడం వెనుక ఈ ముఠాయే ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదివారం 72 గంటల అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. 2023లో హైతీలో సాయుధ ముఠాల హింసాత్మక చర్యల కారణంగా 8,400 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఐరాస అంచనా.

సుప్రీంలో ట్రంప్‌కు భారీ విజయం

కొలరాడో ప్రైమరీ బ్యాలెట్‌లో ఆయన పేరుండాలని ఆదేశం



వాషింగ్టన్: మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారీ ఊరట. కొలరాడో ప్రైమరీ బ్యాలెట్ పత్రాల నుంచి ఆయన పేరు తొలగించాలన్న రాష్ట్ర సుప్రీంకోర్టు తీర్పును అమెరికా సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ఆయన పేరుండాల్సిందేనంటూ సంచలన తీర్పు వెలువరిచింది. దాంతో కొలరాడోతో పాటు ఇలినాయీ, మెయిన్ వంటి రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్‌పై పేరు తొలగింపు ముప్పు ఎదుర్కొంటున్న ట్రంప్‌కు భారీ ఊరట లభించింది. ఆయా రాష్ట్రాల్లో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ప్రైమరీల్లో ట్రంప్ పోటీకి మార్గం సుగమమైంది. పార్లమెంట్‌పైకి మద్దతుదారులను ఉసిగొల్పారన్న ఆరోపణలపై రాజ్యాంగంలోని 14వ సవరణ మూడో సెక్షన్‌ను ఉపయోగించి ట్రంప్‌ను ప్రైమరీ నుంచి కొలరాడో సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. అధ్యక్ష అభ్యర్థిపై కోర్టు ఈ సెక్షన్‌ను వాడటం అమెరికా చరిత్రలో అదే తొలిసారి. 14వ సవరణను వాడే అధికారం పార్లమెంట్‌కే తప్ప రాష్ట్రాలకు లేదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఇది అమెరికా సాధించిన ఘన విజయమని ట్రంప్ వ్యాఖ్యానించారు.

జూన్ 15 కల్లా రౌస్ అవెన్యూలో ఆఫీసును ఖాళీ చేయాలి

ఆమ్ ఆద్మీ పార్టీకి సుప్రీంకోర్టు గడువు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో రౌస్ అవెన్యూలోని ప్రభుత్వ స్థలంలో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయాలను జూన్ 15 లోగా ఖాళీ చేయాలని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఢిల్లీ హైకోర్టుకు కేటాయించిన ఆ ప్లాట్‌లో కొనసాగే అర్హత ఆప్‌కు లేదంది. అక్కడి భవనాలను న్యాయ వ్యవస్థ అవసరాల కోసం అత్యవసరంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం పేర్కొంది.

12 తర్వాత వర్చువల్‌గా హాజరవుతా: కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కేసులో విచారణకు హాజరు కావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వరుసగా ఎనిమిదోసారి పంపిన సమన్లకు కూడా ముఖ్యమంత్రి కేజ్రీవాల్ స్పందించలేదు. మార్చి 4వ తేదీన తమ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని కేజ్రీవాల్‌కు ఈడీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నందున సోమవారం విచారణకు హాజరు కాలేకపోయినట్లు తెలిపారు. ఈడీ తనకు సమన్లు ఇవ్వడం చట్టవిరుద్ధమే అయినా ఈనెల 12వ తేదీ తర్వాత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతానన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'వర్చువల్‌గా హాజరయ్యేందుకు చట్టం హక్కు కల్పించింది. అందుకు ఈడీ అధికారులు అనుమతిస్తారని భావిస్తున్నా. ఈడీ విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయాలని నేను డిమాండ్ చేయలేదు. ఒకవేళ ప్రత్యక్ష ప్రసారం చేసినా అభ్యంతరం లేదు'అని కేజ్రీవాల్ అన్నారు. అయితే, కేజ్రీవాల్ పంపిన సమాధానాన్ని పరిశీలిస్తున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. అయితే, కేజ్రీవాల్‌ను వర్చువల్‌గా విచారించేందుకు సిద్ధంగా లేని ఈడీ..తొమ్మిదో విడత సమన్లు పంపే అవకాశాలున్నాయంటున్నారు. ఎన్నిసార్లు సమన్లు జారీ చేసినా కేజ్రీవాల్ విచారణకు హాజరు కాకపోవడంతో ఈడీ అధికారులు కోర్టును ఆశ్రయించడం.. కేజ్రీవాల్ వినతి మేరకు మార్చి 16న విచారణ చేపట్టనున్నట్లు కోర్టు ప్రకటించడం తెలిసిందే.

బీజేపీ 'మోదీ కా పరివార్' ప్రచారాన్ని కేజ్రీవాల్ ఎద్దేవా చేశారు. కేవలం కేంద్ర మంత్రులే మోదీ కుటుంబమన్నారు.

ఉదయనిధిపై సుప్రీం మండిపాటు

సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో..

న్యూఢిల్లీ: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డీఎంకే నేత, తమిళనాడు యువజన సంక్షేమ, క్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను సర్వోన్నత న్యాయస్థానం చీవాట్లు పెట్టింది. మంత్రి పదవిలో ఉన్నప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని సూచించింది. వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో తనపై ఆరు రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఒక్కటిగా కలిపేయాలంటూ సుప్రీంకోర్టు తలుపు తట్టిన ఉదయనిధిని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. ''మీరేం మాట్లాడుతున్నారో, ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేస్తున్నారనే దానిపై జాగ్రత్త వహించండి. మీ వ్యాఖ్యలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో ఒకసారి ఆలోచించండి'' అని కోర్టు మందలించింది. ''ఆర్టికల్ 19(1)ఏ కింద సంక్రమించిన వాక్ స్వాతంత్య్రం, భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కులను మీరు దుర్వినియోగం చేశారు. ఆర్టికల్ 25 కింద దఖలుపడిన మత స్వేచ్ఛను కించపరిచి ఇప్పుడేమో ఆర్టికల్ 32ను వాడుకుంటూ నేరుగా సుప్రీంకోర్టుకొచ్చారు. మీరు మాట్లాడిన మాటలు ఎంతటి విపరిణామాలకు దారితీశాయో మీకు తెలుసా? మీరేమీ సాధారణ వ్యక్తి కాదు. మీరు రాష్ట్ర మంత్రి హోదాలో ఉన్నారు. మాటలు ఎక్కడికి దారితీస్తాయో తెల్సుకోండి'' అని ఆగ్రహం వ్యక్తంచేసింది. విచారణను 15వ తేదీకి కోర్టు వాయిదావేసింది.

ఎన్నికల వేళ... టీఎంసీకి షాక్



కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. టీఎంసీ నాయకత్వంపై తనకున్న భ్రమలన్నీ తొలిగిపోయాయంటూ అయిదు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీనియర్ నేత తపస్ రాయ్ ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. ప్రభుత్వ, పార్టీ పదవులకు మార్చి ఒకటో తేదీనే రాజీనామా చేశానని, ఈ మేరకు లేఖను కూడా పంపించినట్లు సోమవారం ఆయన మీడియాకు వెల్లడించారు. జనవరి 12వ తేదీన తన నివాసంపై ఈడీ అధికారులు దాడులు చేసిన సమయంలో పార్టీ మద్దతుగా నిలవకుండా మౌనంగా ఉండిపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. పార్టీ తనను ఏకాకిని చేసిందన్నారు. అసెంబ్లీలో షాజహాన్ షేక్ మద్దతుగా మాట్లాడిన సీఎం మమతా బెనర్జీ కనీసం తన పేరును కూడా ప్రస్తావించలేదని ఆరోపించారు. తదుపరి కార్యాచరణను సరైన సమయంలో ప్రకటిస్తానని తపస్ రాయ్ చెప్పారు.

సీనియర్ , డిప్యూటీ మేయర్ బీజేపీ కైవసం

చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమి

చండీగఢ్: సర్వోన్నత న్యాయస్థానం జోక్యంతో చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో భంగపాటుకు గురైన బీజేపీ చివరకు సీనియర్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో విజయబావుటా ఎగరేసింది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థికి పడిన 8 ఓట్లను చెల్లనివిగా ప్రకటించి బీజేపీ నేత మేయర్ అయ్యేలా చేసిన రిటర్నింగ్ అధికారిపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన దరిమిలా చండీగఢ్ సీనియర్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు సైతం అందరి దృష్టినీ ఆకర్షించాయి. సోమవారం జరిగిన ఎన్నికల్లో బీజేపీ రెండు విజయాలను నమోదు చేసుకుంది. ఫిబ్రవరి 19వ తేదీన ముగ్గురు ఆప్ కౌన్సిలర్లు బీజేపీలో చేరడంతో 35 సభ్యులుండే మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ బలం మరింత పెరిగింది. దీంతో సీనియర్ మేయర్ ఎన్నికల్లో ఆప్ మద్దతు పలికిన కాంగ్రెస్ అభ్యర్థి గుర్‌ప్రీత్ గబీపై బీజేపీ అభ్యర్థి కుల్‌జీత్ సంధూ విజయం సాధించారు. డిప్యూటీ మేయర్ ఎన్నికల్లోనూ ఆప్ మద్దతు పలికిన కాంగ్రెస్ అభ్యర్థి నిర్మలా దేవిపై బీజేపీ అభ్యర్థి రాజేందర్ శర్మ గెలిచారు.

ప్రైమరీలో చరిత్ర సృష్టించిన నిక్కీ హేలీ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల రిపబ్లికన్ పార్టీ ప్రైమరీలో భారత సంతతికి చెందిన అభ్యర్థి నిక్కీ హేలీ చరిత్ర సృష్టించారు. వాషింగ్టన్ డీసీలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆమె మొదటిసారిగా విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష ఎన్నికల ప్రైమరీల్లో ఈ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచారు. అంతేకాదు, డెమొక్రాటిక్, రిపబ్లికన్ పార్టీల నుంచి ప్రైమరీలో విజయం దక్కించుకున్న తొలి భారత సంతతి అమెరికన్‌గానూ రికార్డు నెలకొల్పారు. గతంలో, 2016లో భారత సంతతికి చెందిన బాబీ జిందాల్, 2020లో కమలా హారిస్, 2024లో వివేక్ రామస్వామి అధ్యక్ష పదవి రేసులో నిలిచినప్పటికీ కనీసం ఒక్క ప్రైమరీని కూడా గెలుచుకోలేకపోయారు. తాజాగా జరిగిన ఎన్నికలో హేలీ 1,274 ఓట్లతో 62.9% గెలుచుకోగా, ఆమె ప్రధాన ప్రత్యర్థి ట్రంప్‌కు 676 అంటే 33.2% ఓట్లు పడ్డాయి. తాజా విజయంతో హేలీ ఖాతాలో 43 డెలిగేట్లు చేరారు. ట్రంప్ ఖాతాలో 247 డెలిగేట్లున్నారు. మంగళవారం 15 రాష్ట్రాల్లో జరగనున్న ప్రైమరీ ఎన్నికలు కీలకంగా మారాయి.

కర్ణాటకలో విద్యార్థినులపై యాసిడ్ దాడి

మంగళూరు: ప్రేమను తిరస్కరించిందన్న ఆవేశంతో ఒక యువకుడు ఒక అమ్మాయిపై కక్ష పెంచుకుని యాసిడ్ దాడికి పాల్పడ్డాడు. యాసిడ్ దాడి సమయంలో ఆ బాధిత అమ్మాయి పక్కనే కూర్చున్న వేరే ఇద్దరు అమ్మాయిలపైనా యాసిడ్ పడి వారికీ ముఖంపై కాలిన గాయాలయ్యాయి. కర్ణాటకలో మంగళూరు సమీపంలోని దక్షిణ కన్నడ జిల్లాలోని కడబ తాలూకాలో ఈ యాసిడ్ దాడి ఘటన జరిగింది. బాధిత అమ్మాయి ముఖంపై తీవ్రస్థాయిలో గాయాలయ్యాయి. దీంతో ఆమెను హుటాహుటిన సమీప ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడబలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రీ-యూనివర్సిటీ కోర్సు పరీక్షల కోసం కారిడార్‌లో కూర్చుని సిద్ధమవుతున్న ముగ్గురు టీనేజీ అమ్మాయిల ముఖంపైకి ఒక యువకుడు యాసిడ్ చల్లాడు. ఆ యాసిడ్ ద్రావకం పక్కనే ఉన్న మరో ఇద్దరు అమ్మాయిలపైనా పడింది. దాడి చేసి పారిపోతున్న యువకుడిని స్థానికులు వెంబడించి పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పజెప్పారు. అతడిని కేరళ మలప్పురం జిల్లా నీలాంబూర్‌కు చెందిన 23 ఏళ్ల అబిన్ షిబిగా పోలీసులు గుర్తించారు. తన ప్రేమను తిరస్కరించినందుకే బాధిత విద్యార్థినిపై యాసిడ్ దాడికి పాల్పడినట్లు పోలీసుల ముందు యువకుడు నేరం అంగీకరించాడు.

పాక్ ప్రధానిగా షహబాజ్ ప్రమాణం



ఇస్లామాబాద్: పాకిస్తాన్ ప్రధానమంత్రిగా షహబాజ్ షరీఫ్(72) రెండోసారి ప్రమాణం చేశారు. అధ్యక్షభవనంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో దేశాధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ఆయనతో ప్రమాణం చేయించారు. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్, పంజాబ్ సీఎం మరియం నవాజ్, సింధ్ సీఎం మురాద్ అలీ షాతో పాటు ఆపద్ధర్మ ప్రధాని అన్వరుల్ హక్, త్రివిధ దళాధిపతులు పాల్గొన్నారు. గతంలో, 2022 ఏప్రిల్-2023 ఆగస్ట్ వరకు పార్లమెంట్ రద్దు కాకముందు షహబాజ్ దేశ ప్రధానిగా పనిచేశారు. ఆదివారం పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో షహబాజ్ సునాయాసంగా మెజారిటీ సాధించిన విషయం తెలిసిందే.

కర్ణాటక అసెంబ్లీలో పాక్ నినాదాలు నిజమే!

పోలీసుల అదుపులో ముగ్గురు

బనశంకరి: కర్ణాటక అసెంబ్లీ భవనం విధానసౌధ కారిడార్లలో పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేసిన కేసులో ముగ్గురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఢిల్లీకి చెందిన ఇల్తాజ్, బెంగళూరు ఆర్టీ నగర వాసి మునావర్, బ్యాడగివాసి మహమ్మద్ షఫీనా శిపుడి అనే వారిని నిర్బంధించారు. ఫిబ్రవరి 27వ తేదీన విధానసౌధలో రాజ్యసభ ఎన్నికల పోలింగ్, ఫలితాల వెల్లడి జరిగింది. ఆ సమయంలో బళ్లారి కాంగ్రెస్ అభ్యర్థి నాసిర్ హుస్సేన్ గెలిచారు. దీంతో ఆయన మద్దతుదారులు పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేసినట్లు ఆరోపణలొచ్చాయి. విధాన సౌధ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రతిపక్ష బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ప్రదర్శనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆ వీడియోలను ఫోరెన్సిక్ ల్యాబ్ పరీక్షలకు పంపారు. నినాదాలు చేసింది నిజమేనని పరీక్షల్లో తేలడంతో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సెంట్రల్ డీసీపీ శేఖర్ తెలిపారు. మంగళవారం కస్టడీలోకి తీసుకుని విచారణ చేపడతామని చెప్పారు.



సాక్షి హైదరాబాద్

మంగళవారం : 5 మార్చి : 2024







'సంస్కృతీ' సౌరభం

పీపుల్స్ ప్లాజా వేదికగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సంస్కృతి మహోత్సవాలు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 600 మంది కళాకారులు అద్భుత ప్రదర్శనలతో అలరించారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరై తిలకించారు. సాగర తీరంలో సాయంత్రం వేళ నిర్వహించిన ఈ సంప్రదాయ నృత్యాలు వీక్షకులను అబ్బురపరిచాయి. - ఖైరతాబాద్











కిక్కెక్కితే లైసెన్స్‌కు చెక్!

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో వాహనదారులపై ఆర్టీఏ కొరడా

- ఇప్పటి వరకు గ్రేటర్‌లో 6,395 డ్రైవింగ్ లైసెన్సులపై వేటు
- మొబైల్ డ్రైవింగ్, ఓవర్‌స్పీడ్ వంటి కేసుల్లో లైసెన్సుల సస్పెన్షన్
- సస్పెన్షన్ కాలంలో బండి నడిపితే మరో ఉల్లంఘన



సాక్షి, సిటీబ్యూరో: వాహనచోదకులారా... బాగా 'కిక్కు'లో ఉండి బండికి 'కిక్'కొట్టారో.. ఇక అంతే! మీతోపాటు మీ లైసెన్స్ చిక్కులో పడ్డట్టే. మీరు మరోసారి బండి నడిపేందుకు అవకాశం కూడా ఉండదు. మద్యం సేవించి వాహనం నడిపితే, కొంతకాలంపాటు డ్రైవింగ్ అర్హత కోల్పోతారు జాగ్రత్త! లైసెన్స్ లేకుండా బండి నడిపితే ఆర్టీఏ అధికారులు మరో కేసు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట నిలబెట్టే ప్రమాదం కూడా ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కింద పట్టుబడిన 6,395 మంది డ్రైవింగ్ లైసెన్సులపై ఆర్టీఏ తాజాగా వేటు వేసింది. 6 నెలలపాటు డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేసింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు డ్రంకెన్ డ్రైవ్‌తోపాటు వివిధ రకాల ఉల్లంఘనల కింద 10 వేల మందికిపైగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేయడం గమనార్హం. ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం, సరుకు రవాణా వాహనాల్లో ప్రయాణికులను తరలించడం వంటి వివిధ రకాల ఉల్లంఘనల కింద పోలీసులు, రవాణా అధికారులు కేసులు నమోదు చేశారు. ఇలా నిబంధనలు ఉల్లంఘించే వాహన 'రాయుళ్ల'పై ఆర్టీఏ కొరడా ఝుళిపించింది.

ఒక్కసారి పట్టుబడినా అంతే సంగతులు

మద్యం నడిపి వాహనాలు నడపడం, పరిమితికి మించిన వేగం, అధికబరువుతో వాహనాలను నడుపుతూ వేగాన్ని అదుపు చేయలేకపోవడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు క్రమం తప్పకుండా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించడం వల్ల రోడ్డు ప్రమాదాలు కొంతమేరకు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో రహదారి భద్రతా నిబంధనలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు డ్రైవింగ్ లైసెన్సులపై 6 నెలలపాటు సస్పెండ్ చేస్తున్నట్లు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(జేటీసీ) రమేష్ తెలిపారు. వాహనదారులు వివిధ రకాల ఉల్లంఘనల కింద ఒక్కసారి పట్టుబడినా డ్రైవింగ్ లైసెన్సుపై వేటు పడే ప్రమాదముంది. 'ప్రతి ఒక్కరూ కచ్చితంగా రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలి. వాహనం నడిపే సమయంలో తమ భద్రతతోపాటు ఇతరుల భద్రతకు కూడా వాహనదారులు బాధ్యత వహించవలసి ఉంటుంది'అని పేర్కొన్నారు. మరోవైపు రవాణా శాఖ డ్రైవింగ్ లైసెన్సులపై సస్పెన్షన్ విధించిన కాలంలో బండి నడిపితే అధికారులు మరో తీవ్రమైన తప్పిదంగా భావించి కేసు నమోదు చేస్తారు. ఇలాంటి ఉల్లంఘనల్లో పట్టుబడినవాళ్లు కోర్టు మెట్లు ఎక్కాల్సిందే. గ్రేటర్ హైదరాబాద్‌లోని మూడు జిల్లాల పరిధిలో వివిధ రకాల ఉల్లంఘనల కింద గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు నమోదైన కేసుల్లో సస్పెండైన లైసెన్సుల వివరాలు కింది విధంగా ఉన్నాయి.

ఉల్లంఘన	హైదరాబాద్	మేడ్చల్	రంగారెడ్డి	సస్పెండైన మొత్తం లైసెన్సులు
డ్రంకెన్ డ్రైవ్	2,130	1,690	2,575	6,395
ప్రమాదాలు	172	87	125	384
కోర్టు కేసులు	154	33	32	219
ఓవర్‌స్పీడ్	7	3	5	15
ఓవర్‌లోడ్	25	24	46	95
మొబైల్‌ఫోన్ డ్రైవింగ్	8	1	1	10
ఇతర ఉల్లంఘనలు	1,034	1,753	351 3,	138
మొత్తం	3,531	3,591	3,136	10,258

ఓటీఎస్ పైనే ఆశలు

ఆస్తి పన్ను బకాయిల వసూళ్ల కోసం ఒన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం

- ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.2100 కోట్లు
- ఇప్పటికి వసూలైంది రూ.1400 కోట్లు
- గడువులోగా రూ.600 కోట్లు రాగలవని జీహెచ్ఎంసీ ఆశ

ఓటీఎస్ సదుపాయం వర్తించనున్న భవనాలు, వాటిపై పేరుకుపోయిన ఆస్తిపన్నుబకాయిలు, వడ్డీ బకాయిల వివరాలు (రూ.కోట్లలో) ఇలా ఉన్నాయి.

కేటగిరీ	భవనాలు	ఆస్తిపన్ను బకాయిలు	వడ్డీ బకాయిలు	మొత్తం
ప్రైవేట్	495628	1887.59	2634.59	4522.18
ప్రభుత్వ	1800	1622.16	3659.05	5281.21
మొత్తం	497428	3509.75	6293.64	9803.39



- ప్రభుత్వ భవనాల్లో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందినవి ఉన్నాయి. వీటి నుంచి రావాల్సిన ఆస్తిపన్ను బకాయిలపై పెద్దగా ఆశల్లేవు. ఉన్నదల్లా ప్రైవేట్ యజమానుల నుంచి మాత్రమే.

సాక్షి, సిటీబ్యూరో: ఖజానా లోటుతో ఓవైపు సిబ్బంది జీతభత్యాల చెల్లింపులకు..మరోవైపు కాంట్రాక్టర్ల పనుల బిల్లుల చెల్లింపులకు నిధుల్లేక విలవిల్లాడుతున్న జీహెచ్ఎంసీకి ప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిల పెనాల్టీలపై వడ్డీ రాయితీనిస్తూ ప్రకటించిన ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) స్కీమ్ కొత్త ఆశలు రేపింది. జీహెచ్ఎంసీలో 19 లక్షలకు పైగా భవనాలుండగా ఇప్పటికే 12 లక్షలకు పైగా భవనాల యజమానులు తమ ఆస్తిపన్ను చెల్లించారు. మిగతా వాటిల్లో ప్రభుత్వ భవనాలు, మొండి బకాయిదారులకు చెందిన భవనాలున్నాయి. వాటిల్లో ఎన్ని భవనాలకు సంబంధించిన ఆస్తిపన్ను వసూలవుతుందో చెప్పలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రకటించిన ఓటీఎస్‌తో గణనీయసంఖ్యలో యజమానులు ఆస్తిపన్ను చెల్లించగలరని జీహెచ్ఎంసీ ఆశపడుతోంది. ఆస్తిపన్ను బకాయిల పెనాల్టీలపై 90 శాతం రాయితీ నివ్వడమే ఓటీఎస్. ఈ స్కీమ్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం వరకు చెల్లించాల్సిన మొత్తం ఆస్తిపన్ను, వడ్డీ పెనాల్టీల్లో 10 శాతం చెల్లిస్తే సరిపోతుంది. ఈ ఆర్థిక సంవత్సరం జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను లక్ష్యం రూ.2100 కోట్లు అయినప్పటికీ, ఇప్పటి వరకు వసూలైంది రూ.1400 కోట్లే. ఇప్పటి వరకు ఆస్తిపన్ను చెల్లించని వారి ద్వారా, ఓటీఎస్ సదుపాయం వర్తించే వారి ద్వారా, ఆర్థిక సంవత్సరం ముగియనున్న ఈ నెలాఖరులోగా మరో రూ.600 కోట్లయినా వసూలు కాగలవని అధికారులు అంచనా వేస్తున్నారు.

పాతబస్తీకి మెట్రో

రెండో దశకు శ్రీకారం

- ఈ నెల 8వ తేదీన సీఎం శంకుస్థాపన



సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రోకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 8వ తేదీ సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫలక్‌నుమా వద్ద శంకుస్థాపన చేయనున్నారు. మొదటి దశలో జూబ్లీబస్‌స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు చేపట్టిన మెట్రో ఎంజీబీఎస్ వరకు పరిమితమైందని, మిగిలిన ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల మెట్రో మార్గాన్ని ప్రస్తుతం చేపట్టనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. దారుల్‌షిఫా, పురానీహవేలీ, ఏతేబార్‌చౌక్, అలీజాకోట్ల, మీర్‌మోమిన్ దయరా, హరిబౌలి, శాలిబండ, శంషీర్‌గంజ్, ఆలియాబాద్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో అందుబాటులోకి రానుంది. ఈ రూట్‌లో సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, ఫలక్‌నుమా స్టేషన్‌లు కొత్తగా ఏర్పాటు కానున్నాయి. చారిత్రక ప్రదేశాలకు 500 మీటర్ల దూరంలో ఒక స్టేషన్ ఉంటుంది. చార్మినార్, సాలార్‌జంగ్‌మ్యూజియంల చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని రెండు స్టేషన్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ రూట్‌లో రోడ్డు విస్తరణలో భాగంగా మొత్తం 1100 నిర్మాణాలపైన ప్రభావం పడనుంది. మాస్టర్‌ప్లాన్ ప్రకారం 100 ఫీట్ల వరకు రోడ్డు విస్తరణ చేపడుతారు. మెట్రోస్టేషన్‌ల వద్ద రోడ్డు విస్తరణ 120 ఫీట్ల వరకు ఉంటుంది. పాతబస్తీ మెట్రో నిర్మాణానికి సుమారు రూ.2000 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సాధ్యమైనంత వరకు మతపరమైన నిర్మాణాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా మెట్రో నిర్మాణం చేపట్టనున్నట్లు ఎండీ తెలిపారు.

చాంద్రాయణగుట్ట వద్ద ఇంటర్‌ఛేంజ్...

పాతబస్తీ మెట్రోకు శంకుస్థాపన చేయడంతో మెట్రో రెండో దశకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఫలక్‌నుమా నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న చాంద్రాయణగుట్ట వరకు మెట్రోను పొడిగించి అక్కడి నుంచి మైలార్‌దేవ్‌పల్లి,పీ-7 రోడ్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణ చేపట్టనున్న సంగతి తెలిసిందే. అలాగే నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు, అక్కడి నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో అందుబాటులోకి రానుంది. ఈ రూట్‌లో చాంద్రాయణగుట్ట అతిపెద్ద ఇంటర్‌ఛేంజ్ స్టేషన్‌గా ఏర్పడనుందని ఎన్వీఎస్‌రెడ్డి చెప్పారు.మెట్రో రెండో దశలో మొత్తం 70 కిలోమీటర్ల మార్గం నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు డీపీఆర్ ను రూపొందిస్తున్నారు. ఎయిర్ పోర్ట్ మార్గంలో భూసార పరీక్షలు నిర్వహించారు. మెట్రో అలైన్‌మెంట్‌ను ఎంపిక చేశారు. 29 కిలోమీటర్ల ఈ రూట్ లో భూసేరణపై తాజాగా దృష్టి సారించారు.3 నెలల్లో పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. మెట్రో రెండో దశకు రూ.18,900 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. బ్యాంకులు, జైకా లాంటి సంస్థల నుంచి రుణాలు పొందేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జైకా ప్రతినిధులతోనూ సమావేశమయ్యారు. మెట్రో నిర్మాణ ఒప్పందం ప్రకారం కేంద్రం 35 శాతం నిధులు ఇవ్వాల్సి ఉంటుంది. 20 శాతం నిధులు రాష్ట్ర సర్కార్ సమకూర్చనుంది. మిగిలిన మొత్తాన్ని రుణాల రూపంలో సేకరిస్తారు. హైదరాబాద్ అభివృద్ధిపై స్పెషల్ ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి.. అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. మూసీని అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ఇందుకు నిధుల సేకరణకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు హెచ్ఎండీఏ, గ్రేటర్ హైదరాబాద్ విస్తరణపైనా శ్రద్ధపెట్టారు.

ఎంఎంటీఎస్ 2 రెడీ

ఘట్‌కేసర్ టూ లింగంపల్లి రూట్లో నేడు పట్టాలెక్కనున్న రైళ్లు

- నేడు ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం
- సనత్‌నగర్-మౌలాలి మధ్య సైతం విద్యుదీకరణ పూర్తి



సాక్షి, సిటీబ్యూరో: ఘట్‌కేసర్ నుంచి లింగంపల్లి వరకు ఎంఎంటీఎస్ రెండో దశ రైళ్లు మంగళవారం నుంచి పట్టాలెక్కనున్నాయి. లాంఛనంగా ప్రధాని మోదీ జెండా ఊపి ఎంఎంటీఎస్ రైళ్లను ప్రారంభించనున్నారు. అలాగే ఈ రూట్‌లో కొత్తగా నిర్మించిన 6 ఎంఎంటీఎస్ స్టేషన్‌లను కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. నగరానికి తూర్పు నుంచి పడమటి వైపు లింగంపల్లి వరకు అందుబాటులోకి రానున్న ఎంఎంటీఎస్ సర్వీసులతో నగరవాసులకు ఎంతో ఊరట లభించనుంది. ప్రత్యేకంగా ఐటీ సంస్థల్లో పని చేస్తూ ఘట్‌కేసర్, ఉప్పల్, మల్కాజిగిరి, మౌలాలి తదితర ప్రాంతాల్లో నివాసం ఉండే ఐటీ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ రూట్ వల్ల ఎంతో ప్రయోజనం లభించనుంది. మౌలాలి-సనత్‌నగర్ మధ్య పూర్తి చేసిన రైల్వేలైన్ల డబ్లింగ్, విద్యుదీకరణ పనులు కూడా పూర్తయ్యాయి. దీంతో ఘట్‌కేసర్ నుంచి మౌలాలి-సనత్‌నగర్ మీదుగా లింగంపల్లి వరకు ఎంఎంటీఎస్ రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. 6వ తేదీ నుంచి ఈ రూట్‌లో ఎంఎంటీఎస్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.

ఈ రూట్‌లో 6 ఎంఎంటీఎస్ స్టేషన్లు

ఎంఎంటీఎస్ రెండో దశలో ఇప్పటి వరకు లింగంపల్లి-తెల్లాపూర్, మేడ్చల్-ఉందానగర్, సికింద్రాబాద్-బొల్లారం తదితర మార్గాలు పూర్తయ్యాయి. మేడ్చల్-ఉందానగర్ మధ్య ఎంఎంటీఎస్ రెండో దశ రైళ్లను ప్రధాని మోదీ గతేడాది లాంఛనంగా ప్రారంభించారు. ప్రస్తుతం మౌలాలి-సనత్‌నగర్ డబ్లింగ్, విద్యుదీకరణ, సికింద్రాబాద్-ఘట్‌కేసర్ లైన్ల నిర్మాణం పూర్తి చేశారు. దీంతో ఘట్‌కేసర్ నుంచి నేరుగా లింగంపల్లి వరకు ప్రయాణసదుపాయం అందుబాటులోకి వచ్చింది. మొత్తం 22 రూట్ కిలోమీటర్లు ఉన్న ఈ మార్గంలో రూ.343 కోట్లతో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అలాగే ఈ రూట్‌లో కొత్తగా ఫిరోజ్‌గూడ, సుచిత్ర సెంటర్, భూదేవినగర్ , అమ్ముగూడ, నేరేడ్‌మెట్, మౌలాలి హౌసింగ్ బోర్డ్ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ రూట్‌లో కొత్తగా ప్రారంభించనున్న ఎంఎంటీఎస్ స్టేషన్‌లలో ఆధునిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫామ్‌ల ఎత్తును పెంచారు. పాదచారుల కోసం ప్రత్యేక వంతెనలు నిర్మించారు. ఈ కొత్త రూట్‌లో ప్రయాణికులు చర్లపల్లి నుంచి నేరుగా లింగంపల్లి వరకు ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. ఈ రూట్‌లో కొత్త ప్రాంతాలు ఎంఎంటీఎస్ నెట్‌వర్క్‌తో అనుసంధానం కానున్నాయి.

పెరగనున్న నెట్‌వర్క్ ...

ఇప్పటి వరకు ఎంఎంటీఎస్ మొదటి, రెండో దశలలో 44 స్టేషన్ల మీదుగా 90 రూట్ కిలోమీటర్లలో రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా మంగళవారం ప్రారంభం కానున్న ఘట్‌కేసర్-లింగంపల్లి రూట్ వల్ల ఎంఎంటీఎస్ నెట్‌వర్క్ 123.52 కిలోమీటర్లకు పెరగనుంది. స్టేషన్‌ల సంఖ్య కూడా 53కు చేరుకుంటుంది. 48 కిలోమీటర్ల పొడవైన ఘట్‌కేసర్-లింగంపల్లి రూట్ తూర్పు వైపున సికింద్రాబాద్ స్టేషన్ దాటి విస్తరించడమే కాకుండా పడమటి వైపున ఉన్న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ హబ్‌తో కలుపుతుంది. దీంతో ఘట్‌కేసర్, చర్లపల్లి, మల్లాపూర్, నేరేడ్‌మెట్, ఈసీఐఎల్, సుచిత్ర, భూదేవినగర్ తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికుల రాకపోకలు పెరగనున్నాయి.

వేళలు..

- ఘట్‌కేసర్-లింగంపల్లి రైలు (47253) ఉదయం 7.20 గంటలకు బయలుదేరి 9.15 గంటలకు లింగంపల్లికి చేరుకుంటుంది. చర్లపల్లి (07.32), నేరేడ్ మెట్ (07.52), అమ్ముగూడ (8.00), భూదేవినగర్ (8.07), సుచిత్ర సెంటర్ (8.16), ఫిరోజ్‌గూడ (8.25),భరత్ నగర్ (8.34),బోరబండ (8.38),హైటెక్ సిటీ(8.43),హఫీజ్ పేట్ (8.49),చందానగర్ (8.54)స్టేషన్ల మీదుగా బయలుదేరుతుంది.
- లింగంపల్లి-ఘట్‌కేసర్(47254) సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరి 7.30 గంటలకు ఘట్‌కేసర్‌కు చేరుకుంటుంది. చందానగర్ (5.48), హఫీజ్ పేట్ (5.56),హైటెక్ సిటీ (6.03),బోరబండ (6.08),భరత్ నగర్ (6.12),ఫిరోజ్‌గూడ (6.21),సుచిత్ర సెంటర్ (6.30),భూదేవినగర్ (6.40),అమ్ముగూడ(6.46), నేరేడ్ మెట్ (6.54), చర్లపల్లి(7.15) స్టేషన్ల మీదుగా ఘట్‌కేసర్‌కు చేరుకుంటుంది.
- ఘట్‌కేసర్-లింగంపల్లి మధ్య మరో ట్రైన్ ఉదయం 10.45 గంటలకు ఘట్కేసర్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.40 గంటలకు లింగంపల్లికి చేరుకుంటుంది. ఇది చర్లపల్లి(10.59),నేరేడ్ మెట్ (11.21), అమ్ముగూడ (11.29), భూదేవినగర్ (11.36),సుచిత్ర సెంటర్ (11.45),ఫిరోజ్‌గూడ (11.54), భరత్నగర్ (12.03),బోరబండ (12.07),హైటెక్ సిటీ(12.12),హఫీజ్ పేట్ (12.18), చందానగర్ (12.23)స్టేషన్ల మీదుగా బయలుదేరనుంది.

హై అలర్ట్

నగరంలో ప్రధాని మోదీ

- నేడు ఉజ్జయిని మహంకాళి ఆలయం సందర్శన
- రాజ్‌భవన్, సికింద్రాబాద్ పరిసరాల్లో భద్రత కట్టుదిట్టం



సాక్షి, సిటీబ్యూరో: ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజుల తెలంగాణ పర్యటనలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లా నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు చేరుకుని రాత్రికి ఇక్కడే బస చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఆయన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మోదీతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహా మరో ఐదుగురు ఆలయ సిబ్బందిని మాత్రమే లోనికి అనుమతించనున్నారు. ఈ సమయంలో సాధారణ భక్తులెవరినీ లోనికి అనుమతించబోరు. సుమారు పది నిమిషాల పాటు ఆయన ఆలయంలోనే ఉండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆలయానికి వచ్చే ప్రధాన రహదారులపై ఆంక్షలు విధించనున్నారు. ఆయా మార్గాల్లో వచ్చి వెళ్లే వాహనాలను ఇతర మార్గాలకు మళ్లించనున్నారు. దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కలెక్టర్ అనుదీప్ కుమార్, పోలీసులు ఆలయానికి చేరుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భద్రత కట్టుదిట్టం


ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా సిటీలో హై అలర్ట్ విధించారు. బేగంపేట్ సహా రాజ్‌భవన్, సికింద్రాబాద్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇటీవల బెంగళూర్ పేలుళ్ల ఘటన దృష్ట్యా హైదరాబాద్ మోదీ పర్యటనలో నిఘా పటిష్టం చేశారు. బేగంపేట్ ఎయిర్ పోర్ట్ జంక్షన్, హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్ ఫ్లై ఓవర్, గ్రీన్ ల్యాండ్స్, యశోద హాస్పిటల్ రూట్లలో వాహనాలను ఇతర మార్గాలకు మళ్లించారు. సోమవారం రాత్రి 7.45 నుంచి మంగళవారం ఉదయం 10.45 వరకు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని పోలీసులు ప్రకటించారు.

భక్తులకు ఇబ్బందులు రానివ్వొద్దు

కీసర బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు

కీసర: మహాశివరాత్రి సందర్భంగా మార్చి 6 నుండి 11వ తేదీవరకు జరుగనున్న కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని చెప్పారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. సోమవారం అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లాకలెక్టర్ గౌతమ్ కీసరగుట్ట జాతరకు సంబంధించి క్షేత్రస్థాయిలో తుది ఏర్పాట్లు పరిశీలించారు. పార్కింగ్, క్యూలైన్లు, జాతర జరిగే ప్రాంతంలో కలెక్టర్ స్వయంగా పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా పరిషత్ గెస్ట్ హౌజ్ నుండి ప్రధాన క్యూలైన్ల వరకు 8 ఫీట్లమేర వెడ్పులుతో చలువ పందిళ్ల వేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం జాతరపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం గతేడాది కంటే కీసరగుట్టకు భక్తులు ఎక్కువ సంఖ్యలోవచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న నేపథ్యంలో వారు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, ఇందుకోసం సుమారు 300 బస్సులను జాతర సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి నడపడం జరుగుతుందన్నారు. 8, 9 వతేదీల్లో యాత్రికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంటుందని, ఈ రెండు రోజులు అన్నిశాఖల అధికారులు గుట్టలోనే ఉంటూ సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. సామాన్యభక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం అయ్యేవిధంగా ఈసారి మూడు క్యూలైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆలయ చైర్మన్ నాగలింగం, ఈఓ నరేందర్ కలెక్టర్‌కు వివరించారు. జాతరలో 1800 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని డీసీపీ పద్మజారాణి తెలిపారు. అంతకుముందు కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డిలు స్వామివారిసేవలో పాల్గొన్నారు.



కీసరగుట్టలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ముమ్మరంగా రంజాన్ ఏర్పాట్లు

- మక్కా, రాయల్ మసీదుల్లో ప్రత్యేక చర్యలు
- షెడ్ల నిర్మాణం, వాటర్ కూలర్ల ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్న మక్కా, రాయల్ (పబ్లిక్ గార్డెన్స్) మసీదుల్లో రంజాన్ మాసం సందర్భంగా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహ్మద్ ఇలియాస్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. రంజాన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మసీదులకు ప్రత్యేక నిధులు విడుదల చేసిందన్నారు. వేసవి నేపథ్యంలో మసీదులకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక షెడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రెండు మసీదులో తుర్కియే జానీమాజ్‌లను ఏర్పాటు చేశామన్నారు. చల్లటి నీటిని అందించేందుకు వాటర్ కూలర్లను అందుబాటులో ఉంచామన్నారు. మక్కా మసీదులో వజూ చేసుకునేందుకు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. రెండు మసీదులకు ప్రతి రోజు వేల సంఖ్యలో భక్తులు వస్తారని, వీరికి ఇఫ్తార్ విరమణ సందర్భంగా ప్రభుత్వం తరుపున ఖర్జూరాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మసీదు సిబ్బందికి యూనిఫామ్ అందజేశామని,. మసీదులోని వజూ ఖానాలు మరుగుదొడ్ల పరిశుభ్రతకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. నీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు.

వల పన్ని.. వంచించి..

స్నేహం పేరుతో యువతులతో పరిచయం పెంచుకోవడం.. ఆపై వారిని వేధించడం. తరచూ ఇలాంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఎల్‌బీనగర్, సైదాబాద్‌లోనూ ఇదే జరిగింది. ఇద్దరు స్నేహితులు ఓ యువతిపై లైంగికదాడికి పాల్పడటమే కాకుండా ఆమె నగ్న చిత్రాలు రికార్డు చేసి వేధించారు. మరోవైపు సైదాబాద్‌లో ఓ బాలికను వేధించాడో యువకుడు. వీరిపై కేసులు నమోదు చేశారు పోలీసులు

- యువతిపై సామూహిక లైంగికదాడి
- ఎల్‌బీనగర్‌లోని ఓ లాడ్జీలో ఘటన
- మరో చోట బాలికకు వేధింపులు.. పోక్సో కేసు నమోదు



గత ఏడాది పరిచయమై..

నాగోలు: డిగ్రీ చదివే యువతికి ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన యువకుడు.. ఆమెపై అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు యువకుడు బెదిరింపులకు పాల్పడంతో బాధిత యువతి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బోరబండ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ బదిలీ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఓ యువతి(19) గతంలో ఎల్‌బీనగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉండేది. రామంతపూర్‌లోని ఓ డిగ్రీ కాలేజీలో చదివే సమయంలో అదే ప్రాంతానికి చెందిన ఆదిత్య(19)తో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. దీంతో అతను యువతి కళాశాల వద్దకు తరచూ కలిసేవాడు. అదే ఏడాది ఏప్రిల్ 3న కాలేజీ వద్దకు వెళ్లిన అతను సదరు యువతిని ఇంటి వద్ద బైక్‌పై డ్రాప్ చేస్తానని చెప్పి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో దగ్గర దారిలో ఇంటికి తీసుకెళ్తానని చెప్పి.. ఎల్‌బీనగర్ కామినేని చౌరస్తాలో మారుతి రెసిడెన్సీ లాడ్జికి తీసుకెళ్లాడు. ఆపై మత్తు మందు కలిపిన మంచినీళ్లు ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేశాడు. ఆ తర్వాత అక్కడికి వచ్చిన తన స్నేహితుడు ప్రణవ్‌తో కలిసి ఆదిత్య ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో భయపడిన యువతి ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. అయితే, రెండు నెలల క్రితం యువతి కుటుంబం బోరబండ, కల్యాణ్‌నగర్‌కు మకాం మార్చింది. ఈ క్రమంలో ఆమె స్థానికంగా ఓ మార్ట్‌లో క్యాషియర్‌గా పని చేస్తోంది. ఈ ఏడాది జనవరిలో ఆమె పనిచేస్తున్న మార్ట్ వద్దకు వచ్చిన ఆదిత్య తాను చెప్పిన చోటుకు రావాలంటూ వేధింపులకు పాల్పడ్డాడు. అంతేకాకుండా ప్రణవ్‌తో కలిసి తరచూ ఆమెకు ఫోన్ చేస్తూ బెదిరిస్తున్నారు. తాము చెప్పినట్లు వినకుంటే తమ దగ్గరున్న నగ్న చిత్రాలు బయట పెడతామంటూ వేధించారు. దీంతో బాధితురాలు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో పాటు ఆదివారం బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. కేసును ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

వేధించి..డబ్బుల కోసం బెదిరిస్తూ..

సైదాబాద్: బాలికను శారీరకంగా వేధించడంతో పాటు ఆమె నగ్న చిత్రాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి డబ్బులు, బంగారం ఇవ్వాలని బెదిరిస్తున్న యువకుడిపై సైదాబాద్ ఠాణాలో పోక్సో సెక్షన్ కింద కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. సైదాబాద్‌కు చెందిన ఓ వ్యాపారికి ముగ్గురు కుమార్తెలు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చిన్న కూతురు(17)తో కలిసి తల్లి నెల రోజుల క్రితం బోయినపల్లిలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. అక్కడ సుమైర్ అనే యువకుడి ఫోన్ నంబర్ ఇవ్వాలని బాలిక వెంటబడ్డాడు. ఆమె నంబర్ ఇవ్వకుండా అక్కడి నుంచి తప్పించుకుంది. అయితే, ఆమె ఫోన్ నంబర్, సోషల్ మీడియా ఐడీ తెలుసుకున్న సుమైర్.. బాలికతో ఫోన్, చాటింగ్ చేస్తూ పరిచయం పెంచుకున్నాడు. ఈ నెల 1న రాత్రి ఆమె ఇంట్లోకి వచ్చి ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తూ శారీరకంగా వేధించడమేగాక తన ఫోన్‌లో రికార్డ్ చేశాడు. మరుసటి రోజు బాలికకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగాడు. తనకు డబ్బులు, బంగారం ఇవ్వకపోతే ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. అయితే, ఇంట్లో బాలిక ప్రవర్తన సరిగా లేకపోవడాన్ని గుర్తించిన తల్లిదండ్రులు ఆమెను నిలదీయగా అసలు విషయం బయటపడింది. ఆదివారం బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ దుర్మరణం



కునాల్(ఫైల్)

మణికొండ: రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ దుర్మరణం పాలైన సంఘటన సోమవారం నార్సింగి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఔటర్‌రింగ్ రోడ్డుపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన కునాల్ (23)లంగర్‌హౌస్‌లోని మిలిట్రీ రిజిమెంట్‌లో సపాయి అథ్లెట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం అతను బ్యాంక్‌కు వెళుతున్నట్లు చెప్పి రెజిమెంట్‌లో నుంచి బయటికి వచ్చాడు. మధ్యాహ్నం ఔటర్‌రింగ్ రోడ్డు వైపు వచ్చిన అతను రోడ్డు దాటుతుండగా గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళుతున్న రెడీమిక్స్ వాహనం అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఆర్మీ అధికారులు మృతుడిని తమ క్యాంప్‌లోనే ఉంటున్న కునాల్‌గా గుర్తించారు. అతను క్యాంప్ నుంచి నార్సింగిలోని ఎస్‌బీఐ బ్యాంక్‌కు వచ్చి ఔటర్‌రింగ్ రోడ్డు పైకి ఎందుకు వచ్చాడనే విషయమై దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు సీసీటీవీల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఆర్మీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్మీ అధికారులు

టి-సెల్ థెరపీతో కేన్సర్‌కు చికిత్స

సాక్షి, సిటీబ్యూరో: కేన్సర్ చికిత్సల్లో అపోలో ఆస్పత్రి వైద్యులు మరో నూతన చికిత్స విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. రక్త కేన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళకు టి -సెల్(చిమెరిక్ యాంటిజెన్ రెసెప్టర్) థెరపీని విజయవంతంగా నిర్వహించింది. ఈ తరహా చికిత్స విధానం తెలుగు రాష్ట్రాల్లో ఇదే ప్రథమమని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. వివరాల్లోకి వెళితే..కరీంనగర్‌కు చెందిన మహిళ రక్త కేన్సర్(మల్టిపుల్ మైలోమా)తో బాధపడుతోంది. చికిత్స కోసం అపోలో హెమటాలజీ వైద్య నిపుణురాలు డాక్టర్ పద్మజ లోకిరెడ్డిని సంప్రదించగా, వైద్య పరీక్షలు చేసి, బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. అనంతరం అత్యాధునిక చిమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్ థెరపీతో చికిత్స చేశారు. కేన్సర్ రోగులకు ఈ చికిత్స ఓ వరం లాంటిదని వైద్యులు పేర్కొన్నారు.

వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాలకు ప్రాధాన్యం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మాదాపూర్: రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక నిధులు కేటాయిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో సోమవారం 50 డెయిరీ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధానులు స్వర్గీయ ఇందిరాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రీ హయాంలో దేశంలో శ్వేత విప్లవానికి బీజం పడిందన్నారు. పాలు ఉన్న చోటే సంపద ఉంటుందని, రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఔటర్‌రింగ్ రోడ్డు, రీజినల్ రింగురోడ్డు మధ్య పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. డెయిరీ క్లస్టర్ ఏర్పాటుకు ఇది అనువైన ప్రాంతమని ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఇందిరాక్రాంతి పథం ద్వారా మహిళల ఆర్థిక చేయూతకు వడ్డీలేని రుణాలను అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. త్వరలో ఈ పథకాన్ని పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. పశుసంవర్థక, మత్స్యశాఖ రంగానికి గత ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో రూ.1,863 కోట్లు కేటాయించగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వార్షిక బడ్జెట్‌లో రూ.2002 కోట్లు కేటాయించిందన్నారు. పాడి పరిశ్రమలో 70శాతం శ్రమ మహిళలదేనని, మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించనున్నట్లు తెలిపారు. పాడి రంగంలో గణనీయ అభివృద్ధి సాధించిన వారిని సత్కరించారు. అనంతరం ఎగ్జిబిషన్ సెంటర్లో ఏర్పాటు చేసిన పాల ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు పాల ఉత్పత్తి కుటుంబ పోషణతో పాటు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు.

మంచిని స్వీకరిద్దాం..మార్పులు చేసుకుందాం..

అమీర్‌పేట: ప్రజా పాలనలో గత పాలనలో జరిగిన మంచి కార్యక్రమాలను స్వీకరించి అవసరమైన చోట మార్పులు చేపట్టి ప్రజలకు మెరుగైన పాలన అందించడం తమ బాధ్యతని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.సోమవారం ఆయన మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి బల్కంపేటలో రూ.16 లక్షలతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనం, అమీర్‌పేట ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో మన బస్తీ మన బడి కార్యక్రమం కింద రూ.52.25 లక్షలు, హై స్కూల్‌లో రూ.89.97 లక్షల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు సాంకేతికతను అందిపుచ్చుకునే విధంగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.కార్పొరేట్ స్కూల్స్‌తో పోటీ పడుతూ తల్లిదండ్రుల కళలను సాకారం చేసేలా కష్టపడి చదువుకోవాలని సూచించారు. పాఠశాలల్లో సమస్యలపై మంత్రి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణం: ఎమ్మెల్యే తలసాని

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు విద్యాబోధన జరగాలనే ఆలోచనతోనే మౌలిక సౌకర్యాలు, వసతులు కల్పించడం జరిగిందన్నారు.ప్రతి ఒక్కరికి విద్య ఎంతో అవసరమని,కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది నాణ్యమైన విద్యను అందించామన్నారు. క్రీడలు,సాంస్కృతిక రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, జిల్లా కలెక్టర్ అనుదీప్, డీఈఓ రోహిణి, కార్పొరేటర్ సరళ, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, లలితా చౌహన్.గోదాస్ నవీన్ తదితరుల పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే తలసాని

15 నుంచి హైలైఫ్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నటి అషురెడ్డి, మోడల్స్

బంజారాహిల్స్: హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో హైలైఫ్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో జరిగింది.. ఈ సందర్భంగా సినీ నటి అషురెడ్డితో పాటు పలువురు మోడల్స్ కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన డిజైనర్లు, మోడల్స్ రూపొందించిన డిజైనరీ దుస్తులతో పాటు ఆభరణాలు, ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ యాక్ససరీస్ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గత ప్రభుత్వ హయాంలో విద్యా రంగం పూర్తిగా నిర్వీర్యమైందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాసిందన్నారు. నూతన ప్రభుత్వం విద్యా రంగాన్ని గాడిలో పెట్టాలని కోరారు. అంగన్‌వాడీ వ్యవస్థను పునర్‌వ్యవస్థీకరించాలని, పేద విద్యార్థులను శారీరంగా, మానసికంగా బలంగా తయారు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, కళాశాలలకు పక్కా భవనాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వమే మూడు పూటలా విద్యార్థులకు భోజనం అందించాలని కోరారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, కార్పొరేట్ విద్యా సంస్థలను నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్‌రావు, ప్రొఫెసర్ వినాయకరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్, ఏఐడీఎస్ఓ అధ్యక్షులు మల్లేష్, డీవైఎఫ్ఐ అధ్యక్షులు కోట రమేష్, నాయకులు నరేష్, మమత, అన్నారపు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ రొనాల్డ్ రాస్

హిమాయత్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రజల నుండి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణికి నగరంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కమిషనర్‌కు తెలియజేస్తూ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను వచ్చే ప్రజావాణిలోగా పరిష్కరించి, ఫిర్యాదుదారులకు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించి 67 ఫిర్యాదులు రాగా, వాటిని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. జీహెచ్ఎంసీ కార్యాలయంతో పాటు, జోన్ల పరిధిలో మొత్తం 187 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. అంతకు ముందు కమిషనర్ ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో ఈఎన్‌సీ జియాఉద్దీన్, సీఈ దేవానంద్, చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్ నాయక్, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, చంద్రకాంత రెడ్డి, గీతామాధురి చీఫ్ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానం..పెనుభూతమై..

- భార్యను చంపిన భర్త
- నిందితుడి అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి: భార్యపై అనుమానంతో భర్త ఆమె తలపై బండ రాయితో మోది దారుణంగా హత్య చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు సోమవారం చేసుకుంది. సీఐ మధు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన అమిత్ సాహు, మధుబాయి(29) దంపతులు ఏడాది క్రితం నగరానికి వలసవచ్చి రాజేంద్రనగర్ సర్కిల్ శాస్త్రీపురం డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో నివాసం ఉంటూ అదే భవనంలో కూలీలుగా పని చేస్తున్నారు. మధుబాయి తోటి కార్మికులతో చనువుగా ఉంటుండటంతో అమిత్ ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఆదివారం రాత్రి ఆమె నిద్రిస్తుండగా బండరాయితో మోదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

6 నుంచి రాష్ట్రపతి నిలయంలో చేనేత వస్త్ర ప్రదర్శన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రసూల్‌పురా: తెలంగాణ ప్రభుత్వ చేనేత, హస్తకళల శాఖ, రాష్ట్రపతి నిలయం ఆధ్వర్యంలో బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఈ నెల 6నుంచి 10 వ తేదీ వరకు చేనేత, హస్తకళల ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్రపతి నిలయం పరిపాలన అధికారి రజనీప్రియ తదితరులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రజనీప్రియ మాట్లాడుతూ రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించే కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రపతి నిలయంలో చేనేత, హస్తకళల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ప్రారంభిస్తారన్నారు. ఈ ప్రదర్శనలో హస్తకళల కళాకారులు తయారు చేసిన వస్త్రాలు, కుండలు, ఆభరణాలు ఇతర సంప్రదాయ కళాఖండాలు కొలువుదీరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ కమిషనర్ అలుగు వర్షిణి, రాష్ట్రపతి నిలయం అధికారులు పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో : 2024-25 విద్యా సంవత్సరానికి గాను వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయిన్ పల్లిలో ఐదవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎస్ సంధ్యారాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి లో ప్రవేశానికి గాను బాల బాలికల ఎత్తు బరువు స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో 30 మీటర్లు ఫ్లయింగ్ స్టార్ట్ ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ 800 మీటర్ల పరుగు పందెం పోటీల ప్రతిభా ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల గిరిజన బాల బాలికలు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, బోనఫైడ్ ఆధార్ జిరాక్స్ సర్టిఫికెట్లతో జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం 4వ అంతస్తు కలెక్టర్ కాంప్లెక్స్ హైదరాబాద్‌లో నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం ఫోన్ నెంబర్ 8374909268, 9553554455 ను సంప్రదించాలని సూచించారు.

శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంచుకోవాలి

లాలాపేట: యువతలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తార్నాక ఐఐసిటీ జెడ్ఎమ్ హైస్కూల్ ప్లే గ్రౌండ్‌లో ' సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డా. జితేంద్ర సింగ్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో సైన్స్ సిటీ ఏర్పాటుకు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నా గత ప్రభుత్వ వైఖరి కారణంగా జాప్యం జరిగిందన్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఐఐసీటీలోనే సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలో రక్షణ శాఖకు సంబంధించిన సంస్థలు, ఐటీ, ఫార్మా, హెల్త్ సైన్స్ సంస్థలు ఉన్నా సైన్స్ సిటీ లేని లోటు తెలుస్తుందన్నారు. ఏడాది లోగా సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ మొదటి దశ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని, అందుకుగాను రూ 400 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర సాంస్కృతిక శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే భవిష్యత్తులో సైన్స్ సిటీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డా. జితేందర్ సింగ్ మాట్లాడుతూ దేశంలో సైన్స్, సంస్కృతిని పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కోవిడ్‌ను ఎదుర్కోవడంలో వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడంలో సీఎస్ఐఆర్ కీలక పాత్ర పోషించిందన్నారు. సైన్స్ లేకుండా సంస్కృతి లేదని, సంస్కృతి లేకుండా సైన్స్ పూర్తి కాదన్నారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించడానికి ఎగ్జిబిషన్లు, గ్యాలరీలు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డా. ఎన్. కలైసెల్వి, డా. జి. సతీష్‌రెడ్డి, ఐఐసిటీ డైరెక్టర్ డా. డి. శ్రీనివాస్‌రెడ్డి, ఎస్. కుమార్, ఐఏఎస్ అధికారి ముగ్ధా సిన్హా, పలువురు శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.




సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు భూమి పూజ చేస్తున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, జితేంద్ర సింగ్

యాదవ కులస్తులకు రాజకీయ ప్రాతినిథ్యం కల్పించాలి

సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర మంత్రి వర్గంతోపాటు కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల్లో యాదవ కులస్తులకు ప్రాతినిథ్యం కల్పించాలని యాదవ సంఘాల ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర జనాభాలో యాదవ, కురుమ కులస్తులు 18 శాతం ఉన్నారన్నారు. తమకు గత ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ తగిన ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. తమ సామాజిక వర్గాన్ని కాంగ్రెస్ పార్టీ వైపు మళ్లించేందుకు గతం కంటే మించి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు.

భవనం పైనుంచి దూకి యువతి ఆత్మహత్య



పూజ మృతదేహం

జియాగూడ: భవనం 6వ అంతస్తు పై నుంచి దూకి ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది.ఎస్ఐ మన్మోహన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జియాగూడ 2బీ హెచ్‌కే డిగ్నిటింగ్ హౌసింగ్ కాలనీలో ప్రదీప్, గీత దంపతులు నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె పూజ (30) సోమవారం ఉదయం భవనం 6వ అంతస్తు నుంచి కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు అధికారం తథ్యం

మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకురాళ్లతో అజహరుద్దీన్

శ్రీనగర్‌కాలనీ: త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్ పేర్కొన్నారు. దేశంలో అన్ని వర్గాల సంక్షేమం, దేశ పురోగతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో ఉన్నారని అన్నారు. సోమవారం ఎర్రగడ్డ డివిజన్‌లో మహిళా నేతలు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆయన ఆహ్వానించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమని అజహరుద్దీన్ ధీమా వ్యక్తం చేశారు. నేతలు హైదరాబాద్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్, ఎస్టీసెల్ స్టేట్ కో ఆర్డినేటర్ రమేష్‌నాయక్, మోసిన్ ఖురుషి, గణేష్, ఫరియానా, యాకమ్మ, రాజమణి, వాణి, సుధ, సుజాత, కుమారి, ఉమ, వీరమ్మ, మాదమ్మ, రేఖ పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ విజయం ఖాయం


కార్యకర్తలతో ర్యాలీలో నిర్వహిస్తున్న వేణుగోపాల స్వామి

హిమాయత్‌నగర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ నాయకుడు, సికింద్రాబాద్ పార్లమెంట్ ఆశావహ అభ్యర్థి వేణుగోపాల స్వామి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రకు సంఘీభావంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆర్టీసీ క్రాస్ రోడ్ నుంచి నారాయణగూడ మీదుగా బషీర్ బాగ్ అమ్మవారి ఆలయం వరకు వేణుగోపాల్ స్వామి అధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాల స్వామి మాట్లాడుతూ... శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, ప్రజలందరికీ న్యాయం అనే సందేశంతో పాటు పేదలు, అణగారిన, దోపిడీకి గురవుతున్న వారికి న్యాయం చేయడం కోసం రాహుల్ గాంధీ యాత్ర చేపట్టారని తెలిపారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇండియా కూటమి 300కు పైగా సీట్లతో అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని తెలిపారు. అధిష్టానం అవకాశమిస్తే సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో ఉంటానని, పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌కు మెజార్టీ సీట్లు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రారంభించిన భారత్ జోడో న్యాయ యాత్రకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.


ఆర్టీసీ బస్సులో మహిళకు కరపత్రం అందజేస్తూ..

బస్తీ దవాఖానాను ప్రారంభించిన మంత్రి పొన్నం


వైద్య పరీక్షలు చేసుకుంటున్న మంత్రి పొన్నం

హిమాయత్‌నగర్: రానున్న రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్ స్ట్రీట్ నం 15లోని నూతన బస్తీ దవాఖానాను రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తుందని మంత్రి పొన్నం అన్నారు. ఈ సందర్భంగా మంత్రి బస్తీ దవాఖానాలో వైద్య పరీక్షలు చేసుకున్నారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్ గౌడ్, డాక్టర్లు, సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి


మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎన్బీటీ నగర్ ఎస్ఎల్ఎఫ్ 1 గ్రూప్ మహిళలు మహిళా దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారున. ఈ వేడుకలకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు ఐక్యతతో ఉండి హక్కులు సాధించుకోవాలని, స్వయం ఉపాధి దిశగా బస్తీల్లోని మహిళలు ముందుకు వస్తుండటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎల్ఎఫ్ 1 ప్రెసిడెంట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో నుంచి హెల్ప్..హెల్ప్.. అంటూ మహిళ అరుపులు

- బంజారాహిల్స్‌లో అర్ధరాత్రి ఘటన
- ప్రమాదంలో ఉందని గ్రహించిన ఇంటర్ విద్యార్థి
- పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్: అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళను బలవంతంగా ఆటోలో తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో హెల్ప్..హెల్ప్ అంటూ సహాయం కోసం అరవడాన్ని గమనించిన ఓ యువకుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుడిపాటి కృష్ణ (18) అనే యువకుడు బాచుపల్లిలోని సీఎంఎస్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితులైన సుమన్, వశిష్టలతో కలిసి ఆదివారం రాత్రి ఓల్డ్ సిటీలో మరో స్నేహితుడు వివేక్ సోదరి వివాహానికి హాజరయ్యారు. తిరిగి ఇంటికి వెళ్ళే క్రమంలో బంజారాహిల్స్ ఎన్ఎఫ్‌సీఎల్-కేబీఆర్ పార్కు రోడ్డులో వెళ్తుండగా..వీరు ప్రయాణిస్తున్న బైక్ పక్క నుంచే ఆటో వెళ్లింది. అయితే ఓ మహిళ ఒక్కసారిగా ఆటోలో నుంచి హెల్ప్..హెల్ప్..అంటూ అరవడం గమనించారు. ఆటో పక్కగా బైక్‌పై వెళ్తున్న మరో వ్యక్తి ఆమె నోరు మూయాల్సిందిగా ఆటోలో ఆమె పక్కనే కూర్చొన్న వ్యక్తికి చెబుతుండడం గమనించారు. సదరు మహిళ ఆపదలో ఉందని గ్రహించిన వారు వెంటనే 100కు డయల్ చేసి ఆటోను అనుసరించారు. కొద్దిసేపు ఆటోను ఫాలో అయినప్పటికీ తప్పించుకోవడంతో గుడిపాటి కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కదలలేని చిన్నారి కోసం.. కదిలి వచ్చిన అధికార యంత్రాంగం!


మదిహాకు ప్రొసీడింగ్ లెటర్ అందిస్తున్న అధికారులు

రహమత్‌నగర్: దయనీయ స్థితిలో ఉన్న చిన్నారి దుస్థితిపై అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో కదలి వచ్చారు. హుటాహుటిన పింఛన్ మంజూరు చేస్తూ లేఖ అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి... బోరబండ ఎస్ఆర్ఆర్ పురంలో నివాసముండే మహ్మద్ యాసిన్ కుమార్తె మదిహ(12) పుట్టకతోనే దివ్యాంగురాలు. మదిహ పింఛన్ కోసం తండ్రి యాసిన్ ఎనిమిది సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరిగాడు. యాసిన్ పడుతున్న బాధలను చూడలేక దివ్యాంగుల సంఘం నాయకుడు నరేందర్‌యాదవ్ హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి పరిస్థితిని విన్నవించారు. కలెక్టర్ ఆదేశాలతో ఆదివారం రాత్రి మదిహ నివాసానికి కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాములు, ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్‌లు వెళ్లి అక్కడే పింఛన్ ప్రొసీడింగ్ లెటర్‌ను ఆ బాలికకు అందజేశారు. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా మదిహ నివాసానికి చేరుకుని చిన్నారి దీనస్థితి చూసి చలించి కంట తడి పెట్టారు. నిత్యావసర సరుకుల నిమిత్తం కొంత ఆర్థిక సాయం అందజేశారు. మదిహ పోషణ నిమిత్తం తమ వంతు సాయం అందిస్తామని యాసిన్‌కు ఆమె హామీ ఇచ్చారు.

సర్కిల్ కార్యాలయాల్లో...

ప్రజాపాలన సేవా కేంద్రాలు

- ప్రతి డివిజన్‌కూ ఒక కేంద్రం
- గృహజ్యోతి, ఇతర పథకాల కోసం దరఖాస్తుల స్వీకరణ
- నిరంతరాయంగా కొనసాగనున్న కేంద్రాలు
- దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు
- నిత్యం ఉన్నతాధికారుల పర్యవేక్షణ

కాంగ్రెస్ ప్రభుత్వం తామిచ్చిన ఆరు గ్యారంటీల అమలు దిశగా వడవడిగా అడుగులు వేస్తోంది. గ్యారంటీల్లో అర్హత ఉన్నవారందరికీ లబ్ధి చేకూర్చేలా వినూత్న కార్యక్రమాలతో ప్రజల వద్దకే వెళ్తూ ముందుకుసాగుతోంది.

బంజారాహిల్స్: ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ. 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ అమలు చేస్తుండగా తాజాగా గృహజ్యోతి పథకంలో ఉచిత కరెంటు, రూ. 500లకే వంట గ్యాస్ అమలు చేపట్టింది. వీటన్నింటికీ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించారు.

- ఇంకా చాలామంది అర్హత ఉండి కూడా అమలుకు నోచుకోవడం లేదని, ఇంకా కొన్ని దరఖాస్తుల్లో తప్పులు ఉన్నాయని గ్రహించిన ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటుకు స్వీకారం చుట్టింది.
- సోమవారం జీహెచ్ఎంసీ అన్ని సర్కిల్ కార్యాలయాల్లో సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి.
- ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 కార్యాలయంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట వార్డుల ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటయ్యాయి.


ఖైరతాబాద్‌లోని జూబ్లీహిల్స్ సర్కిల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం

- అలాగే సర్కిల్-17 కార్యాలయంలో సోమాజిగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల సేవా కేంద్రాలను ఉప కమిషనర్ జగన్ ప్రారంభించారు.
- దరఖాస్తుల్లో సమస్యలు ఉన్నా లబ్ధిదారుల ఎంపికలో తప్పుల సవరణ, మరిన్ని సహాయ సహకారాలు అందించేందుకు ఈ సేవా కేంద్రాలు పనిచేయనున్నాయి.
- సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ కేంద్రాలు అన్ని పనివేళల్లో లబ్ధిదారులకు అందుబాటులో ఉంటాయి.

ఉప కమిషనర్లు వీటిని పర్యవేక్షిస్తారు.

- ప్రజాపాలన సేవా కేంద్రాలు ఆయా సర్కిళ్ల కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయి.
- సేవా కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్, దరఖాస్తుదారులు కూర్చొనేందుకు సౌకర్యం, కుర్చీలు, మంచినీటి వసతులను కల్పించారు.
- అధికారులు నియమించిన కంప్యూటర్ ఆపరేటర్‌కు ప్రజాపాలన లాగిన్ ఇచ్చారు.
- దరఖాస్తు చేసుకుని తప్పుల సవరణ, పథకం రాకపోతే సరిజేయడం, అర్హులై ఉండి పథకం జాబితాలో లేకపోతే పథకం జాబితాలో చేరుస్తారు.
- గృహజ్యోతి పథకంలో తప్పుల సరవణతో పాటు కొత్త వాటిని నమోదు చేస్తారు.
- దరఖాస్తుదారులకు సలహాలు, సూచనలు ఇవ్వడమే కాకుండా సందేహాలు నివృత్తి చేసి లబ్ధి చేకూర్చేలా పథకం అందేలా ఈ కేంద్రాలు పనిచేయనున్నాయి.
- ఇటీవల 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే తెల్లరేషన్ కార్డు దారులకు ప్రజాపాలన దరఖాస్తు ద్వారా జీరో బిల్లు ఇస్తున్నారు. అయితే కొంతమంది ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోకపోవడంతో అర్హత ఉండి కూడా లబ్ధి పొందలేకపోతున్నారు. వీరంతా ఈ సేవా కేంద్రాల్లో మళ్లీ అన్ని పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకుంటే లబ్ధి చేకూరుతుంది.
- ప్రజాపాలన దరఖాస్తు ద్వారా తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి రూ. 500 గ్యాస్ సిలిండర్ వస్తుండగా, అర్హత ఉండి కూడా కొంతమంది ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేదు. వారు కూడా ఈ సేవా కేంద్రాల్లో మరోసారి ప్రజాపాలన దరఖాస్తును అన్ని పత్రాలను జతచేసి అందించవచ్చు.

సద్వినియోగం చేసుకోండి

ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలో ఉన్న సర్కిల్-18 కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశాము. రోజూ పనివేళల్లో కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో ఉంటారు. అర్హత ఉన్నవారు అన్ని పత్రాలు జతచేసి అందించి లబ్ధి పొందాలి. ప్రతి వార్డుకూ ఒక కేంద్రం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాము. ఇంకా ఏమైనా సందేహాలు ఉన్నా అడగి నివృత్తి చేసుకోవచ్చు.

– ప్రశాంతి, ఉప కమిషనర్, జీహెచ్ఎంసీ సర్కిల్-18

అనిల్‌కుమార్ యాదవ్‌కు సన్మానం



వెంకటేశ్వరకాలనీ: రాజ్యసభకు ఎంపికైన అనిల్‌కుమార్ యాదవ్‌ను వెంకటేశ్వరకాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. పార్టీని నమ్ముకొని పని చేస్తే ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందని ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటును భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతున్నదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున డివిజన్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


స్కూటరిస్టుకు కౌన్సెలింగ్ ఇస్తున్న పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌ఖాన్

బంజారాహిల్స్: పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న వారిని, రాంగ్‌రూట్‌లో వస్తున్న వారిని, నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వారిని గుర్తించి జరిమానాలు విధించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా దూసుకెళ్లడం ద్వారా ఏర్పడే అనర్థాలపై ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌ఖాన్ కౌన్సెలింగ్ నిర్వహించారు.

వడ్డెర ఐక్య వేదిక జూబ్లీహిల్స్ అధ్యక్షుడిగా వెంకటేశ్


వడ్డెర సంఘం నాయకులు

రహమత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర వడ్డెర ఐక్య వేదిక జూబ్లీహిల్స్ నియోజ వర్గం అధ్యక్షుడిగా వెంకటేశ్, (కార్మికనగర్) ప్రధాన కార్యదర్శిగా శ్రీను (ఎస్‌పీ బీనగర్), రహమత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా రాజు నియమితులయ్యారు. సోమవారం ఎస్పీఆర్ హిల్స్ సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య, నగర అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్ వారికి నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొలుసుల ఎల్లయ్య, నాయకురాలు నాగమ్మ, బోరబండ డివిజన్ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొలువుల్లో సైన్స్ కళాశాల విద్యార్థులు

- 40 మందికి ఉద్యోగాలు
- 21 మందికి జేఎల్, 19 మందికి కానిస్టేబుళ్లుగా కొలువులు
- విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్

బంజారాహిల్స్: సైఫాబాద్ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో విద్యాభ్యాసం చేసి 40 మంది విద్యార్థులు ప్రభుత్వ కొలువులను సాధించారు. వీరు పలు విభాగాల్లో సెలక్ట్ కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ సంతోషం వ్యక్తం చేశారు. 40 మంది 21 మంది జూనియర్ లెక్చరర్ (జేఎల్), టీజీటీ, పీజీటీల్లో, అలాగే మరో 19 మంది విద్యార్థులు కానిస్టేబుళ్ల ఉద్యోగాలను పొందారు. సోమవారం లక్ష్మణ్‌నాయక్ తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వినోద్‌కుమార్ అనే విద్యార్థి ఒక్కటేసారి మూడు జాబ్‌లను సాధించడం పట్ల సన్మానించారు. విద్యార్థులకు అకడమిక్ అంశంలో ప్రాముఖ్యత నివ్వడం వల్లనే సైఫాబాద్ కాలేజీ నుంచి ఇంత మంది ఉద్యోగాలను సాధించారని చెప్పారు. వివిధ నిర్వహణలో ఉన్నత విలువలను పాటిస్తూ భవిష్యత్తులో మరెన్నో పదవులను వారు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రైవేటు స్థలంలో చొరబడిన బస్తీవాసులపై కేసు నమోదు

బంజారాహిల్స్: ప్రైవేటు స్థలంలో చొరబడడమే కాకుండా అందులో గుడిసెలు వేసిన వారిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-5లో 550 గజాల స్థలాన్ని ఉమెన్స్ కో ఆపరేటివ్ సొసైటీ వద్ద నుంచి 1991లో రవిశంకర్ కొనుగోలు చేశారు. అందులో ఎలాంటి నిర్మాణాలు జరపకుండా ఖాళీగా వదిలేశారు. ఇదిలా ఉండగా గతంలో కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నించగా ఇటీవలే ప్రహరీ నిర్మించాడు. స్థలానికి సమీపంలో నివాసం ఉండే దుర్గాభవానీనగర్‌కు చెందిన కొంతమంది ఈ నెల 3న స్థలంలో అక్రమంగా ప్రవేశించారు. తాళం పగులగొట్టి లోపల గుడిసెలు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు గుడిసెలను తొలగించాలని హెచ్చరించారు. కానీ బస్తీవాసులు వినిపించుకోలేదు. ఇదిలా ఉండగా స్థల యజమాని రవిశంకర్ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు బస్తీవాసులపై ఐపీసీ 447, 427, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మధురానగర్ ఇన్‌స్పెక్టర్‌గా మధుసూదన్‌రెడ్డి


డి.మధుసూదన్‌రెడ్డి

వెంగళరావునగర్: మధురానగర్ ఇన్‌స్పెక్టర్‌గా డి.మధుసూదన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తొలిసారిగా 2011లో నిజామాబాద్ జిల్లా బీర్కూర్‌లో ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం మక్తల్, అల్వాల్ ప్రాంతాల్లో ఎస్ఐగా, అనంతరం సైబరాబాద్ కమిషనరేట్‌లో ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ తీసుకున్నారు. అనంతరం నార్సింగ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. అక్కడ నుంచి మధురానగర్ ఎస్‌హెచ్ఓగా బదిలీపై వచ్చారు.

గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారుల సందడి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 60లోని శ్రేష్ఠ ది స్కూల్ ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలు సోమేవారం పాఠశాలలో ఘనంగా జరిగాయి. చిట్టిపొట్టి గ్రాడ్యుయేషన్ డ్రెస్‌లు వేసుకొని పట్టాలు అందుకున్న చిన్నారులు ఫొటోలకు ఫోజులిస్తూ సరదాగా గడిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రెబెకా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



'మాకూ నియామకపత్రాలు ఇవ్వాలి'

పంజగుట్ట: గురుకుల నియామకాల్లో సెలెక్ట్ అయిన బీటెక్, బీఈడీ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వాలని అభ్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అభ్యర్థులు రాఘవేంద్ర, నవనీత, అపర్ణ, శివాని, వినిత మాట్లాడుతూ... 2014 నుంచి ప్రభుత్వమే బీటెక్ చదివిన వారికి బీఈడీ చేసే అవకాశం కల్పించిందన్నారు. తాము బీటెక్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులమని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల ఉపాధ్యాయుల 9200 పోస్టులకు తాము కూడా దరఖాస్తు చేసుకున్నామని, గురుకుల బోర్డు వారు నిర్వహించిన పరీక్షలు రాశామని తాము అదరం టాప్ 100లో వచ్చామని, ఉద్యోగాల్లో సెలెక్ట్ కూడా అయ్యామని తెలిపారు. అయితే సోమవారం ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా ఇచ్చే అపాయింట్‌మెంట్ ఆర్డర్లలో తమ 97 మంది పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవచూపి తమకు కూడా అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

చెత్తకుప్పలు పేరుకుపోకుండా చూసుకోవాలి


ఎస్ఎఫ్ఏలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలో ఓపెన్ గార్బేజ్‌ల వద్ద చెత్తవేయకుండా పలు చర్యలు తీసుకోవడంతో పాటు ఒక వేళ పేరుకుపోతున్నట్లయితే వెంటనే వాటిని తరలించేలా చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని సీఎంటీసీ భవన్‌లో డివిజన్ పరిధిలోని ఎస్ఎఫ్ఏలో, రాంకీ సిబ్బంది, ఏఎంహెచ్‌వో రజినీకాంత్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు ఎప్పటికప్పుడు చెత్తనిల్వకుండా ఉండేలా వాహనాలు పంపించి వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. తరచు చెత్త పడుతున్న ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

'డబుల్' ఇళ్లలో విద్యుత్ లో ఓల్టేజీ కష్టాలు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ కమలానగర్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాసితులను విద్యుత్ కష్టాలు వెంటాడుతున్నాయి. రెండు నెలలుగా విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో అపార్ట్‌మెంట్‌లలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. లో ఓల్టేజీతో ఇళ్లలో విద్యుత్ దీపాలు సరిగా వెలగక, ఒక్కోసారి విద్యుత్ ఉపకరణాలు కాలిపోతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని అపార్ట్‌మెంట్ వాసులు కోరుతున్నారు.

చెల్లింపుల విషయంలో గొడవ.. కత్తితో దాడి

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఆయా ఘటనల్లో పలువురికి గాయలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఎర్రగడ్డ రైతుబజార్‌లో పండ్ల వ్యాపారం చేసుకునే నబీకి వినియోగదారుడు అఫ్రోజ్‌ల మధ్య గూగుల్ పే చెల్లింపులో అర్ధరాత్రి గొడవ జరిగింది. ఆవేశంతో అఫ్రోజ్ కత్తితో నబీపై దాడి చేశాడు. ఈ ఘటనలో నబీకి గాయమైంది. బాబా సైలానీనగర్‌లో నివాసం ఉండే బీహార్‌కు చెందిన ఠాగూర్‌రాజ్ కుటుంబ తగాదాలతో తమ బంధువులైన చందన్, సంతోష్‌లపై పేపర్ బ్లేడ్‌తో దాడి చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాధ్యతలు స్వీకరించిన జోనల్ కమిషనర్



బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హేమంత్ బోర్కాడే నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన జోనల్ కమిషనర్‌గా ఖైరతాబాద్ సెంట్రల్ జోన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వివిధ విభాగాల అధికారులను పరిచయం చేసుకున్నారు.

అవగాహన కోసం అందుబాటులో ఈవీఎంలు


ఈవీఎంలను పరిశీలిస్తున్న సర్కిల్:18 డీసీ ప్రశాంతి

బంజారాహిల్స్: రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కలిగించేందుకు ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ సర్కిల్-18 కార్యాలయంలో ఈవీఎంలను ఏర్పాటు చేశారు. ఓటు ఎలా వేయాలి.. ఈవీప్యాట్ల పనితీరుపై ఇక్కడ అవగాహన కల్పిస్తారు. నెల రోజుల పాటు ఈవీఎంలు ఇక్కడ అవగాహన కోసం అందుబాటులో ఉంటాయని ఉప కమిషనర్ ప్రశాంతి తెలిపారు. ప్రజలు ఎవరైనా సరే సర్కిల్ కార్యాలయంలో వీటి పనితీరును తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

వివేకా హత్య సునీత దంపతుల కుట్రే!

వారిద్దరితోపాటు శివప్రకాశ్‌రెడ్డిల తీరు సందేహాస్పదం • 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో వైఎస్ వివేకా పీఏ ఎంవీ కృష్ణారెడ్డి

- రెండో భార్య షమీమ్‌కు ఆస్తిలో వాటా ఇవ్వాలని భావించిన వివేకా
- వివేకా లెటర్‌ను దాచిపెట్టమని అల్లుడు రాజశేఖర్‌రెడ్డి చెప్పారు
- అబద్ధం చెప్పాలని సునీత, రాజశేఖర్‌రెడ్డి నన్ను వేధించారు
- ఎంపీ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పాలని ఒత్తిడి
- పోలీసులు, సీబీఐ అధికారులు చిత్రహింసలకు గురిచేశారు
- నేను అబద్ధం చెప్పకపోతే నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి జైలుకు వెళ్లాల్సి వస్తుందని సునీత అన్నారు
- దస్తగిరి అప్రూవర్‌గా మారడం వెనుక పక్కా కుట్ర



సాక్షి, అమరావతి: 'వైఎస్ వివేకానందరెడ్డిని ఆయన కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డే హత్య చేయించి ఉండొచ్చు. ఈ హత్య వెనుకనున్న ఏదో విషయాన్ని దాచిపెట్టాలని వారు ప్రయత్నిస్తున్నారు. వివేకం సార్ రెండో పెళ్లితో ఆ ఇంట్లో తలెత్తిన ఆస్తి గొడవలకు ఆయన హత్యకు ఏదైనా సంబంధం ఉందా.. అనిపిస్తోంది. కూతురు, అల్లుడు, పెద్ద బావమరిదే ఈ దారుణానికి తెగించి ఉండొచ్చు'.. అని వైఎస్ వివేకానందరెడ్డి పీఏగా చేసిన ఎంవీ కృష్ణారెడ్డి వెల్లడించారు. 'వివేకానందరెడ్డి రాసిన లెటర్ పోలీసులకు వెంటనే ఇచ్చేసి ఉంటే దర్యాప్తు సక్రమంగా సాగేది. కానీ, ఆ లెటర్‌ను దాచిపెట్టమని ఆయన అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఎందుకు చెప్పారు? ఈ కేసుతో సంబంధంలేని ఎంపీ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిల పేర్లు చెప్పాలని నన్ను ఎందుకు బెదిరించారు? నేను అబద్ధం చెప్పకపోతే తన భర్త రాజశేఖర్‌రెడ్డి జైలుకు వెళ్లాల్సి ఉంటుంది' అని సునీత ఎందుకు అన్నారని కూడా ఆయన వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎంపీ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పాలని టీడీపీ ప్రభుత్వంలో పోలీసులు, తరువాత సీబీఐ అధికారి రాంసింగ్ తనను చిత్రహింసలకు గురిచేశారని.. అయినాసరే వారు చెప్పినట్లుగా అబద్ధం చెప్పాలని సునీత, రాజశేఖర్‌రెడ్డిలు ఎందుకు ఒత్తిడి చేశారన్న నిజం నిగ్గుతేలాల్సి ఉందని కూడా కృష్ణారెడ్డి అన్నారు. వివేకానందరెడ్డిని పాశవికంగా హత్య చేశానన్న దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడం ఏమిటి? అతను చెప్పే కట్టుకథలను పట్టుకుని సీబీఐ దర్యాప్తు చేయడమేమిటని ఆయన ప్రశ్నించారు. వైఎస్ వివేకానందరెడ్డి చివరివరకు కూడా వైఎస్ జగన్‌ను సీఎం చేయడానికి, వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఎంపీగా గెలిపించడానికే కృషిచేశారని ఆయన స్పష్టంచేశారు. వివేకాకు పీఏగా దాదాపు 37ఏళ్ల పాటు పనిచేసిన కృష్ణారెడ్డి.. ఆయనకు అత్యంత సన్నిహితుడు, నమ్మకస్తునిగా గుర్తింపు పొందారు. ఆయన కుటుంబ వ్యవహారాలతో సహా అన్ని విషయాలు సమగ్రంగా తెలిసిన వ్యక్తి. 2019, మార్చి 15 ఉదయం వివేకానందరెడ్డి మృతిచెందిన విషయాన్ని కృష్ణారెడ్డే మొదటగా గుర్తించి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో పోలీసులు, తరువాత సీబీఐ అధికారుల చేతిలో చిత్రహింసలకు గురైన బాధితుడు కూడా కృష్ణారెడ్డే. వైఎస్ వివేక హత్య కేసుకు సంబంధించిన పరిణామాలను సమీపం నుంచి పరిశీలిస్తున్న కీలకవ్యక్తి అయిన కృష్ణారెడ్డి 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సంచలన విషయాలను వెల్లడించారు.

> **సాక్షి: మామా అల్లుళ్ల మధ్య సంబంధాలు ఎలా ఉండేవి?**
>
> **కృష్ణారెడ్డి :** నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి మీద వివేకం సార్‌కు మంచి అభిప్రాయంలేదు. అల్లుడు కాబట్టి తప్పదు కదా. ఆయన మీద సార్ తరచూ కోప్పడేవారు. ఆ కుటుంబంలో ఏం జరుగుతోందో నాకు తెలీదు. కానీ, అల్లుడి మీద సార్ గట్టిగా అరుస్తూ ఉండేవారు. వివేకం సార్ రెండో భార్య షమీమ్ విషయంలోనే వాళ్ల మధ్య గొడవలు జరిగేవి.

సాక్షి: 2019, మార్చి 15న ఏ సమయంలో మీరు వివేక ఇంటికి వెళ్లారు?

కృష్ణారెడ్డి: రోజూ వెళ్లినట్లే ఆ రోజు కూడా ఉ.5.30కే వివేకం సార్ ఇంటికి వెళ్లాను. ఇంట్లో లైట్‌వేసి లేదు. అంటే సారు ఇంకా నిద్ర నుంచి లేవలేదని అనుకున్నా. బయట లైట్ దగ్గర కూర్చుని పేపర్ చదువుకుంటూ ఉన్నా. కాసేపటి తరువాత సౌభాగ్యమ్మకు ఫోన్‌చేసి సార్ ఇంకా నిద్ర లేవలేదు.. మీరు ఫోన్ చేసి నిద్ర లేపుతారా అని అడిగాను. రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చి ఉంటారు.. కాసేపు నిద్రపోనీ అని ఆమె చెప్పారు. కాసేపటికే వంట మనిషి లక్ష్మమ్మను ఆమె కొడుకు ప్రకాశ్ తన బైక్ మీద తీసుకొచ్చాడు. ఆలస్యమైంది కిటికీ వద్దకు వెళ్లి సారును నిద్రలేపు అని చెప్పాను. ఆ సమయంలో వాచ్‌మెన్ రంగన్న మెయిన్ డోర్ ముందర నిద్రపోతూ ఉన్నాడు. లక్ష్మమ్మ వచ్చేసరికి రంగన్న నిద్రలేచి ఉత్తరం వైపు ఉన్న పార్కు వైపు వెళ్లాడు. ఇంతలో 'సార్ పడిపోయాడు' అని అరుచుకుంటూ రంగన్న వచ్చాడు. మేము ఆ వైపు పరిగెత్తి వెళ్లాం. ఇంటికి ఉత్తరం వైపు ఉన్న తలుపు తెరచి ఉంది. లోపలికి వెళ్లి చూస్తే సార్ హాల్లోగానీ బెడ్‌రూమ్‌లోగానీ లేరు. అక్కడ రక్తపు మరకలు ఉన్నాయి. బాత్రూమ్‌లో చూస్తే వివేకం సార్ రక్తపుమడుగులో పడి ఉన్నారు. నేను సార్ చేయిపట్టుకుని నాడి చూశాను. నాడి కొట్టుకోవడం లేదు. ఆయన చనిపోయారని నిర్ధారించుకున్నా.

సాక్షి: ఆ వెంటనే మీరు ఏం చేశారు?

కృష్ణారెడ్డి: నేను వెంటనే సార్ అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డికి ఫోన్‌చేసి చెప్పాను. బావ మనకు లేరు.. ఎవరో ఏదో చేశారు. రక్తపు మడుగులో ఉన్నారు. తల మీద గాయం ఉంది అని చెప్పాను. సరే అని ఆయన ఫోన్ పెట్టేశారు. నేను 6.15కు కాల్ చేశాను. నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి నాతో 47 సెకన్లు మాట్లాడి ఫోన్ పెట్టేశారు. ఆ తరువాత సార్ పెద్ద బావమరిది శివప్రకాశ్‌రెడ్డికి కాల్ చేశాను. కానీ, ఆయన ఫోన్ కలవలేదు. నాకు సౌభాగ్యమ్మ ఫోన్ నుంచి కాల్ వచ్చింది. నేను మేడంకు కూడా విషయం చెప్పాను.

సాక్షి: ఆ తరువాత ఏం జరిగింది?

కృష్ణారెడ్డి: అప్పుడే నేను, ప్రకాశ్ అక్కడ ఉన్న వీల్ చెయిర్ దగ్గర లెటర్ దొరికింది. ఆ లెటర్ చదివాను. తన మాజీ డ్రైవర్ తనను చంపినట్లు వివేకం సార్ ఆ లెటర్‌లో రాసి ఉంది. ఇంతలో సౌభాగ్యమ్మ నాకు ఫోన్ చేశారు. అల్లుడు రాజశేఖర్‌రెడ్డికి ఫోన్ ఇమ్మన్నాను. ఆమె ఆయనకు ఫోన్ ఇస్తే ఆ లెటర్‌లో రాసింది చదివి వినిపించాను. ఆ లెటర్‌ను దాచిపెట్టు ఎవరికి చెప్పొద్దు అని రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. లెటర్ గురించి పోలీసులకు చెప్పకపోతే ఇబ్బంది అవుతుంది కదా అని అన్నాను. ఏం ఇబ్బంది అవ్వదు.. మేం చూసుకుంటాం.. ఆ లెటర్ జాగ్రత్తగా దాచిపెట్టు అని ఆయన చెప్పారు. దాంతో ఆ లెటర్ విషయం పోలీసులకుగానీ ఎవరికీగానీ చెప్పలేదు. వంట మనిషి లక్ష్మమ్మ కొడుకు ప్రకాశ్‌కు ఆ లెటర్ ఇచ్చి మా ఇంట్లో ఇచ్చి రమ్మన్నాను. ఇంతలో రాజశేఖరరెడ్డి మళ్లీ నాకు ఫోన్ చేశారు. అప్పటికే సీఐ శంకరయ్య వచ్చారని చెప్పాను. ఆయన నా ఫోన్‌తో సీఐ శంకరయ్యతో మాట్లాడారు. తరువాత శంకరయ్య చెప్పినట్లుగా పోలీసు కంప్లైంట్ ఇవ్వమని రాజశేఖరరెడ్డి నాతో చెప్పారు. నేను అలానే చేశాను.

సాక్షి: ఆ లెటర్ అప్పుడే పోలీసులకు ఇచ్చేసి ఉంటే ఈ కేసు దర్యాప్తు వేరే విధంగా ఉండేది కదా?

కృష్ణారెడ్డి: ఆ లెటర్ అప్పుడే పోలీసులకు ఇచ్చి ఉంటే కేసు దర్యాప్తు సరైన విధంగా జరిగేది. కానీ, నాకు ఇష్టంలేకపోయినా రాజశేఖరరెడ్డి చెప్పడంతోనే ఆ లెటర్‌ను దాచి ఉంచాల్సి వచ్చింది.

సాక్షి: మిమ్మల్ని ఎందుకు అరెస్టు చేశారు?

కృష్ణారెడ్డి: నన్ను పోలీసులు ఎందుకు అరెస్టుచేశారో నాకే తెలీదు. లెటర్ దాచిపెట్టమని రాజశేఖరరెడ్డి చెప్పాడు. పోలీసులతో ఇబ్బంది వస్తుందని చెప్పినా తాను చూసుకుంటానని లెటర్ దాచి పెట్టమన్నాడు. టీడీపీ ప్రభుత్వం ఒత్తిడో.. వీళ్ల వాళ్లా లాలూచీ అయి కృష్ణారెడ్డిని అరెస్టుచేయిస్తే సరిపోతుందని అనుకున్నారో తెలీదు.

సాక్షి: మిమ్మల్ని అరెస్టు చేశాక ఏం జరిగింది?

కృష్ణారెడ్డి: నన్ను అదేరోజు సాయంత్రం పోలీసులు అరెస్టుచేసి డీటీసీలో 13 రోజులపాటు ఉంచారు. బాగా కొట్టారు. రాజశేఖర్‌రెడ్డి చేశాడా.. శివశంకర్‌రెడ్డి చేసి ఉంటాడా చెప్పు అని తీవ్రంగా కొట్టారు. నాకు ఏమీ తెలీదని ఎంత చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు.

సాక్షి: పోలీసులకు ముందు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి మీద అనుమానం కలిగిందా?

కృష్ణారెడ్డి: పోలీసులు ముందు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డినే అనుమానించారు. వివేకం సార్‌ను ఆయనే హత్య చేయించి ఉంటాడా అని అడిగారు. నాకేమీ తెలీదని చెప్పాను. పోలీసులు కొట్టడంతో దాదాపు ఏడాదిపాటు నా చేతితో ఏమీ పట్టుకోలేకపోయాను.

సాక్షి: లెటర్‌ను దాచి పెట్టమన్న రాజశేఖర్‌రెడ్డిని ఎందుకు ప్రశ్నించరని పోలీసులను అడగలేదా?

కృష్ణారెడ్డి: పోలీసులు నన్ను కొడుతూ ఉంటే నేనేం మాట్లాడను. నా మాట వాళ్లు వినిపించుకుంటే కదా.

సాక్షి: రాజశేఖర్‌రెడ్డిని పోలీసులు ఎందుకు విచారించలేదు?

కృష్ణారెడ్డి: ఎందుకు విచారించలేదో మరి. సీబీఐ వాళ్లకు కూడా అదే విషయం చెప్పాను. కానీ, వాళ్లు కూడా పట్టించుకోలేదు. వాళ్ల మధ్య ఏం ఒప్పందం ఉందో తెలీదు.

> **సాక్షి: ఎవరి పేర్లు అయినా చెప్పాలని సునీత, రాజశేఖర్‌రెడ్డి మిమ్మల్ని ఒత్తిడి చేశారా?**
>
> **కృష్ణారెడ్డి:** ఒకసారి నన్ను హైదరాబాద్ పిలిపించి మాట్లాడారు. అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పమన్నారు. వాళ్లు ముగ్గురు నన్ను బెదిరించినట్లు కూడా చెప్పమన్నారు. సీబీఐ అధికారులకు అలా చెబితే నన్ను రక్షిస్తామన్నారు. లేకపోతే చార్జ్‌షీట్‌లో నా పేరు చేరుస్తాం.. జైలుకు వెళ్లాల్సి ఉంటుందని బెదిరించారు. అయినా నేను ఒప్పుకోలేదు. దాంతో సునీత నా మీద కోపంతో కేకలు వేసింది.

సాక్షి: హత్య ప్రదేశంలో సాక్ష్యాధారాలను చెరిపేయాలని ఎంపీ అవినాశ్‌రెడ్డి మీతో చెప్పారని కొందరు ఆరోపిస్తున్నారు? దీనిపై ఏమంటారు?

కృష్ణారెడ్డి: అసలు వివేకం సార్ మృతదేహాన్ని బాత్రూమ్ నుంచి తీసుకువచ్చినప్పుడు ఎంపీ అవినాశ్‌రెడ్డి అక్కడ లేనేలేరు. అక్కడ సాక్ష్యాలను చెరిపివేయించింది ఎర్ర గంగిరెడ్డే. ఎంపీ అవినాశ్‌రెడ్డిని రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికే ఆ ఆరోపణలు చేస్తున్నట్లుగా ఉంది. అక్కడ తుడిపించి వేసింది గంగిరెడ్డే. అక్కడున్న అందరూ అది చూశారు.

సాక్షి: ఎంపీ అవినాశ్‌రెడ్డి సీఐ శంకరయ్యను బెదిరించారనే ఆరోపణ కూడా ఉంది కదా?

కృష్ణారెడ్డి: సీఐ శంకరయ్య పక్కనే నేనున్నా. ఆయన్ని ఎవరూ బెదిరించనే లేదు.

సాక్షి: సీబీఐ కేసు దర్యాప్తు చేపట్టిన తరువాత ఎంపీ అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పమని మీ మీద ఒత్తిడి వచ్చిందా?

కృష్ణారెడ్డి: ఎంపీ అవినాశ్, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పాలని రాంసింగ్ నన్ను బాగా వేధించారు. వాళ్లిద్దరూ నన్ను బెదిరించారని చెప్పమన్నారు. అలాంటిదేమీ లేదని నేను చెప్పడంతో నన్ను బాగా కొట్టారు. ఉన్నది ఉన్నట్లు చెబుతాగానీ అబద్ధం చెప్పనని నేను అంటే మరింత గట్టిగా కొట్టేవారు. కొట్టినా చంపినా నాకు తెలిసింది ఇంతే అని చెప్పాను.

సాక్షి: ఎంపీ అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లను ఇరికించాలని సీబీఐ అధికారి రాంసింగ్ ఎందుకు భావించారు?

కృష్ణారెడ్డి: సునీత, రాజశేఖరరెడ్డితో రాంసింగ్ ఏం కమిట్ అయ్యారో.. వాళ్లద్దరి పేర్లు చెప్పాలనే వేధించారు.

సాక్షి: సునీత ఎందుకు అంతగా కేకలు వేశారు?

కృష్ణారెడ్డి: నా మీద సునీత కోపంతో అరుస్తూ ఉంటే రాజశేఖర్‌రెడ్డి ఆమెను సముదాయించేందుకు యత్నించారు. 'ఈ కేసు విషయంలో కృష్ణారెడ్డి సహకరించకపోతే రాజశేఖర్‌రెడ్డి జైలుకు వెళ్లాల్సి వస్తుంది' అని సునీత ఆయనతో అంది. నాకేమీ అర్థం కాలేదు. వివేకం సార్ హత్యలో వీళ్ల పాత్ర ఉండే మోనని మొదటిసారి అనిపించింది. అంటే నాతో అబద్ధం చెప్పించి వేరెవరినో నాశనం చేయాలని సునీత భావిస్తోందని అర్థమైంది.

సాక్షి: సీబీఐ అధికారి రాంసింగ్ మీతో ఎలా వ్యవహరించారు?

కృష్ణారెడ్డి: ఒకరోజు రాంసింగ్ ఫోన్‌చేశారు. తాము చెప్పినట్లు విన్నారు కాబట్టే రంగన్న, దస్తగిరిలను రక్షించాం. నేను కూడా చెప్పినట్లు వింటే రక్షిస్తామన్నారు. కడప సెంట్రల్ జైలు గెస్ట్‌హౌస్‌కు నా పిల్లలతో రమ్మని చెప్పారు. ఆ విషయాన్ని రాజశేఖరరెడ్డికి చెబితే రాంసింగ్ చెప్పినట్లు చేయమన్నారు. మా ఇద్దరు కొడుకులతో సెంట్రల్ జైలు గెస్ట్‌హౌస్‌కు వెళ్లాం. వాళ్లు చెప్పినట్లు వినకపోతే జైలుకు పంపిస్తామని బెదిరించారు. తాము పెద్దపెద్ద వాళ్లనే జైలుకు పంపాం.. నువ్వెంత అని అన్నారు. నాకు తెలిసిందే చెబుతా తప్ప మీరు చెప్పమన్నట్లు అబద్ధం చెప్పలేనని నేను అన్నా. దాంతో కర్ర తీసుకుని నా కొడుకుల ముందే దాదాపు 20 సార్లు తీవ్రంగా కొట్టారు.

> **సాక్షి: వివేకానందరెడ్డి రెండో పెళ్లి చేసుకోవడంతో ఆ కుటుంబంలో గొడవలు జరిగేవా?**
>
> **కృష్ణారెడ్డి:** షమీమ్ అనే ఆవిడను వివేకం సార్ రెండో పెళ్లి చేసుకోవడంతో ఆ కుటుంబంలో గొడవలు జరిగేవి. ఒకరోజు సౌభాగ్యమ్మ, సునీత, రాజశేఖర్‌రెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి కలిసి వివేకం సార్‌తో గొడవ పడ్డారు. తాను షమీమ్‌ను పెళ్లి చేసుకోవడమే కాదు ఆమెతో తనకు ఒక అబ్బాయి కూడా ఉన్నాడని సార్ చెప్పారు. ఆ ఇద్దరి బాధ్యతతోపాటు ఆమెకున్న ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లి చేయడం కూడా తన బాధ్యతేనని అన్నారు.

సాక్షి: మీ అబ్బాయి పెళ్లిని చెడగొట్టారు అంటారు..

కృష్ణారెడ్డి: మేం సెంట్రల్ జైలు గెస్ట్‌హౌస్ నుంచి ఇంటికి వచ్చిన మర్నాడే మా అబ్బాయికి సంబంధం కుదిరిన వారి నుంచి ఫోన్ వచ్చింది. పెళ్లి సంబంధం రద్దు చేసుకుంటున్నామని చెప్పారు. నా మీద కేసు ఉంది.. నేను జైలుకు వెళ్లాను.. మా ఆస్తులన్నీ తీసేసుకుంటామని సునీత, రాజశేఖర్‌రెడ్డి వారికి ఫోన్‌చేసి చెప్పారట. వాళ్లను హైదరాబాద్ పిలిపించుకుని మరీ బెదిరించి పెళ్లి సంబంధం రద్దుచేసుకునేలా చేశారు. వాళ్లు చెప్పినట్లు వినాలని నన్ను ఒప్పించేందుకు సునీత, రాజశేఖర్‌రెడ్డి అలా చేశారు. ఈ సంబంధం కాకపోతే మరో సంబంధం కుదురుతుందని నేను వారికి లొంగలేదు.

సాక్షి: మీరు రాంసింగ్ మీద ఫిర్యాదు చేశారు కదా?

కృష్ణారెడ్డి: నేను ఎంతమందితో చిత్రవధలకు గురయ్యేది. టీడీపీ ప్రభుత్వంలో ముందు పోలీసులు కొట్టారు. సునీత, రాజశేఖర్‌రెడ్డి హైదరాబాద్ పిలిపించుకుని బెదిరించారు. మా అబ్బాయి పెళ్లి సంబంధం చెడగొట్టారు. సీబీఐ అధికారి రాంసింగ్ నన్ను కడపలో కొట్టారు. ఢిల్లీ పిలిపించుకుని గొడ్డును బాదినట్లు కొట్టారు. ఇక ఎంతమందితో దెబ్బలు తినాలి.. అందుకే ఎస్పీకి ఫిర్యాదు చేశాను. నాకు ప్రాణహాని ఉంది.. భద్రత కల్పించాలని కోరాను. పులివెందుల కోర్టులో కూడా పిటిషన్ వేశాను.

సాక్షి: వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని ఎంపీ అవినాశ్‌రెడ్డి చెప్పారని ఒక ఆరోపణ వచ్చింది. ఆయన అలా చెప్పారా?

కృష్ణారెడ్డి: ఆ మాటే వినలేదు. అసలు ఆ విషయం ఎలా బయటకు వచ్చిందో కూడా నాకు తెలీదు.

సాక్షి: దస్తగిరి ఎలాంటి వ్యక్తి?

కృష్ణారెడ్డి: దస్తగిరి డ్రైవర్‌గా ఉండేవాడు. ప్రవర్తన సరిగా లేదని తీసేశారు. వివేకం సార్‌ను ముసలోడా అనేవాడు. డ్యాన్స్ చేసేవాడు.. వెక్కిరించేవాడు. దాంతో సౌభాగ్యమ్మ అతనిని పని నుంచి తీసేశారు. అతని ఇంట్లో వాళ్లు వచ్చి బాధపడితే సౌభాగ్యమ్మను ఒప్పించి మళ్లీ పనిలో పెట్టించాను. కానీ, ఆ తరువాత దస్తగిరి మరింత మారిపోయాడు. వివేకం సార్ షమీమ్ ఇంటికి వెళ్లాలంటే ఇతనే డ్రైవర్. దాంతో దస్తగిరికే ఆయన ప్రాధాన్యం ఎక్కువ ఇచ్చేవారు. దస్తగిరి డబ్బు మనిషి.

సాక్షి: వివేకానందరెడ్డిని ఎవరు చంపి ఉంటారు? మీతో ఎందుకు అబద్ధం చెప్పించాలని చూస్తున్నారు?

కృష్ణారెడ్డి: ఎంపీ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పాలని సునీత, రాజశేఖర్‌రెడ్డి ఎందుకు ప్రయత్నిస్తున్నారో అర్థంకావడంలేదు. నాతో ఒక అబద్ధం చెప్పించాలని ప్రయత్నిస్తున్నారంటే.. దాని వెనుక వాళ్లకేదో ఉద్దేశం ఉండే ఉంటుంది. ఎవర్నో కాపాడేందుకు.. ఏదో నిజాన్ని దాచేందుకే వాళ్లిద్దరూ ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోంది. సీబీఐ అధికారి రాంసింగ్ కూడా నాతో అబద్ధాలు చెప్పాలని ఎందుకు పట్టుబట్టారో తెలీడంలేదు. కేసు దర్యాప్తు సక్రమంగా సాగితేనే వాస్తవాలు బయటకొస్తాయి. కానీ, సీబీఐ తీరు సక్రమంగాలేదు. అదే బాధేస్తోంది.

> **సాక్షి: సీబీఐ అధికారులు పిలిస్తే మీరు ఢిల్లీ వెళ్లారు కదా.. అక్కడ ఏం జరిగింది?**
>
> **కృష్ణారెడ్డి:** సీబీఐ అధికారులు నోటీసు ఇస్తే ఢిల్లీ వెళ్లాను. నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డికి చెప్పే వెళ్లాను. నన్ను ఢిల్లీలో నెలరోజులు ఉంచి తీవ్రంగా వేధించారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పేర్లు చెప్పాలని అక్కడ కూడా రాంసింగే వేధించారు. నాకు తెలిసింది ఇప్పటికే చెప్పాను. లెటర్ దాచి పెట్టడమే నేను చేసిన తప్పు.. అది కూడా రాజశేఖర్‌రెడ్డి చెబితేనే చేశాను.. అంతకుమించి నాకేమీ తెలీదని చెప్పాను. దాంతో వాళ్లు నన్ను కొట్టేవారు. రోజూ రాత్రి సునీత, రాజశేఖర్‌రెడ్డి ఫోన్ చేసేవారు. నన్ను తీవ్రంగా కొడుతున్నారని వారికి నేను చెప్పేవాడిని.. నెల రోజులవుతోందని చెప్పినా వారు పట్టించుకోలేదు.

సాక్షి: వివేకానందరెడ్డి ఎవరి కోసం ఎన్నికల ప్రచారం చేసేవారు?

కృష్ణారెడ్డి: జగన్‌ను సీఎంను చేయాలి.. అవినాశ్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలనే వివేకానందరెడ్డి చివరివరకూ ప్రచారం చేశారు. అందుకోసమే రోజూ తిరిగేవారు. చివరిరోజూ కూడా అలిగిన పార్టీ నేతలను బుజ్జగించి జగన్ సీఎం అవుతాడు.. అవినాశ్ మళ్లీ ఎంపీ అవుతాడు.. పార్టీ మీకు గుర్తింపు ఇస్తుంది.. ఎందుకు అలుగుతారని నచ్చజెప్పి వచ్చారు.

> **సాక్షి: దస్తగిరి చెప్పిందే నిజం అనే కోణంలో సీబీఐ దర్యాప్తు చేస్తోంది కదా?**
>
> **కృష్ణారెడ్డి:** దస్తగిరిని మేనేజ్ చేసి అలా చెప్పిస్తున్నారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలను లక్ష్యంగా చేసుకునే అతనితో అలా అబద్ధాలు చెప్పిస్తున్నారు. అసలు వివేకం సార్‌ను అంత క్రూరంగా చంపాను అని చెప్పిన దస్తగిరిని అప్రూవర్‌గా ఎలా మారుస్తారు? అతను చెప్పింది ఎలా పరిగణనలోకి తీసుకుంటారు? అందుకే దీని మీద నేను కోర్టులో పిటిషన్ వేశాను. చేతిలో 500 రూపాయలు కూడాలేని దస్తగిరి ఇప్పుడు పెద్దపెద్ద కార్లలో తిరుగుతూ పంచాయతీలు చేస్తున్నాడు. అప్రూవర్‌గా మారి తాము చెప్పినట్లు చెప్పాలని ఎవరో అతనికి భారీగా డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అతను చెప్పే అబద్ధాలనే పరిగణనలోకి తీసుకుంటూ సీబీఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

> **సాక్షి: చివరగా.. వివేకానందరెడ్డి హత్య గురించి ఏమంటారు?**
>
> **కృష్ణారెడ్డి:** జరుగుతున్నదంతా చూస్తే.. సునీత, రాజశేఖర్‌రెడ్డి, శివప్రకాశ్‌రెడ్డిల మీదే అనుమానం కలుగుతోంది. వీళ్లే వివేకం సార్‌ను ఏమైనా చేసి మరొకరి మీద నింద వేయాలని చూస్తున్నారా అనిపిస్తోంది. ఆస్తి గొడవలు, షమీమ్ విషయం.. ఆస్తి వేరొకరికి పోతుందనే చేశారా అనిపిస్తోంది. ఎందుకంటే అబద్ధం చెప్పమని నన్ను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఎవరైనా నిజం చెప్పాలని అంటారు. కానీ, అబద్ధం చెప్పమని వీళ్లు ఎందుకు అంటున్నారన్నది చూడాలి. అందుకే వివేకం సార్‌ను వీళ్లే ఏమైనా చేశారనిపిస్తోంది. నేను అబద్ధం చెప్పకపోతే తన భర్త రాజశేఖర్‌రెడ్డి జైలుకు పోతారని కూడా సునీత నా ముందే అంది.

బాబు డైరెక్షన్‌లోనే పీకే వ్యాఖ్యలు!



శనివారం చంద్రబాబుతో మూడుగంటలు సమావేశం

బాబు చెప్పిన మేరకే ఆదివారం పీకే వైఎస్సార్‌సీపీపై వ్యతిరేక వ్యాఖ్యలు

- ఏ సర్వేలు చేయడంలేదంటూనే వైఎస్సార్‌సీపీపై విషం
- బాబు మేలు కోరే ఇలా మాట్లాడారంటున్న విశ్లేషకులు
- సోమవారమూ బాబుతో పీకే రెండున్నర గంటలపాటు భేటీ
- ఆ భేటీ తర్వాతే అనంతపురం జిల్లా సభకు చంద్రబాబు

సాక్షి, హైదరాబాద్: గతంలో ఎన్నికల వ్యూహకర్తగా పనిచేసిన ప్రశాంత్ కిషోర్ (పీకే) ఆదివారం హైదరాబాద్‌లోని ఓ సదస్సులో ఏపీలో వైఎస్సార్‌సీపీపై చేసిన వ్యాఖ్యలు చంద్రబాబు ప్రేరేపితమని బయటపడిపోయింది. టీడీపీ అధినేత చంద్రబాబుతో ముందుగా సమావేశమై, ఆయన డైరెక్షన్‌లోనే ప్రశాంత్ కిషోర్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తేటతెలమైంది. హైదరాబాద్ నగరంలోని ఖరీదైన హోటల్‌లో బస చేసి, గంటల తరబడి చంద్రబాబుతో భేటీలు జరుపుతున్న ప్రశాంత్ కిషోర్.. బాబు వ్యూహంలో భాగంగానే వైఎస్సార్‌సీపీపై వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఓ ఆంగ్ల పత్రిక సదస్సులో పాల్గొనడానికి వచ్చిన ప్రశాంత్ కిషోర్ శనివారం మూడు గంటలపాటు చంద్రబాబుతో సమావేశమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఆ సమావేశంలో చంద్రబాబు కోరిన మేరకు ఆదివారం సదస్సులో ఏపీ ఎన్నికలపై వ్యాఖ్యలు చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. తాను సర్వేలు చేయడంలేదని, ఏ రాజకీయ పార్టీకీ సలహాలు ఇవ్వడంలేదంటూనే, పీకే ఒక పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటంలో అంతర్యం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎలాంటి సర్వేలు చేయకుండా, గణాంకాల్లేకుండానే ఓ పార్టీ ఓడిపోతుందని చెప్పడం కచ్చితంగా రాజకీయ ప్రేరేపితమేనని విశ్లేషకులు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రోజురోజుకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుండటం, టీడీపీ ఓటమి ఖాయమని తేలడంతో ప్రజల్లో గందరగోళం సృష్టించాలన్న ఉద్దేశంతోనే పీకేతో చంద్రబాబు ఆ వ్యాఖ్యలు చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు దగ్గరపడేకొద్దీ వీరు వైసీపీపై ఇటువంటి విష ప్రచారాన్ని మరింతగా చేయాలని చంద్రబాబు, పీకే నిర్ణయించినట్లు చెబుతున్నారు.

> **సోమవారమూ బాబుతో పీకే భేటీ**
>
> సోమవారం ఉదయం కూడా ప్రశాంత్ కిషోర్ రెండున్నర గంటలపాటు చంద్రబాబుతో భేటీ అయ్యారు. టీడీపీ ఎన్నికల వ్యూహకర్త రాబిన్ శర్మ (ఒకప్పుడు పీకే టీంలో సభ్యుడు), లోకేశ్ సన్నిహితుడు కిలారి రాజేష్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సమావేశం ముగిసేవరకు సందర్భంగా సోమవారం ఉదయం చంద్రబాబు మరెవరికి అప్పాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని తెలిసింది. పీకేతో భేటీ తర్వాతే చంద్రబాబు అనంతపురం జిల్లాలో టీడీపీ సమావేశానికి వెళ్లారని సమాచారం. సోమవారం సాయంత్రం ప్రశాంత్ కిషోర్ పాట్నా వెళ్లినట్లు తెలిసింది.

ప్రశాంత్ కిశోర్ ఓ చిల్లర మనిషి

- డబ్బులు తీసుకుని వాగే వారిని పట్టించుకోనక్కర్లేదు
- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: డబ్బులు తీసుకుని చిల్లర వాగుడు వాగే ప్రశాంత్ కిశోర్ వంటి వారిని పట్టించుకోవలసిన అవసరం లేదని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వర రావు(నాని) మండిపడ్డారు. గుడివాడలోని తన స్వగృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంత్ కిశోర్‌ను ప్రస్తుతం ఏ రాష్ట్రంలోనూ ఏరాజకీయ పార్టీ వ్యూహకర్తగా పెట్టుకోలేదన్నారు. ఐప్యాక్ నుంచి తన్ని తరిమేసిన తరువాత ఏపార్టీ అతన్ని చేరదీయక పోతే తీసేసిన తహసీల్దార్‌లాగా బిహార్‌లో ఒక సొంత పార్టీ పెట్టి పాదయాత్ర చేసి ఫలితం లేక డిజాస్టర్ అయిపోయాడన్నారు. చంద్రబాబు లాంటి పనికి మాలిన వ్యక్తుల వద్ద ప్యాకేజీ తీసుకుని జ్యోతిష్యం చెపుతున్నాడన్నారు. ఐప్యాక్ టీమ్ ఇప్పటికీ వైఎస్సార్ సీపీకి పని చేస్తోందన్నారు. లగడపాటి రాజగోపాల్‌లాగా జ్యోతిష్యం చెప్పడం ప్రారంభించిన పీకే చెపితే రెండు, మూడు శాతం ఓట్లు మారి తనకు పడతాయనేది చంద్రబాబు ఆశ అని అన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో కేసీఆర్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ గెలుస్తుందని, బీజేపీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలోకి రాదని పీకే చెప్పిన జ్యోతిష్యం ఎక్కడా పనిచేయలేదన్నారు. ఇప్పుడు ఏపీలో జగన్ గెలిచే అవకాశం లేదని అతను చెప్పినా ఎవరూ నమ్మరన్నారు. పీకే, లగడపాటి వంటివారు ఎక్కడా సర్వే చేయకుండా చెప్పే మాటలను రాష్ట్ర ప్రజలు పట్టించుకోరన్నారు. జగన్ ప్రభంజనాన్ని ఆపేశక్తి ఈ పీకే, చంద్రబాబుకు లేదన్నారు.

చట్ట సభల్లో అవినీతీ... విచారణార్హమే

▶ మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యేలకు ప్రత్యేక అధికారాలను కట్టబెడుతున్న రాజ్యాంగంలోని ఆర్టికల్ 105(2), ఆర్టికల్ 194(2) ఇలాంటి ఆరోపణలకు వర్తించబోవని స్పష్టం చేసింది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు కూడా ఈ ఆదేశాలు వర్తిస్తాయంటూ ధర్మాసనం స్పష్టత ఇవ్వడం విశేషం. ''పార్లమెంటులోనూ, శాసనమండలి, శాసనసభల్లోనూ, సంబంధిత కమిటీల్లోనూ ఏం అంశం మీదైనా సభ్యులు ఒత్తిళ్లకు అతీతంగా స్వేచ్ఛగా చర్చించగలిగే వాతావరణం నెలకొల్పడమే ఆర్టికల్ 105, 194 ఉద్దేశం. అంతే తప్ప ఓటేయడానికి, సభలో ప్రసంగించడానికి లంచం తీసుకున్నారన్న ఆరోపణలపై విచారణ నుంచి కాపాడటం కాదు. లేదంటే ఆ వాటి అసలు ఉద్దేశమే నెరవేరకుండా పోతుంది. లంచం తీసుకునే ప్రజాప్రతినిధి నేరానికి పాల్పడ్డట్టే. వారికి ఎలాంటి రక్షణా కల్పించలేం'' అంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాప్రతినిధుల అవినీతి దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య పునాదులనే పెకిలించి వేస్తుందంటూ ఈ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగ ఆకాంక్షలను, ఆదర్శాలతో పాటు ప్రజా జీవితంలో విశ్వసనీయతను కూడా దెబ్బ తీస్తుందని ఆవేదన వెలిబుచ్చింది. ''ఆర్టికల్ 105(2), 194(2) కింద సభ్యుడు కోరే రక్షణ సదరు అంశంపై సభ సమష్టి పనితీరుకు, సభ్యునిగా తాను నెరవేర్చాల్సిన విధులకు పూర్తిగా అనుగుణంగా ఉండాల్సిందే'' అంటూ రెండు కీలక నిబంధనలను తాజా తీర్పులో పొందుపరిచింది. వాటిని తృప్తి పరిచినప్పుడే సభలో వారు చేసే ప్రసంగానికి, వేసే ఓటుకు చట్టపరమైన విచారణ నుంచి రక్షణ ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ధర్మాసనం తరఫున సీజేఐ 135 పేజీల తీర్పు రాశారు. రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థికి ఓటేసేందుకు జేఎంఎం ఎమ్మెల్యే సీతా సొరెన్ లంచం తీసుకున్నారన్న కేసుపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ ఎం ఎం సుందరేశ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన రాజ్యాంగ ధర్మాస నం విచారణ జరిపి 2023 అక్టోబరులో తీర్పు రిజర్వు చేసింది. సోమవారం తీర్పు వెలువరించింది. ''ఒక ప్రజాప్రతినిధి చట్టసభలో ఓటేసేందుకు లంచం స్వీకరించిన, స్వీకరించేందుకు అంగీకరించి న క్షణంలోనే నేరానికి పాల్పడ్డట్టు లెక్క. అంతిమంగా ఓటేశారా, లేదా అన్నదానితో నిమిత్తం లేదు. లంచం స్వీకరించినప్పుడే నేరం జరిగిపోయింది'' అని స్పష్టం చేసింది. ''ఓటేయడానికి, మాట్లాడడానికి లంచం తీసుకుంటే రాజ్యాంగం కల్పించిన స్వే చ్ఛాయుత వాతావరణం సభలో కొనసాగకుండా పోతోంది. అలాంటి నేరాలకు సభ్యుడు రాజ్యాంగపరమైన మినహాయింపులు కోరజాలడు. ఆర్టికల్ 105, 194 రక్షణలు వర్తించబోవు'' అని పేర్కొంది. ''ఇలాంటి సందర్భాల్లో కూడా సభ్యుడికి విచారణ నుంచి మినహాయింపు ఇస్తున్న 1998 నాటి పీవీ నరసింహారావు కేసు తీర్పును పునఃపరిశీలించడం తప్పనిసరి. లేదంటే కోర్టు తప్పిదమే అవుతుంది'' అని అభిప్రాయపడింది.

కేసు పూర్వాపరాలివీ...

జార్ఖండ్‌లో 2012లో రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఆ సందర్భంగా ఓటేసేందుకు ఓ స్వతంత్ర అభ్యర్థి నుంచి జేఎంఎం ఎమ్మెల్యే సీతా సొరెన్ లంచం తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. కానీ తాను తమ పార్టీ అభ్యర్థికే ఓటేశానని పోలింగ్ అనంతరం ఆమె తెలిపారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించినా ఆమె సొంత పార్టీ అభ్యర్థికే ఓటేశారు. అయితే సొరెన్ తన నుంచి లంచం తీసుకున్నారంటూ సదరు స్వతంత్ర అభ్యర్థి పోలీసుల్ని ఆశ్రయించడంతో ఆమెపై ఛార్జిషీటు దాఖలు చేయడంతో పాటు క్రిమినల్ విచారణ చర్యలు చేపట్టారు. ఆర్టికల్ 194(2) కింద తనకు రక్షణ ఉంటుంది గనుక ఈ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలంటూ సీతా సొరెన్ జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ ప్రతికూల నిర్ణయం రావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2014 సెప్టెంబరులో కేసు ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందుకు వెళ్లింది. అనంతరం 2019 మార్చిలో నాటి సీజేఐ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ కేసును విచారించింది. 1998 నాటి పీవీ నరసింహారావు కేసులో ఐదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం వెలువరించిన తీర్పు ను ఈ కేసు విచారణ సందర్భంగా జార్ఖండ్ హైకోర్టు ఉటంకించినందున విచారణను విస్తృత ధర్మా సనానికి అప్పగించాలని నిర్ణయించింది. తదనంతరం సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును విచారించింది. 1998 నాటి కేసులో సీతా సొరెన్ మామ శిబు సొరెన్‌కు ఇదే తరహా కేసులో ఊరట లభించిందని ఆమె తరఫు న్యాయవాది ప్రస్తావించారు. ఆ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. ''1998 నాటి పీవీ కేసు తీర్పుతో విభేదిస్తున్నాం. ఆ తీర్పును కొట్టేస్తూ ఏడుగురు న్యాయమూర్తులం ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చాం'' అని పేర్కొంది.

ఏమిటీ పీవీ కేసు...

1993లో కేంద్రంలో పీవీ నరసింహారావు ప్రభుత్వం పార్లమెంటులో అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంది. ఆ సమయంలో శిబు సొరెన్ సహా ఐదుగురు జేఎంఎం ఎంపీలు లంచం తీసుకొని తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఆర్టికల్ 105(2), ఆర్టికల్ 194(2) కింద సదరు సభ్యులకు ప్రాసిక్యూషన్ నుంచి మినహాయింపు ఉంటుందంటూ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 3:2 మెజారిటీతో 1998లో తీర్పు వెలువరించింది. అది పరస్పర విరుద్ధ ఫలితాలకు దారితీసిందని సీజేఐ సారథ్యంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. ''లంచం తీసుకుని తదనుగుణంగా ఓటేసిన సభ్యులకు విచారణ నుంచి ఆ తీర్పు రక్షణ కల్పిస్తోంది. కానీ లంచం తీసుకుని కూడా మనస్సాక్షి మేరకు స్వతంత్రంగా ఓటేసిన సభ్యులను శిక్షిస్తోంది. తద్వారా ఈ రెండు పరిస్థితుల మధ్య కృత్రిమ భేదాన్ని సృష్టించింది. ఆ తీర్పుతో విభేదిస్తూ ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులు వెలు వరించిన మైనారిటీ తీర్పు దీన్ని ఎత్తి చూ పింది కూడా'' అని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు.


● శిక్షణలో సుమన్ కుమారి

న్యూస్‌మేకర్

స్నైపర్ గురి

800 మీటర్ల దూరం.. అంటే ముప్పావు కిలోమీటరు నుంచి కూడా గురి తప్పకుండా కాల్చే రైఫిళ్లు స్నైపర్లు. వీటిని ఉపయోగించే వారిని కూడా స్నైపర్లు అనే అంటారు. ఇంతకాలం మగవాళ్లే స్నైపర్లుగా ఉన్నారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుమన్ కుమారి అత్యంత కఠినమైన శిక్షణ పొంది మన దేశ తొలి మహిళా స్నైపర్‌గా అర్హతను పొందింది.

1984 'ఆపరేషన్ బ్లూస్టార్' తర్వాత రాజీవ్ గాంధీ హయాంలో 1988లో 'ఆపరేషన్ బ్లాక్ థండర్' పేరుతో స్వర్ణదేవాలయంలో మిగిలి ఉన్న సిక్కు వేర్పాటువాదులను ఏరివేసే మిలటరీ చర్య జరిగింది. 'ఆపరేషన్ బ్లూస్టార్' సమయంలో ఇరు వర్గాల్లోనూ ప్రాణనష్టం ఎక్కువ. కాని 'ఆపరేషన్ బ్లాక్ థండర్'లో మిలటరీ సిబ్బంది ప్రాణనష్టం జరక్కుండా సిక్కు వేర్పాటువాదులను అణిచివేయగలిగారు. దీనికి కారణం స్వర్ణ దేవాలయాన్ని మారణాయుధాలతో పై నుంచి కాపలాకాస్తున్న ఐదుగురు వేర్పాటువాదులను చాలా దూరం నుంచి కాల్చి చంపడం. మొదటిసారి 'స్నైపర్స్' ఉపయోగం వల్ల కలిగిన ప్రయోజనం అది.

స్నైపర్ అంటే శత్రునిర్మూలన

ఏదో సినిమాలో 'నన్ను చూడాలంటే నీ జీవితం సగం తగలడిపోయి ఉండాలి' అని బ్రహ్మానందం అంటాడు. స్నైపర్ రంగంలో దిగాడంటే శత్రువు జీవితం ముగింపు దశలో ఉందని అర్థం. స్నైపర్లు శత్రువును బంధించడానికి కాదు. నిర్మూలించడానికి. మనదేశంలో ముందు నుంచి కూడా అత్యాధునిక ఆయుధాల పట్ల కాకుండా సంప్రదాయ ఆయుధాల పట్ల మొగ్గు ఉండటం వల్ల స్నైపర్లను ఆదరించింది లేదు. కిలోమీటరు నుంచి ఒకటిన్నర కిలోమీటరు దూరం వరకూ కూడా శత్రువును కాల్చి చంపగల స్నైపర్ రైఫిల్స్‌ను ఎలా ఉపయోగించాలో తెలియడానికి ఆ కాలంలో మన మిటలరీ యోధులు ఇజ్రాయిల్, ఫ్రాన్స్ వెళ్లాల్సి వచ్చేది. 1980లలోనే కొద్దిగా స్నైపర్స్ ఉపయోగం తెలిసింది. ఇటీవల సరిహద్దుల వెంబడి వివిధ దేశాల దాడులను ప్రతిఘటించడానికి స్నైపర్లు సమర్థంగా ఉపయోగపడుతున్నాయని వాటిని ఉపయోగించే నిపుణులను తయారు చేస్తున్నారు. మధ్యప్రదేశ్– మహౌలోని 'ఇన్‌ఫాంట్రీ స్కూల్'లో, 'ఇండోర్‌లోని సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్' కేంద్రంలో స్నైపర్స్ శిక్షణ ఇస్తున్నారు. ఇంతవరకూ మగవాళ్లకే సాగిన ఈ శిక్షణ సుమన్ కుమారి వల్ల స్త్రీలకు కూడా ఇవ్వడం మొదలైంది.

పంజాబ్‌లో చూసి

హిమాచల్ ప్రదేశ్‌లో మండి జిల్లాకు చెందిన సుమన్ కుమారి 2021లో బి.ఎస్.ఎఫ్.లో ఇన్‌స్పెక్టర్ హోదాలో చేరింది. పంజాబ్‌లో ఆమెకు విధులు కేటాయించారు. అక్కడ ఉండగా సరిహద్దు దేశాల నుంచి శత్రువులు స్నైపర్లతో మన వారి మీద దాడులు చేయడం సుమన్ గమనించింది. మన వద్ద తగినంత మంది స్నైపర్లు లేరని కూడా అవగాహన చేసుకుంది. అంతే. తనకు తానే స్నైపర్‌గా శిక్షణ తీసుకునేందుకు అనుమతి అడిగింది. 'సాధారణంగా స్నైపర్‌గా తీసుకునే శిక్షణ కఠినమైనది. మగవారే వెనకాడుతారు. శిక్షణలో సగం మంది వెనుతిరుగుతారు. కాని సుమన్ 8 వారాల పాటు శిక్షణను సమర్థంగా పూర్తి చేసింది. 56 మంది ఉన్న బ్యాచ్‌లో ఆమె మాత్రమే మహిళ. శిక్షణ బాగా పూర్తి చేసిన వారిని 'ఆల్ఫా' అని, 'బ్రేవో' అని నైపుణ్యాన్ని బట్టి విభజిస్తాం. కాని సుమన్ ప్రతిభ అంతకు మించింది. అందుకే ఆమెకు ఇన్‌స్ట్రక్టర్ హోదా ఇచ్చాం. దాని అర్థం ఆమె స్నైపర్ మాత్రమే కాదు స్నైపర్ శిక్షకురాలు కూడా' అని ఒక మిలటరీ అధికారి తెలియచేశారు.

ఎప్పుడెప్పుడు

హైజాక్‌లు, కిడ్నాప్‌లు, టెర్రరిస్ట్ అటాక్‌లు, ముఖ్య నేతలను బందీలుగా పట్టుకోవడం, సరిహద్దులు దాటి శత్రువులు రావడం వంటి సందర్భాలలో స్నైపర్లు రంగంలో దిగుతారు. పరిసరాలకు తగినట్టుగా పై తొడుగులు (కామూఫ్లాజ్) ధరించి శత్రువుకు వీలైనంత దగ్గరగా వెళ్లి తూటాతో సమాధానం చెప్పడమే వీరు చేసేపని. సుమన్ సేవలు ఇకపై దేశానికి రక్షణ ఇస్తాయి. 'నేను స్నైపర్ కావడం స్త్రీలకు స్ఫూర్తినిస్తుందనే అనుకుంటున్నాను. మిలటరీలోకి మరింతమంది మహిళలు రావాలని కోరుకుంటున్నాను' అందామె.

బ్యూటిప్స్



కేశ సౌందర్యం

అరకప్పు కొబ్బరి నూనెలో నాలుగు టీస్పూన్ల గుంటగలగర పొడి వేసి మీడియం మంట మీద వేడిచేయాలి. నూనె వేడెక్కిన తరువాత దించేసి కురులు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి, అరగంట తరువాత షాంపుతో కడిగేయాలి. వారానికి మూడుసార్లు ఇలా చేస్తే... ప్రొటీన్‌లు కుదుళ్లకు అంది తెల్ల జుట్టు నల్ల బడటంతోపాటు జుట్టు రాలడం కూడా తగ్గుతుంది.



ముఖం మిలమిలా

పచ్చిపాలు, రోజ్‌వాటర్‌ను సమపాళ్లలో తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కాటన్ బాల్‌తో ముఖానికి రాసుకోవాలి. ఉదయాన్నే గోరు వెచ్చని నీటితో కడిగేస్తే ముఖం కాంతిమంతమవుతుంది.

సేవాపథం

దానానికి దగ్గరి దారి

● షేర్ ఎట్ డోర్ స్టెప్



దానాలు, విరాళాల ప్రక్రియను సులభతరం చేయడానికి 'షేర్ ఎట్ డోర్ స్టెప్' అనే సోషల్ వెంచర్‌కు శ్రీకారం చుట్టింది దిల్లీకి చెందిన అనుష్క జైన్. దాతల ఇంటికి వెళ్లి వారు ఇచ్చే దుస్తులు, పుస్తకాలు... మొదలైన వాటిని తీసుకొని ఎన్జీవోలకు పంపిణీ చేస్తుంది షేర్ ఎట్ డోర్ స్టెప్. ఏఐ టెక్నాలజీ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలతో కనెక్ట్ అవుతోంది....

'ప్రతిరోజు పిల్లల బట్టలు, యూనిఫాంను చేతితో ఉతికేదాన్ని. షేర్ ఎట్ డోర్ స్టెప్ ద్వారా వాషింగ్ మెషిన్ అందిన తరువాత నాకు చాలా శ్రమ తప్పింది. ఎంతో టైమ్ మిగులుతోంది. ఈ టైమ్‌లో పిల్లలకు కథలు చెబుతున్నాను' అంటోంది బెంగళూరుకు చెందిన ఒక బామ్మ. బెంగుళూరు నుంచి జైపూర్ వరకు 'షేర్ ఎట్ డోర్ స్టెప్'ను ఎంతోమంది ప్రశంసిస్తున్నారు.

దిల్లీకి చెందిన కంప్యూటర్ సైన్స్ ఇంజనీర్ అయిన అనుష్కకు 'షేరింగ్' కాన్సెప్ట్ కొత్త కాదు. గతంలోకి వెళితే...

తన ప్రతి పుట్టినరోజుకి 'ఇవి కావాలి అవి కావాలి' అని కాకుండా 'ఈరోజు ఏ ఎన్జీవోకు వెళదాం' అని తల్లిని అడిగేది. నగరంలో ఉన్న ఏదో ఒక ఎన్జీవోకు వెళ్లి అక్కడ ఉన్నవారికి స్వీట్లు పంచేది. అలా 'షేరింగ్' అనే కాన్సెప్ట్ తనతో పాటు పెరిగి పెద్దదైంది.

దాతృత్వానికి సంబంధించి కాలేజీ రోజుల్లో తనకు స్పష్టత వచ్చింది.

చాలామందికి దానం చేయాలనే కోరిక ఉన్నా, సమయం లేకపోవడం వల్ల దూరభారం వల్ల చేయలేకపోతున్నారు.

'డొనేషన్ ఏ స్వచ్ఛంద సంస్థకు ఇస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది;' అనే విషయంలో చాలామందికి అవగాహన ఉండదు' అంటున్న అనుష్క ఈ సమస్యకు ఒక పరిష్కారం వెదకాలనుకుంది. తన డ్రీమ్ కంపెనీలో ఉద్యోగంలో చేరిన అనుష్క నైట్‌షిఫ్ట్‌లో డ్యూటీ చేసేది. పగటిపూట సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టేది.

ఉద్యోగంలో చేరినా ఎన్జీవోలకు డొనేట్ చేయాలనే ఆలోచన అనుష్కను వదలలేదు. దీంతో ఒక వెబ్‌సైట్ రూపొందించి డొనేట్ చేయాలనుకుంటున్నవారు తమ ఐటమ్స్‌ను రిజిస్టర్ చేసుకోవాలని కోరింది. రిజిస్టర్ కాగానే పొద్దున్నే వెళ్లి వాటిని కలెక్ట్ చేసుకొని వచ్చేది. పికప్స్ రెండు వందలు దాటిన తరువాత 'ఇంకా ఏదైనా చేయాలి' అనే ఆలోచనతో బెంగళూరులోకి అడుగుపెట్టింది అనుష్క. అక్కడ మరో కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్‌గా ఉద్యోగంలో చేరింది. 2018లో 'షేర్ ఎట్ డోర్ స్టెప్'కు పూర్తి సమయాన్ని కేటాయించింది.

ఎంతో శక్తి ఇస్తుంది

దానం చేయడానికి అవసరమైన స్ఫూర్తి ఒక్కో దేశంలో ఒక్కోరకంగా ఉండవచ్చు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలనే ఉన్నత ఆలోచన మాత్రం దేశాల సరిహద్దులను చెరిపేసి అందరినీ ఒకటి చేస్తుంది. ఇతరులకు సహాయం చేయడం అనే పని మనకు ఎంతో శక్తి ఇస్తుంది.
- అనుష్క జైన్

'ఇంకా ఏదైనా చేయాలి' అనే ఆలోచనతో బెంగళూరులోకి అడుగుపెట్టింది అనుష్క. 2018లో 'షేర్ ఎట్ డోర్ స్టెప్'కు పూర్తి సమయాన్ని కేటాయించింది. 'మా వెబ్‌సైట్‌లోకి వచ్చి పికప్ బుక్ చేయండి. మీరు విరాళంగా ఇవ్వాలనుకుంటున్న వస్తువు, అది తేలికైనదా, బరువైనదా అనేది తెలియజేయండి. మా ఏజెంట్లు నిర్ణీత సమయంలో మీ ఇంటి ముందు ఉంటారు. మీ విరాళాన్ని మాకు అనుబంధంగా ఉన్న ఎన్జీవోలలో ఒకదానికి పంపిస్తాం' అంటూ అనుష్క చేసిన ప్రకటనకు అద్భుత స్పందన వచ్చింది.

ఏ వస్తువులు ఏ ఎన్జీవోకు వెళ్లాలి... అనే విషయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాంకేతికత సహాయం తీసుకుంటుంది అనుష్క.

'షేర్ ఎట్ డోర్ స్టెప్' ద్వారా కంపెనీలకు మార్కెటింగ్ సొల్యూషన్స్‌ను అందించడంతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)కు సంబంధించిన కార్యక్రమాలకు సహకారం అందిస్తోంది. ఇండివిడ్యువల్స్‌తో పాటు కార్పొరేట్ డోనర్స్ కోసం డోర్‌స్టెప్ డొనేషన్ సర్వీసును అందుబాటులోకి తీసుకువచ్చింది. 'షేర్ ఎట్ డోర్ స్టెప్' దేశీయంగా తిరుగులేని విజయం సాధించిన తరువాత ఈ కాన్సెప్ట్‌ను విదేశాలలో ప్రచారం చేయాలని ఆలోచన చేసింది. తొలి అడుగుగా సింగపూర్‌లో ప్రచారం చేసింది. అక్కడ లభించిన స్పందన అమితమైన ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని ఇవ్వడంతో మరింత వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది అనుష్క.


● డొనేషన్ అందుకున్న బాలల మోముల్లో నవ్వులు పూయిస్తూ...

సాగుబడి
పూర్వాభాద్ర కార్తె: మార్చి 4 నుంచి

- విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఆవరణలో ప్రకృతి సేద్యం
- రైతు ఉత్పత్తిదారుల సంస్థతో కలిసి ఇంటిపంటల సాగుకు శ్రీకారం
- వాలంటీర్లు, విద్యార్థులకు ప్రకృతి సేద్య పనులు చేస్తూ నేర్చుకునే అవకాశం

ఆంధ్రా వర్సిటీలో ఆర్గానిక్ పంటలు!

నగరవాసులకు ఆరోగ్యదాయకమైన సేంద్రియ ఇంటిపంటలను, ప్రకృతి వ్యవసాయ పాఠాలు నేర్పించడానికి విశాఖ నగరంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. రైతు ఉత్పత్తిదారుల సంస్థతో కలిసి యూనివర్సిటీ ఆవరణలో అర్బన్ గార్డెనింగ్ హబ్‌ను ఏర్పాటు చేసింది. అనేక రకాల ఆకుకూరలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నగరంలోనే పండించి తాజాగా నగరవాసులకు అందిస్తోంది. నగరంలో పుట్టి పెరిగే విద్యార్థులకు మట్టి వాసనను పరిచయం చేయటం.. సేంద్రియ ఇంటిపంటల సాగు పనులను చేస్తూ నేర్చుకునే వినూత్న అవకాశాన్ని నగరవాసులకు కల్పించటం ప్రశంసనీయం. ఈ సామాజిక కార్యక్రమంలో కీలకపాత్ర పోషిస్తున్న 'ఏయు- అవని ఆర్గానిక్స్ అర్బన్ గార్డెనింగ్ హబ్' నిర్వాహకులు ఉషా రాజు, హిమబిందు కృషిపై అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా ప్రత్యేక కథనం.











పదిహేనేళ్లుగా సేంద్రియ టెర్రస్ కిచెన్ గార్డెనింగ్, ప్రకృతి వ్యవసాయంలో అనుభవం ఉన్న పౌష్టికాహార నిపుణురాలు ఉషా రాజు, హిమబిందు ఆంధ్రా యూనివర్సిటీతో కలసి సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. మన మన్యం రైతు ఉత్పత్తిదారుల సంస్థ నిర్వాహకులు కూడా అయిన వీరు విశాఖపట్నం నగరం మధ్యలోని ఆంధ్రా యూనివర్సిటీ ఆవరణలోనే ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ప్రజలకు ప్రకృతితో కలసి జీవించడం నేర్పుతున్నారు. వాలంటీర్లు పాల్గొనేందుకు అవకాశం ఇస్తూ అర్బన్ కమ్యూనిటీ ఫార్మింగ్‌ని ఆచరించి చూపుతున్నారు. నగర వాసులు తమ ఇంటిపైన కూడా ఆరోగ్యదాయకమైన సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారు.

గత ఏడాది నవంబర్‌లో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని కలిసి వర్సిటీలో అర్బన్ గార్డెనింగ్ హబ్‌కు అనువైన స్థలం కేటాయించాలని ఉషా రాజు, హిమబిందు కోరారు. ప్రజలకు ఆరోగ్యదాయకమైన ఆకు కూరలు అందుబాటులోకి రావటంతో పాటు ప్రకృతి సేద్యంపై అవగాహన కలుగుతుందన్న ఆశయంతో ఆయన అందుకు అంగీకరించారు. వృక్షశాస్త్రం, ఫుట్ టెక్నాలజీ, ఫార్మసీ విద్యార్థులను ఈ అర్బన్ సాగులో భాగస్వాముల్ని చేయాలని వీసీ సూచించారు.

ఆకుకూరలను నగరంలోనే పండిస్తున్నాం..!



మా 'మన మన్యం ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో 4 జిల్లాలకు చెందిన 120 మంది రైతులు సభ్యులు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన బియ్యం, పప్పులు తదితర ఉత్పత్తులను 'అవని ఆర్గానిక్స్' పేరుతో విశాఖ నగరంలోని 4 రైతు బజార్లలోని మాకు కేటాయించిన స్టోర్ల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం. అయితే, ఆకుకూరలను నగరానికి దూరంగా పొలాల్లో పండించి ఇక్కడికి తెచ్చి వినియోగదారులకు అందించేటప్పటికి కనీసం 25% పోషకాలు నష్టం జరుగుతోంది. ఈ సమస్యను అధిగమించడానికి తాజా ఆకుకూరలను నగరంలోనే ప్రకృతి వ్యవసాయంలో పండించి వినియోగదారులకు అందించాలని తలచాం. మా ఆలోచనను ప్రోత్సహించిన ఆంధ్రా యూనివర్సిటీ సహకారంతో 80 సెంట్ల ఖాళీ స్థలంలో అనేక రకాల సాధారణ ఆకుకూరలతో పాటు కలే, లెట్యూస్, బాక్‌చాయ్ వంటి విదేశీ ఆకుకూరలను, కనుమరుగైన కొన్ని రకాల పాతకాలపు ఆకుకూరలను సైతం పండించి, ప్రజలకు తాజాగా విక్రయిస్తున్నాం. స్థలంతోపాటు నీటిని యూనివర్సిటీ ఇచ్చింది. వైర్ ఫెన్సింగ్, డ్రిప్‌లు, సిబ్బంది జీతాలను మా ఎఫ్.పి.ఓ. సమకూర్చుతోంది. నగరంలో పుట్టి పెరిగే పాఠశాల విద్యార్థులకు, నగరవాసులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఇంటిపంటల సాగును నేర్పించాలన్నది మా లక్ష్యం. వాలంటీర్లు ఎవరైనా ప్రతి రోజూ ఉదయం 7–9 గంటల మధ్యలో నగరం మధ్యలో ఉన్న ఆంధ్రా యూనివర్సిటీకి వచ్చి గార్డెనింగ్ పనులను చేస్తూ నేర్చుకోవచ్చు. నచ్చిన ఆకుకూరలు తామే కోసుకొని కొనుక్కెళ్ల వచ్చు. స్కూలు విద్యార్థులకు ఇంటిపంటలు, ప్రకృతి వ్యవసాయ పనులను పరిచయం చేయడానికి ఇదొక మంచి అవకాశమని మేం భావిస్తున్నాం. యూనవర్సిటీలో ఈ పంటలను 2 ఎకరాలకు విస్తరించే ఆలోచన ఉంది.

– ఉషా రాజు, ఏయు–అవని ఆర్గానిక్స్ అర్బన్ గార్డెనింగ్ హబ్, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం

80 సెంట్లలో బహుళ పంటల సాగు

ఆ విధంగా 2023 నవంబర్ చివరి నాటికి ఏయూ ఫార్మ్ టెస్టింగ్ లాబరేటరీ (ఎలిమెంట్) ఎదురుగా ఉన్న సుమారు 80 సెంట్ల ఖాళీ స్థలంలో ఏర్పాటైన అర్బన్ గార్డెనింగ్ హబ్‌లో ప్రకృతి సేద్యం ప్రారంభమైంది. కలుపు మొక్కలను తొలగించి నేలను సాగుకు అనుకూలంగా మార్చటానికి దాదాపు మూడు వారాల సమయం పట్టింది. తొలుత ఆకుకూరల సాగును ప్రారంభించారు. పాలకూర, తోటకూర, మెంతికూర, చుక్కకూర, బచ్చలి, గోంగూర, పొన్నగంటి, గలిజేరు, ఎర్రతోటకూర, పుదీనా వంటి పది రకాల ఆకుకూరలను చిన్నమడులుగా చేసుకొని సాగు చేస్తున్నారు.



సలాడ్‌లలో వినియోగించే అరుదైన బాక్ చాయ్ వంటి మొక్కలతో పాటు గోధుమ గడ్డి, ఆవ ఆకులు, చేమదుంపలు, కేరట్, బీట్‌రూట్, చిలగడదుంప వంటి దుంప పంటలనూ ఇక్కడ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం చిత్రాడ బీర, వంగ, బొప్పాయి కాత దశకు వస్తున్నాయి. త్వరలో దొండ పాదులు సైతం నాటబోతున్నారు. ప్రతీ మూడు నెలలకు నాలుగైదు రకాల కూరగాయలు పెంచే విధంగా వీరు ప్రణాళిక చేసుకుని పనిచేస్తున్నారు.

ఆకర్షితులవుతున్న ప్రజలు

పశువుల పేడ తదితరాలతో తయారు చేసిన ద్రవ జీవామృతం, ఘనజీవామృతంతో ఇక్కడ పూర్తి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండిస్తున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్‌లు ఏర్పాటు చేసుకుని పొదుపుగా నీటిని వాడుతున్నారు. అనేక రకాల పంటలను కలిపి పండించటం వల్ల ఆకుకూరలు, కూరగాయ మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. పెద్దగా పురుగు పట్టడం లేదు. తమ కళ్ల ముందే ఆరోగ్యదాయకంగా సాగవుతున్న పంటలు వర్సిటీ ఆవరణలో నిత్యం వాకింగ్‌కు వచ్చే వందలాది మందిని ఆకర్షిస్తున్నాయి. కొద్దిసేపు ఈ ప్రాంగణంలో గడుపుతూ.. ఆకుకూరలు, కూరగాయలను ఎలా పెంచుతున్నారో అడిగి తెలుసుకుంటూ.. కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

కమ్యూనిటీ ఫార్మింగ్

ప్రతీ ఆదివారం కమ్యూనిటీ ఫార్మింగ్‌ని ప్రోత్సహిస్తున్నారు. నగరవాసులు స్వచ్ఛందంగా ఇక్కడకు వచ్చి కొద్దిసేపు వ్యవసాయం నేర్చుకోవడం కోసం భాగస్వాములయ్యేందుకు అవకాశం కల్పించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారు ఇక్కడకు వచ్చి కాసేపు పంట మొక్కల మధ్య సరదాగా గడుపుతున్నారు. దీనితో వారికి ఒత్తిడి నుంచి ఉపశమనం, మానసిక ప్రశాంతత లభిస్తోందని చెబుతున్నారు.

వలంటీర్లకు అవకాశం..

అర్బన్ కిచెన్ గార్డెనింగ్, ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న నగరవాసులకు ఇక్కడ వలంటీర్లుగా పని చేసే అవకాశం కల్పిస్తున్నారు. వీలైనంత ఎక్కువ మందికి ప్రకృతి వ్యవసాయం అలవాటు చేయడం, ప్రతీ ఇంటిలో టెర్రస్ గార్డెన్‌లు అభివృద్ధి చేసుకునే విధంగా ప్రోత్సహించడం లక్ష్యంగా పని చేస్తున్నామని నిర్వాహకులు ఉమా రాజు, హిమ బిందు చెబుతున్నారు.

ప్రస్తుతం ఏయూలో చదువుకుంటున్న కొంత మంది విద్యార్థులు ఇక్కడ పనిచేస్తున్నారు. మొక్కలపై తమకున్న ఆసక్తితో స్వచ్ఛందంగా ఉదయపు వేళల్లో రెండు గంటల సమయం వెచ్చిస్తున్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి అవని ఆర్గానిక్స్ ప్రత్యేకంగా స్టైఫండ్‌ను అందిస్తోంది. కూరగాయల మొక్కలు, ఇండోర్ ప్లాంట్స్‌ను విశాఖ వాసులకు అందుబాటులో ఉంచే విధంగా నర్సరీని ప్రారంభించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రకృతి వ్యవసాయం, ప్రజల ఆరోగ్యంపై ఏయూ ఉన్నతాధికారులతో పాటు అవని ఆర్గానిక్స్ నిర్వాహకులకు శ్రద్ధ ఉండటం, సామాజిక బాధ్యతగా అర్బన్ గార్డెనింగ్ హబ్‌ను ప్రారంభించటం ఆదర్శప్రాయం మాత్రమే కాదు, ఇతరులకు అనుసరణీయం కూడా!

– వేదుల నరసింహం, సాక్షి, విశాఖపట్నం
ఫోటోలు: పి.ఎల్.మోహన్ రావు, సాక్షి, విశాఖపట్నం

తిరుపతిలో 9 నుంచి ఆర్గానిక్ మేళా

తిరుపతి గవర్నమెంట్ యూత్ హాస్టల్ గ్రౌండ్స్ (పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ వెనుక)లో మార్చి 9,10,11 తేదీల్లో ఉ.6.30– రాత్రి 8 గం. వరకు 'కనెక్ట్ 2ఫార్మర్' సంస్థ ఆధ్వర్యంలో ఆర్గానిక్ మేళా జరగనుంది. రైతులు తమ సేంద్రియ/ప్రకృతి వ్యవసాయోత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు సహకరించటం.. దిగువ, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్గానిక్ ఆహారోత్పత్తులను అందుబాటులోకి తేవటం తమ ముఖ్య ఉద్దేశమని కనెక్ట్ 2ఫార్మర్ ప్రతినిధి శిల్ప తెలిపారు. ప్రతి నెలా రెండో శని,ఆదివారాల్లో తిరుపతిలో ఆర్గానిక్ మేళా నిర్వహిస్తున్నామని, ఈ నెల ప్రత్యేకంగా 3 రోజుల మేళా నిర్వహిస్తున్నామన్నారు.

9న మొక్కల గ్రాఫ్టింగ్, 5 అంచెల పంట విధానంపై శిక్షణ ఇస్తారు. ఆసక్తి గల రైతులు, ఇంటిపంటల సాగుదారులు 63036 06326 నెంబర్‌కు వివరాలు వాట్సాప్ చేసి రిజిస్టర్ చేసుకోవచ్చు. 11న గృహిణులకు సిరిధాన్యాల వంటల పోటీ ఉంది. 830 91 45655 నెంబర్‌కు వివరాలు వాట్సాప్ చేసి రిజిస్టర్ చేసుకోవచ్చు. ఆంధ్ర, తెలంగాణ నుండి 12 చేనేత సంఘాలు చేనేత వస్త్రాలను అందుబాటులోకి తెస్తున్నారు. పిల్లల కోసం భారతీయ సాంప్రదాయ యుద్ధ కళ అయిన కలరీ, వంటింటి వ్యర్థాలతో కంపోస్ట్, పెన్ కలంకారీ పై వర్క్‌షాప్‌లు జరుగనున్నాయి. ఇతర వివరాలకు.. 91330 77050.

7న మిద్దెతోట రైతులకు పురస్కారాలు

ఈ నెల 7న ఉ. 11 గం.కు హైదరాబాద్ రెడ్‌హిల్స్‌లోని ఫ్యాప్సీ భవన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పట్టణ ప్రాంతాల్లో మిద్దెతోటలు, ఇంటిపంటలు సాగు చేసుకునే 24 మంది అర్బన్ రైతులకు 'తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతునేస్తం మిద్దెతోట పురస్కారాల' ప్రదానోత్సవం జరగనుందని రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వై. వెంకటేశ్వరరావు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ సమాచార కమిషనర్ ఎం. హనుమంతరావు, మిద్దెతోటల నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి అతిథులుగా పాల్గొంటారు. అందరూ ఆహ్వానితులే.



జాస్మిన్ కూడా తొలి రౌండ్‌లోనే...

పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లకు నిరాశాజనక ఫలితాలు ఎదురవుతున్నాయి. మహిళల 60 కేజీల విభాగంలో భారత బాక్సర్ జాస్మిన్ లంబోరియా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో జాస్మిన్ 0–5తో అయాక తగుచి (జపాన్) చేతిలో ఓడిపోయింది. పురుషుల విభాగంలో దీపక్ (51 కేజీలు), నరేందర్ (ప్లస్ 92 కేజీలు) కూడా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో మరో ఆరుగురు భారత బాక్సర్ల బౌట్‌లు జరగాల్సి ఉన్నాయి.

భారత చెస్ నంబర్‌వన్‌గా అర్జున్!

షెన్‌జెన్ మాస్టర్స్ క్లాసిక్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఖాతాలో మూడో విజయం చేరింది. మా కున్ (చైనా)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో అర్జున్ 70 ఎత్తుల్లో నెగ్గాడు. ప్రస్తుతం మరో ఇద్దరితో కలిసి అర్జున్ ఉమ్మడిగా 'టాప్'లో ఉన్నాడు. ఈ విజయంతో క్లాసికల్ చెస్ లైవ్ రేటింగ్స్ లో అర్జున్ 2754.6 పాయింట్లతో భారత నంబర్‌వన్‌గా అవతరించాడు. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ 2751 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు.



సన్‌రైజర్స్ హైదరాబాద్ కొత్త కెప్టెన్‌గా కమిన్స్



హైదరాబాద్: ఐపీఎల్ 17వ సీజన్‌లో ప్యాట్ కమిన్స్ నాయకత్వంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు బరిలోకి దిగనుంది. హైదరాబాద్ ఫ్రాంచైజీకి గత మూడేళ్లలో మారిన నాలుగో కెప్టెన్ కమిన్స్! ఈ మూడేళ్లలో మార్క్‌రమ్ (దక్షిణాఫ్రికా), కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్), డేవిడ్ వార్నర్ (ఆస్ట్రేలియా)లు సన్‌రైజర్స్‌ను నడిపించారు. 30 ఏళ్ల స్పీడ్‌స్టర్ కమిన్స్ నాయకత్వంలో ఆస్ట్రేలియా 2023 వన్డే ప్రపంచకప్, 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ టైటిల్స్‌ను సాధించింది. 2021 టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టులోనూ కమిన్స్ సభ్యుడిగా ఉన్నాడు. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన వేలంలో కమిన్స్‌పై సన్‌రైజర్స్ రూ. 20 కోట్ల 50 లక్షలు వెచ్చించి జట్టులోకి తీసుకుంది. తాజాగా మార్క్‌రమ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించి కమిన్స్‌కు సన్‌రైజర్స్ పగ్గాలు అప్పగించింది. గతంలో కమిన్స్ కోల్‌కతా నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు కానీ... కెప్టెన్‌గా మొదటిసారి ఐపీఎల్‌లో జట్టును నడిపించబోతున్నాడు. గత సీజన్‌లో మార్క్‌రమ్ కెప్టెన్సీలో సన్‌రైజర్స్ 14 మ్యాచ్‌లు ఆడి నాలుగే మ్యాచ్‌ల్లో గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది.

సూపర్ స్మృతి...

- బెంగళూరు కెప్టెన్ మెరుపు ఇన్నింగ్స్
- రాణించిన ఎలీస్ పెరీ
- ఆర్‌సీబీకి మూడో విజయం
- 23 పరుగులతో ఓడిన వారియర్స్

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో తొలి అంచెపోటీలను రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు విజయంతో ముగించింది. ఓపెనర్, కెప్టెన్ స్మృతి మంధాన (50 బంతుల్లో 80; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), టాపార్డర్ బ్యాటర్ ఎలీస్ పెరీ (37 బంతుల్లో 58; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగడంతో బెంగళూరు 23 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌పై గెలుపొందింది. ఈ లీగ్‌లో ఆర్‌సీబీకిది మూడో విజయం. మొదట బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. ఆంధ్ర అమ్మాయి సబ్బినేని మేఘన (21 బంతుల్లో 28; 5 ఫోర్లు)తో ఓపెనింగ్ వికెట్‌కు చకచకా 51 పరుగులు జతచేసిన స్మృతి ఆ తర్వాత పెరీ అండతో దూకుడు పెంచింది. ఇద్దరు ధనాధన్ ఆటతీరు కనబరచడంతో యూపీ బౌలర్లకు కష్టాలు తప్పలేదు. రెండో వికెట్‌కు 10.4 ఓవర్లలో 95 పరుగులు జతచేశారు. మంధాన 34 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. 146 పరుగుల వద్ద స్మృతి నిష్క్రమించగా, 33 బంతుల్లో అర్ధశతకం సాధించిన పెరీ ఆఖరి ఓవర్లో అవుటైంది. రిచా ఘోష్ (10 బంతుల్లో 21 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరిపించింది. ఆంధ్ర అమ్మాయి అంజలి శర్వాణి, దీప్తి శర్మ, సోఫీ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన యూపీ వారియర్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 175 పరుగులు చేయగలిగింది. కెప్టెన్, ఓపెనర్ అలీసా హీలీ (38 బంతుల్లో 55; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) పవర్‌ప్లేలో దంచేసింది. మరో ఓపెనర్ కిరణ్ నవ్‌గిరే (18) సహా చమరి ఆటపట్టు (8), గ్రేస్ హారిస్ (5), శ్వేత సెహ్రావత్ (1) స్వల్ప వ్యవధిలో నిష్క్రమించడంతో యూపీ లక్ష్యానికి దూరమైంది. దీప్తి శర్మ (22 బంతుల్లో 33; 4 ఫోర్లు, 1 సిక్స్), పూనమ్ (24 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్) కాసేపు పోరాడారు. నేటి నుంచి ఢిల్లీ వేదికపై రెండో అంచె పోటీలు జరుగుతాయి. మంగళవారం జరిగే పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌తో ముంబై ఇండియన్స్ తలపడుతుంది.



స్మృతి మంధాన



ఎలీస్ పెరీ

చరిత్ర సృష్టించిన భారత టీటీ జట్లు

తొలిసారి ఒలింపిక్స్‌కు అర్హత

న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్లు కొత్త చరిత్ర సృష్టించాయి. ఎవరూ ఊహించని విధంగా టీమ్ విభాగంలో తొలిసారి భారత మహిళల, పురుషుల జట్లు ఒలింపిక్స్‌కు అర్హత పొందాయి. గతంలో పురుషుల, మహిళల సింగిల్స్ విభాగాల్లో భారత క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పోటీపడ్డా... టీమ్ విభాగంలో మాత్రం తొలిసారి భారత బృందాలు ఒలింపిక్స్ బెర్త్‌లు దక్కించుకున్నాయి. అత్యున్నత వేదికపై రాణిస్తే తగిన ఫలితం ఉంటుందని భారత పురుషుల, మహిళల టీటీ జట్లు నిరూపించాయి. ఇటీవల దక్షిణ కొరియాలో జరిగిన ప్రపంచ టీమ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ, మనిక బత్రా, ఐహిక ముఖర్జీ, దియా, అర్చన కామత్‌లతో కూడిన భారత మహిళల జట్టు... ఆచంట శరత్ కమల్, సత్యన్ జ్ఞానశేఖరన్, మానవ్ ఠక్కర్, హర్మీత్ దేశాయ్, మనుష్ షాలతో కూడిన భారత పురుషుల జట్టు ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. దాంతో తాజా ర్యాంకింగ్స్‌లో భారత జట్లు తమ ర్యాంక్‌ను మెరుగుపర్చుకున్నాయి. ప్రపంచ టీమ్ చాంపియన్‌షిప్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో క్వార్టర్ ఫైనల్ చేరిన ఎనిమిది జట్లు నేరుగా ఒలింపిక్స్ బెర్త్‌లు సంపాదించగా... అర్హత పొందని జట్లు సోమవారం విడుదల చేసిన అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య టీమ్ ర్యాంకింగ్స్ ఆధారంగా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. మహిళల విభాగంలో 13వ ర్యాంక్‌లో నిలవడంద్వారా... పురుషుల విభాగంలో 15వ ర్యాంక్‌లో నిలవడం ద్వారా భారత జట్లు పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడే అవకాశాన్ని దక్కించుకున్నాయి. టీమ్ ఈవెంట్‌లో అర్హత పొందడంతో భారత జట్ల నుంచి సింగిల్స్ విభాగాల్లో ఇద్దరేసి ఆటగాళ్లు పోటీపడే అవకాశం లభించనుంది. పారిస్ ఒలింపిక్స్ ఈ ఏడాది జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతాయి.



ఫైనల్లో ముంబై



ముంబై: రంజీ ట్రోఫీలో తమ ఆధిపత్యాన్ని చాటుకుంటూ 41 సార్లు చాంపియన్ ముంబై జట్టు 47వ సారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. తమిళనాడుతో జరిగిన తొలి సెమీఫైనల్లో ముంబై ఇన్నింగ్స్ 70 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 353/9తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై 106.5 ఓవర్లలో 378 పరుగులకు ఆలౌటైంది. తమిళనాడు బౌలర్లలో కెప్టెన్ సాయికిశోర్ 6 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 232 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తమిళనాడు షమ్స్ ములానీ (4/53), శార్దుల్ ఠాకూర్ (2/16), మోహిత్ (2/26), తనుష్ (2/18) ధాటికి 162 పరుగులకే కుప్పకూలి ఓడిపోయింది. శార్దుల్ ఠాకూర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. మరోవైపు నాగ్‌పూర్‌లో మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రెండో సెమీఫైనల్లో విదర్భ ఆధిక్యం 261 పరుగులకు చేరుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 13/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 6 వికెట్లకు 343 పరుగులు చేసింది.

ఐపీఎల్‌కు కాన్వే దూరం!



వెలింగ్టన్: ఐపీఎల్ టి20 టోర్నీ డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు పెద్ద దెబ్బ. ఆ జట్టు కీలక బ్యాటర్, న్యూజిలాండ్‌కు చెందిన డెవాన్ కాన్వే ఐపీఎల్ టోర్నీకి దూరం కానున్నాడు. ఇటీవల కాన్వే ఎడమ బొటన వేలికి గాయంకాగా, ఈ వారంలో అతనికి శస్త్ర చికిత్స జరగనుంది. కాన్వే కోలుకోవడానికి కనీసం ఎనిమిది వారాల సమయం పడుతుందని సమాచారం. మార్చి 22 నుంచి ఐపీఎల్ 17వ సీజన్ మొదలుకానుంది. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో 23 మ్యాచ్‌లు ఆడిన కాన్వే 9 అర్ధ సెంచరీలతో కలిపి 141.28 స్ట్రయిక్‌రేట్‌తో 924 పరుగులు సాధించాడు.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు నిరాశ

సాక్షి, హైదరాబాద్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో భాగంగా రియల్ కశ్మీర్ ఎఫ్‌సీ జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు 2–3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. శ్రీనిధి జట్టు తరఫున రిల్వాన్ హసన్ (58వ ని.లో), ఎలీ సాబియా (61వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. రియల్ కశ్మీర్ జట్టుకు క్రిజో (45+4వ ని.లో; 90+2వ ని.లో) రెండు గోల్స్ అందించగా... తారిఖ్ మీర్ (87వ ని.లో) ఒక గోల్ సాధించాడు. ప్రస్తుతం రియల్ కశ్మీర్, శ్రీనిధి జట్లు 33 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి.



ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతకంతో సాయిప్రణీత్

సాయిప్రణీత్ రిటైర్మెంట్

అమెరికాలో ప్రైవేట్ అకాడమీకి హెడ్ కోచ్‌గా వెళ్లనున్న భారత స్టార్ షట్లర్

సాక్షి, హైదరాబాద్: భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి క్రీడాకారుల్లో ఒకడైన భమిడిపాటి సాయిప్రణీత్ ఆట నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. త్వరలో హెడ్ కోచ్‌గా రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నాడు. వచ్చే నెలలో అమెరికాలోని నార్త్ కరోలినాలో ఉన్న ట్రయాంగిల్ బ్యాడ్మింటన్ అకాడమీ హెడ్ కోచ్‌గా 31 ఏళ్ల సాయిప్రణీత్ బాధ్యతలు తీసుకోనున్నాడు. 2008 నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సాయిప్రణీత్ చివరిసారి గత ఏడాది డిసెంబర్‌లో గువాహటి మాస్టర్స్ టోర్నీలో పోటీపడి రెండో రౌండ్‌లో ఓడిపోయాడు. పుల్లెల గోపీచంద్ వద్ద శిక్షణ తీసుకున్న సాయిప్రణీత్ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి లీగ్ దశలో నిష్క్రమించాడు. 2019లో కేంద్ర ప్రభుత్వం నుంచి సాయిప్రణీత్ 'అర్జున అవార్డు' అందుకున్నాడు.

- కెరీర్ మొత్తంలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో కలిపి సాయిప్రణీత్ 417 మ్యాచ్‌లు ఆడాడు. 243 మ్యాచ్‌ల్లో నెగ్గి, 174 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు.
- 2020లో కెరీర్ బెస్ట్ 10వ ర్యాంక్‌ను అందుకున్న సాయిప్రణీత్ ప్రస్తుతం 106వ ర్యాంక్‌లో ఉన్నాడు.
- 2019లో స్విట్జర్లాండ్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గడం సాయిప్రణీత్ కెరీర్‌లో హైలైట్. 2017లో సింగపూర్ ఓపెన్ సూపర్ సిరీస్ టైటిల్ కూడా సాధించాడు. 2016లో కెనడా గ్రాండ్‌ప్రి, 2017లో థాయ్‌లాండ్ గ్రాండ్‌ప్రి టోర్నీల్లోనూ విజేతగా నిలిచాడు.
- 2016, 2020లలో జరిగిన ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు నెగ్గిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.
- 2010లో మెక్సికోలో జరిగిన ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో, 2008లో కామన్వెల్త్ యూత్ గేమ్స్‌లో సాయిప్రణీత్ కాంస్య పతకాలు గెలిచాడు.
- బ్యాడ్మింటన్‌లో మేటి క్రీడాకారులైన లిన్ డాన్, చెన్ లాంగ్ (చైనా), లీ చోంగ్ వె (మలేసియా), తౌఫిక్ హిదాయత్ (ఇండోనేసియా), కెంటో మొమోటా (జపాన్), టామీ సుగియార్తో (ఇండోనేసియా), ఆంథోని జిన్‌టింగ్ (ఇండోనేసియా)లపై సాయిప్రణీత్ విజయాలు నమోదు చేశాడు.

గోపీచంద్ అకాడమీని వీడనున్న కోచ్ సియాదతుల్లా



రెండు దశాబ్దాలుగా పుల్లెల గోపీచంద్ అకాడమీలో కోచ్‌గా పని చేస్తున్న మొహమ్మద్ సియాదతుల్లా సిద్దిఖి అకాడమీని వీడనున్నాడు. అమెరికాలోని ఒరెగాన్ బ్యాడ్మింటన్ అకాడమీలో సియాదతుల్లా కోచ్‌గా చేరనున్నాడు. 40 ఏళ్ల సియదతుల్లా భారత అగ్రశ్రేణి క్రీడాకారులు సైనా నెహ్వాల్, పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, హెచ్‌ఎస్ ప్రణయ్ తదితరుల వెంట పలు అంతర్జాతీయ టోర్నీల్లో కోచ్‌గా వెళ్లాడు. 'నా బావ మరిది అమెరికాలో ఉంటున్నాడు. అతను ఈ ప్రతిపాదన తెచ్చాడు. ప్రతిపాదన బాగుండటంతో అంగీకరించాను. ఈనెల 7వ తేదీన అమెరికాకు వెళుతున్నాను. జూన్‌లో కుటుంబసభ్యులు అమెరికాకు వస్తారు' అని సియాదతుల్లా తెలిపాడు.

సినిమా

వేట్టయాన్‌లో ఎంట్రీ

'వేట్టయాన్' సెట్స్‌లో జాయిన్ అయ్యారు రానా. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికా సింగ్, దుషార విజయన్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. 'వేట్టయాన్' లేటెస్ట్ షెడ్యూల్ చిత్రీకరణ ఇటీవల హైదరాబాద్‌లో మొదలైంది. రజనీకాంత్– అమితాబ్ బచ్చన్‌ల మధ్య కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. తాజాగా ఈ సినిమా సెట్స్‌లో తొలిసారి సోమవారం రానా జాయిన్ అయ్యారు. రజనీకాంత్–రానా కాంబినేషన్ సీన్స్‌ని ఈ షెడ్యూల్‌లో ప్లాన్ చేశారట జ్ఞానవేల్. ఈ సినిమాలో రజనీకాంత్ ఓ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారని, బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ మూవీ కథనం సాగుతుందని తెలిసింది. సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.



రజనీకాంత్



రానా

తెలుగు పలుకులు?

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోన్ తెలుగులో చేస్తున్న తొలి స్ట్రయిట్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ సైన్స్ ఫిక్షనల్ మూవీకి నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశాపటానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమాలో పద్మ అనే పాత్రలో దీపికా పదుకోన్ నటిస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. 'కల్కి 2898 ఏడీ'కి సంబంధించి ఇప్పటికే దీపిక పాత్ర చిత్రీకరణ మొత్తం పూర్తయిందని తెలిసింది. అయితే ఈ సినిమాలోని తన పాత్రకు సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవాలని దీపిక అనుకుంటున్నారని టాక్. సొంత డబ్బింగ్ అయితే తన పాత్రకు మరింత బలం వచ్చినట్లు అవుతుందని ఆమె భావిస్తున్నారట. అతి త్వరలోనే దీపిక వాయిస్‌కు ప్రాథమిక డబ్బింగ్ టెస్ట్ నిర్వహించి, తుది నిర్ణయం తీసుకోనున్నారట నాగ్ అశ్విన్. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఇటలీలో జరుగుతోందని తెలిసింది. ప్రభాస్, దిశాపటానీలపై ఓ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారట మేకర్స్. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న 'కల్కి 2898 ఏడీ' మే 9న విడుదల కానుంది.



దీపికా పదుకోన్

పెట్రోల్ కొట్టిస్తే దించేస్తా

'గీతగోవిందం' (2018) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ పెట్ల కాంబోలో రూపొందుతున్న తాజా సినిమా 'ఫ్యామిలీ స్టార్'. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 5న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్.


''ఏమండి.. నేను కాలేజీకి వెళ్లాలి... కొంచెం దించేస్తారా? (మృణాల్ ఠాకూర్), 'ఒక లీటర్ పెట్రోల్ కొట్టిస్తే దించేస్తా..'(విజయ్ దేవరకొండ)' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం గోపీ సుందర్, కెమెరా: కేయూ మోహనన్.



మృణాళ్ ఠాకూర్, విజయ్ దేవరకొండ

బాలీవుడ్ గూఢచారి?

హీరో రణ్‌వీర్ సింగ్, 'ఉరి' ఫేమ్ ఆదిత్యా ధార్ కాంబినేషన్‌లో ఓ యాక్షన్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కనుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం అజయ్ దేవగన్ హీరోగా చేస్తున్న 'సింగమ్ ఎగైన్' సినిమాలో ఓ లీడ్ రోల్ చేస్తున్నారు రణ్‌వీర్ సింగ్. ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. 'సింగమ్ ఎగైన్' లో తన పాత్ర షూటింగ్ పూర్తి కాగానే ఫర్హాన్ అక్తర్ డైరెక్షన్‌లో 'డాన్ 3' సెట్స్‌లో రణ్‌వీర్ జాయిన్ అవుతారు. ఆ సినిమా చిత్రీకరణ ఓ కొలిక్కి రాగానే సూపర్ హీరో ఫిల్మ్ 'శక్తిమాన్'ను రణ్‌వీర్ ప్రారంభించాలనుకున్నారు. కానీ 'డాన్ 3' సెట్స్‌కి వెళ్లేందుకు సమయం పడుతుందట. దీంతో ఈ లోపు ఆదిత్యాధార్ చెప్పిన ఓ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారట రణ్‌వీర్. ఇండియన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీస్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో రణ్‌వీర్ రోల్ కొత్తగా ఉంటుందని బీ టౌన్ టాక్. ఈ చిత్రంలో రణ్‌వీర్ గూఢచారిగా కనిపించనున్నారని ప్రచారం సాగుతోంది. వేసవి నుంచి చిత్రీకరణను ప్లాన్ చేస్తున్నారట.



రణ్‌వీర్ సింగ్

భీమా సరికొత్త అనుభూతిని పంచుతుంది

\- కేకే రాధామోహన్



''గోపీచంద్ ఇంతకుముందు పోలీస్ పాత్రలు చేశారు. కానీ, కొత్త జోనర్‌లో ఉండే 'భీమా' కథలో తన పాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది. ప్రస్తుతం ప్రేక్షకులు ఇలాంటి కథలని గొప్పగా ఆదరిస్తున్నారు. మా సినిమా కూడా వారికి సరికొత్త అనుభూతిని పంచుతుంది'' అని నిర్మాత కేకే రాధామోహన్ అన్నారు. గోపీచంద్ హీరోగా, ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భీమా'. ఎ.హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 8న విడుదలవుతోంది. కేకే రాధామోహన్ మాట్లాడుతూ–''ప్రతి ప్రాజెక్ట్ నిర్మాతకు రిస్కే. అయితే ఆ చిత్ర కథ ప్రేక్షకుల అభిరుచి తగ్గట్టు ఉందా? లేదా? అని ఆలోచించి, కథకి సరిపడా నటీనటులు? సాంకేతిక నిపుణులను ఎంచుకొని ముందుకు వెళ్లడమే. హర్షకి తెలుగులో 'భీమా' మొదటి చిత్రమైనా చాలా స్పష్టతతో తీశాడు. ప్రియా భవానీ, మాళవిక శర్మ పాత్రలు కూడా వైవిధ్యంగా ఉంటాయి. రవి బస్రూర్ అద్భుతమైన సంగీతం, నేపథ్య సంగీతం ఇచ్చారు. భీమాలో వీఎఫ్‌ఎక్స్‌కి చాలా ప్రాధాన్యత ఉంది. ఆయుష్ శర్మ హీరోగా హిందీలో ఓ సినిమా నిర్మిస్తున్నా. బెల్లంకొండ సాయి శ్రీనివాస్–డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో ఓ సినిమా నిర్మిస్తాను'' అన్నారు.

కన్నీళ్లు వచ్చాయి

\- చాందినీ చౌదరి



''కలర్ ఫోటో' సినిమా తర్వాత సీరియస్ యాక్ట్రెస్‌గా నాకు గుర్తింపు వచ్చింది. ఆ మూవీ తర్వాత నా పనిని ఇంకా ఎలా మెరుగుపరచుకోవచ్చు అనే దానిపైనే దృష్టి పెడుతున్నాను. 'గామి' కథ విన్నప్పుడు కచ్చితంగా భాగం కావాలనిపించింది. నా మనసుకి చాలా తృప్తి ఇచ్చిన సినిమా 'గామి'' అని హీరోయిన్ చాందినీ చౌదరి అన్నారు. విశ్వక్ సేన్, చాందినీ చౌదరి జంటగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహించిన చిత్రం 'గామి'. వి సెల్యులాయిడ్ సమర్పణలో కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 8న విడుదలకానుంది. ఈ సందర్భంగా చాందినీ చౌదరి మాట్లాడుతూ–''వారణాసి, కుంభమేళా, కాశ్మీర్, హిమాలయాలు.. ఇలా రియల్ లొకేషన్స్‌లో 'గామి'ని చిత్రీకరించాం. షూటింగ్‌లో చాలా సవాల్‌తో కూడిన పరిస్థితులు ఎదుర్కొన్నాం. ఈ సినిమా ప్రయాణం ఒక సాహస యాత్రలా జరిగింది. ఈ మూవీకి ఐదేళ్లు పట్టింది. అంత సమయం తీసుకున్నాం కాబట్టే విజువల్స్ ఇంత అద్భుతంగా వచ్చాయి. ఐమ్యాక్స్ స్క్రీన్‌లో మా మూవీ ట్రైలర్ చూసినప్పుడు మా కష్టానికి ప్రతిఫలం లభించిందనే ఆనందంతో నాకు కన్నీళ్లు వచ్చాయి. 'గామి' లాంటి సినిమా తెలుగులో ఇప్పటివరకూ రాలేదు. నేను నటించిన 4 చిత్రాలు ఈ ఏడాది విడుదల కానున్నాయి. 'ఝూన్సీ' వెబ్ సిరీస్‌లోనూ నటించా'' అన్నారు.

ఆ ప్రయాణం అలరిస్తుంది

\- నిహార్ కపూర్



''కవలలైన ఇద్దరు అనాథ సోదరులు అడవిలో కుస్తీ పోటీలు నేర్చుకుంటారు. సిటీకి వచ్చిన వారు అంతర్జాతీయ స్థాయిలో డబ్ల్యూ డబ్ల్యూ ఈ పోటీల దాకా ఎలా వెళ్లారు? అనే ప్రయాణాన్ని దేశభక్తి రూపంలో 'రికార్డ్ బ్రేక్' సినిమాలో చూపించారు చదలవాడ శ్రీనివాసరావుగారు. ఈ మూవీ తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరో నిహార్ కపూర్ అన్నారు. నటి జయసుధ తనయుడు నిహార్ కపూర్ హీరోగా నటించిన చిత్రం 'రికార్డ్ బ్రేక్'. చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో చదలవాడ పద్మావతి నిర్మించిన ఈ మూవీ ఈ నెల 8న రిలీజవుతోంది. నిహార్ కపూర్ మాట్లాడుతూ– ''దంగల్' మూవీ కథ కూడా కుస్తీ నేపథ్యంలో ఉంటుంది. అయితే ఆ చిత్రంతో మా 'రికార్డ్ బ్రేక్'కి ఎలాంటి పోలిక లేదు. ఇది తెలుగు సినిమా అయినా ప్రతి భారతీయుడు చూసి గర్వించదగ్గ సినిమా.. అందుకే ఎనిమిది భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. మా అమ్మ(జయసుధ) 'రికార్డ్ బ్రేక్' ట్రైలర్ చూసి, యునిక్ కాన్సెప్ట్ తీసుకున్నావ్ అని మెచ్చుకున్నారు. డైరెక్షన్ కోర్స్ నేర్చుకున్న నేను భవిష్యత్‌లో కచ్చితంగా డైరెక్షన్ చేస్తాను'' అన్నారు.

రంగ్ రంగ్ రంగీలా...

సునీల్, చైతన్య రావు, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'పారిజాత పర్వం'. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో వనమాలి క్రియేషన్స్‌పై మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి రీ సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'రంగ్ రంగ్ రంగీలా...' అంటూ సాగే పాటని విడుదల చేశారు మేకర్స్. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ పాటని శ్రద్ధా దాస్ స్వయంగా పాడటంతో పాటు నర్తించారు. ''హిలేరియస్ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'పారిజాత పర్వం' రూపొందుతోంది. శ్రద్ధాదాస్ అందం, గానం 'రంగ్ రంగ్ రంగీలా...' పాటకు ప్రత్యేక ఆకర్షణ తీసుకొస్తాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: అనంత సాయి, కెమెరా: బాల సరస్వతి



శ్రద్ధా దాస్

వినోదాల ఆయ్

నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటించిన వినోదాత్మక చిత్రానికి 'ఆయ్' టైటిల్‌ను ఖరారు చేశారు. 'మేం ఫ్రెండ్సండి' అన్నది ఉపశీర్షిక. అంజి కంచిపల్లి దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్, విద్యా కొప్పినీడి ఈ సినిమాను నిర్మించారు. ''హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా 'ఆయ్' రూపొందింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 7న ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: రామ్ మిర్యాల, సహ నిర్మాతలు: భాను ప్రతాప్, రియాజ్ చౌదరి.



నార్నే నితిన్

సాక్షి బిజినెస్
మంగళవారం
5-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	66	73,872
నిఫ్టీ ▲	27	22,406

విదేశీ సూచీలు (సోమ వారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	16,231	▼	44
డోజోన్స్	38,996	▼	92
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,634	▼	48
డాక్స్	17,716	▼	19
షాంఘై	3,039	▲	12
నికాయ్	40,109	▲	198

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	63,480
బంగారం (99.5 స్వచ్ఛత)	63,226
వెండి (కేజీ)	70,777

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.46	83.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.80	106.35
€	యూరో	ఎస్‌బీఐ	88.78	91.16
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.64	55.88
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.16	55.11
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.41	64.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.63	23.45
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.45

మాస్‌మెడిక్‌లో సైయంట్‌కు సభ్యత్వం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రతిష్టాత్మకమైన మసాచుసెట్స్ మెడికల్ డివైజ్ ఇండస్ట్రీ కౌన్సిల్ (మాస్‌మెడిక్)లో తమకు సభ్యత్వం లభించినట్లు ఇంజినీరింగ్, టెక్నాలజీ సేవల సంస్థ సైయంట్ వెల్లడించింది. మాస్‌మెడిక్ అమెరికాలో ప్రాంతీయంగా అతిపెద్ద మెడ్‌టెక్ అసోసియేషన్ అని వివరించింది. హెల్త్‌కేర్ రంగ అభివృద్ధికి దోహదపడేందుకు కట్టుబడి ఉన్నామన డానికి ఈ భాగస్వామ్యం నిదర్శనమని సైయంట్ ప్రెసిడెంట్ ఆనంద్ పరమేశ్వరన్ తెలిపారు. నవకల్పనలపై నిబద్ధత గల సైయంట్‌తో భాగస్వామ్యం ఎంతో విలువైనది కాగలదని మాస్‌మెడిక్ సీవోవో రేచల్ రాబిన్సన్ తెలిపారు.

మార్కెట్లోకి పల్సర్ ఎన్ఎస్ 2024 సిరీస్ బైకులు



పుణే: దేశీయ వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో తమ పల్సర్ ఎన్ఎస్ 125 మోడల్‌ను అప్‌డేట్ చేసి పల్సర్ ఎన్ఎస్ 2024 సిరీస్ పేరుతో కొత్త బైకులు తీసుకొచ్చింది. ఎన్ఎస్200, ఎన్ఎస్160, ఎన్ఎస్ 125 మూడు వేరియంట్లలో లభించనున్న ఈ బైకుల ధర వరుసగా రూ.1,57,427, రూ.1,45,792, రూ.1,04,922గా ఉన్నాయి. వీటిని నూతన డిజిటల్ కన్సోలెస్ అండ్ ఎల్ఈడీ హెడ్ ల్యాంప్‌తో తీర్చిదిద్దారు. సెమీ-డిజిటల్, బ్లూటూత్ కనెక్టివిటీ, ఇన్‌కమింగ్ కాల్స్, ఎస్ఎంఎస్ అలర్ట్, ఫోన్ బ్యాటరీ సామర్థ్యం, సిగ్నల్ లెవెల్, నావిగేషన్ కూడా తెలుసుకోవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-3-2024	
విశాఖ	500–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	463–00
విజయవాడ	463–00
రిటైల్ ధర (డజను)	72.00
4-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	469–00
వరంగల్	471–00
రిటైల్ ధర	5.30

రెండు కంపెనీలుగా టాటా మోటార్స్

ప్యాసింజర్ వాహనాలతో ఒక బిజినెస్ ● వాణిజ్య వాహనాలతో మరో యూనిట్

టాటా గ్రూప్ దిగ్గజం టాటా మోటార్స్ రెండు లిస్టెడ్ కంపెనీలుగా విడిపోనుంది. వాణిజ్య వాహనాలు ఒక సంస్థగా, ప్రయాణికుల వాహనాలు మరో కంపెనీగా ఏర్పాటుకానుంది. తద్వారా వృద్ధి అవకాశాలను మరింత బలంగా అందిపుచ్చుకోనున్నట్లు కంపెనీ పేర్కొంటోంది.

న్యూఢిల్లీ: ఆటో రంగ లిస్టెడ్ దిగ్గజం టాటా మోటార్స్ రెండు కంపెనీలుగా విడిపోయేందుకు ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు బోర్డు ఆమోదముద్ర వేసినట్లు టాటా మోటార్స్ వెల్లడించింది. వీటి ప్రకారం సంబంధిత పెట్టుబడులతో కలిపి వాణిజ్య వాహన విభాగం ఒక సంస్థగా ఏర్పాటుకానుంది. విలాసవంత కార్ల యూనిట్ జాగ్వార్ ల్యాండ్ రోవర్‌సహా ప్యాసింజర్ వాహనాల(పీవీ) బిజినెస్ మరో కంపెనీగా ఆవిర్భవించనుంది. దీనిలో సంబంధిత పెట్టుబడులతోపాటు ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) విభాగంసైతం కలసి ఉంటుందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు టాటా మోటార్స్ తెలియజేసింది. ఎన్‌సీఎల్‌టీ నిబంధనలకు అనుగుణంగా విడదీతను చేపట్టనున్నట్లు పేర్కొంది. టాటా మోటార్స్ వాటాదారులు 2 లిస్టెడ్ సంస్థలలోనూ యథాతథంగా వాటాలను పొందుతారని స్పష్టం చేసింది.



టర్న్ అరౌండ్

గత కొన్నేళ్లలో కంపెనీ బలమైన టర్న్‌అరౌండ్‌ను సాధించింది. మూడు ఆటోమోటివ్ బిజినెస్ యూనిట్లూ స్వతంత్ర నిర్వహణలో కొనసాగుతూ నిలకడైన పనితీరును చూపుతున్నాయి. తాజా విడదీతతో మార్కెట్ కల్పించే అవకాశాలను అందిపుచ్చుకోనున్నాయ్. – ఎన్.చంద్రశేఖరన్, చైర్మన్, టాటా మోటార్స్

12-15 నెలలు

కంపెనీ విడదీతతో కస్టమర్లకు సేవలు విస్తృతమవుతాయని టాటా మోటార్స్ చైర్మన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఉద్యోగులకు అవకాశాలు పెరుగుతాయని, వాటాదారులకు మరింత విలువ చేకూరుతుందన్నారు. విడదీత ప్రణాళికకు రానున్న నెలల్లో బోర్డుసహా.. వాటాదారులు, రుణదాతలు, నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు పొందనున్నట్లు తెలియజేశారు. విడదీత పూర్తికి 12–15 నెలలు పట్టవచ్చని అంచనా వేశారు. కంపెనీ విడదీత ఉద్యోగులు, కస్టమర్లు, వ్యాపార భాగస్వాములపై ఎలాంటి ప్రతికూల ప్రభావాన్నీ చూపబోదని స్పష్టం చేశారు. కాగా.. వాణిజ్య, ప్రయాణికుల వాహన విభాగాల మధ్య పరిమితమైన ప్రయోజనాలు మాత్రమే ఉంటాయని టాటా మోటార్స్ పేర్కొంది. కంపెనీ కార్యకలాపాలు 88 అనుబంధ సంస్థలు, మూడు సంయుక్త కంపెనీలు, రెండు సంయుక్త కార్యకలాపాలు తదితరాలతో విస్తరించాయి.

తాజా వార్తల నేపథ్యంలో కంపెనీ షేరు రూ. 996 వరకూ ఎగసింది. ఇది 52 వారాల గరిష్టం. చివరికి నామమాత్ర నష్టంతో రూ. 987 వద్ద ముగిసింది.

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ పసిడి రుణాలపై ఆర్‌బీఐ నిషేధం



ముంబై: పర్యవేక్షణ లోపాల కారణంగా ఆర్థిక సేవల సంస్థ ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ బంగారం రుణాలు ఇవ్వకుండా రిజర్వ్ బ్యాంక్ నిషేధం విధించింది. ఇది తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఆర్‌బీఐ తెలిపింది. అయితే, ప్రస్తుత గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియోకి సంబంధించిన వసూళ్లు, రికవరీ ప్రక్రియలను యథావిధిగా కొనసాగించవచ్చని పేర్కొంది. పసిడి రుణాలిచ్చేటప్పుడు, డిఫాల్ట్ అయిన సందర్భాల్లో వేలం వేసేటప్పుడు బంగారం స్వచ్ఛత, బరువును విలువ కట్టడంలో లోపాలు, పరిమితికి మించి నగదు రూపంలో రుణ మొత్తాన్ని మంజూరు చేయడం .. వసూలు చేయడం తదితర తీవ్ర ఉల్లంఘనలను కంపెనీ ఆడిట్‌లో గుర్తించినట్లు రిజర్వ్ బ్యాంక్ వివరించింది. అలాగే, ప్రామాణిక వేలం ప్రక్రియలను పాటించకపోవడం, కస్టమర్లకు విధించే చార్జీలపై పారదర్శకత లోపించడం మొదలైనవి కూడా కస్టమర్ల ప్రయోజనాలపై ప్రతికూల ప్రభావం చూపేవేనని ఆర్‌బీఐ తెలిపింది. సంస్థపై చేపట్టిన ప్రత్యేక ఆడిట్ పూర్తయ్యాక పర్యవేక్షణపరమైన ఆంక్షలను సమీక్షించనున్నట్లు వివరించింది.

కొనసాగిన బుల్ రికార్డులు

- సూచీలకు నాలుగో రోజూ లాభాలే
- ఇంధన, బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్

ముంబై: పరిమిత శ్రేణి ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులకు లోనైనప్పటికీ.., స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీ సోమవారమూ కొనసాగింది. ఆకర్షణీయ స్థూల ఆర్థిక డేటా నమోదు కారణంగా అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ 2024 ఏడాదికి గానూ భారత జీడీపీ వృద్ధి రేటును 6.1% నుంచి 6.8 శాతానికి పెంచింది. మూడీస్ అప్‌గ్రేడ్ రేటింగ్‌తో బ్యాంకింగ్, ఇంధన, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 243 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 66 పాయింట్ల లాభంతో 73,872 వద్ద ముగిసింది. ఒక దశలో 184 పాయింట్లు బలపడి 73,990 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. నిఫ్టీ 63 పాయింట్లు పెరిగి 22,441 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 27 పాయింట్లు లాభంతో 22,406 వద్ద స్థిరపడింది. ఇరు సూచీలకు ముగింపు స్థాయిలు సరికొత్త రికార్డుతో పాటు వరుసగా నాలుగో రోజూ



లాభాల ముగింపు. ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.564 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.3,543 కోట్ల షేర్లు కొన్నారు.

గో డిజిట్ ఐపీవోకు గ్రీన్ సిగ్నల్

గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ (ఐపీవో)కి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఇష్యూ కింద రూ. 1,250 కోట్ల విలువ చేసే షేర్లను కొత్తగా జారీ చేయనుండగా, ప్రమోటర్లు.. ప్రస్తుత షేర్‌హోల్డర్లు 10.94 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) మార్గంలో విక్రయించనున్నారు.

పబ్లిక్ ఇష్యూకి బ్లాక్‌బక్

లాజిస్టిక్స్ అంకుర సంస్థ బ్లాక్‌బక్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే యోచనలో ఉంది. ఐపీవో ద్వారా కంపెనీ సుమారు 300 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 2,500 కోట్లు) సమీకరించే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగా ప్రస్తుత ఇన్వెస్టర్లు కొన్ని షేర్లు విక్రయించనుండగా, కొత్తగా మరికొన్ని షేర్లను కూడా సంస్థ జారీ చేయనున్నట్లు వివరించాయి. ఇష్యూ ద్వారా సమీకరించే నిధులను సర్వీసుల వ్యాపార విభాగాన్ని విస్తరించేందుకు బ్లాక్‌బక్ వినియోగించుకోనుంది. బ్లాక్‌బక్‌ను నిర్వహించే జింకా లాజిస్టిక్ సొల్యూషన్స్‌లో ఫ్లిప్‌కార్ట్ పెట్టుబడులు ఉన్నాయి.

2024 వృద్ధి 6.8 శాతం: మూడీస్



న్యూఢిల్లీ: భారత్ 2024 క్యాలెండర్ ఇయర్ వృద్ధి అంచనాను గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ 70 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెంచింది. ఇంతక్రితం 6.1 శాతం అంచనాలను 6.8 శాతానికి పెంచుతున్నట్లు వివరించింది. ''అంచనాల కంటే బలమైన'' ఆర్థిక గణాంకాలు తమ తాజా అంచనా పెంపునకు కారణంగా పేర్కొంది. జీ20 దేశాలలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుందని వివరించింది. 2025లో దేశ వృద్ధి రేటును 6.4 శాతంగా రేటింగ్ దిగ్గజం పేర్కొంది. 2023లో దేశ ఎకానమీ ఊహించినదానికన్నా అధికంగా మంచి పురోగతిని సాధించినట్లు తెలిపింది. ప్రభుత్వ మూలధన వ్యయాలు, పటిష్ట తయారీ కార్యకలాపాలు 2023లో భారత్ బలమైన వృద్ధి ఫలితాలకు దోహదపడ్డాయని మూడీస్ తన నివేదికలో పేర్కొంది.

స్లయిస్ బ్రాండ్ అంబాసిడర్‌గా నయనతార

న్యూఢిల్లీ: శీతల పానీయ బ్రాండ్ స్లయిస్‌కి ప్రచారకర్తగా సినీ నటి నయనతార నియమితులయ్యారు. లేడీ సూపర్‌స్టార్‌గా పేరొందిన నయనతార చేరిక అనేది స్లయిస్ బ్రాండ్ మరింత మందికి చేరువయ్యేందుకు తోడ్పడగలదని పెప్సీకో ఇండియా అసోసియేట్ డైరెక్టర్ అనుజ్ గోయల్ ఆశాభావం వ్యక్తం చేశారు. వేసవి సీజన్ సందర్భంగా కొత్త



ప్రచార కార్యక్రమాన్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు. స్లయిస్ కుటుంబంలో భాగమవడంపై నయనతార సంతోషం వ్యక్తం చేశారు.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎస్ ఈఏపీసెట్-2024

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి.. తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2024(ఈఏపీసెట్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ హైదరాబాద్(జేఎన్‌టీయూహెచ్) నిర్వహించనుంది. దీని ద్వారా 2024–25 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రంలో యూనివర్శిటీలు, ప్రైవేట్ అన్ ఎయిడెడ్, అఫిలియేటెడ్ ప్రొఫెషనల్ కళాశాలల్లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

కోర్సుల వివరాలు

» బీఈ, బీటెక్/బీటెక్(బయో-టెక్నాలజీ)/బీటెక్(డెయిరీ టెక్నాలజీ) /బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్)/బీఫార్మసీ/బీటెక్(ఫుడ్ టెక్నాలజీ)/బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్/బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్/బీఎస్సీ(ఫారెస్ట్రీ/బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ; ఫార్మ్–డి; బీఎస్సీ(నర్సింగ్).
» **అర్హత:** ఇంటర్మీడియట్(ఎంపీసీ/బైపీసీ)లో ఎస్సీ, ఎస్టీలకు 40%, ఇతరులకు 45% మార్కులు తప్పనిసరిగా ఉండాలి.
» **పరీక్ష కేంద్రాలు:** ఎంసెట్ నిర్వహణకు తెలంగాణలో 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏపీలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు నగరాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తులకు చివరితేది:** 06.04.2024.
» **దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం:** 08.04.2024 నుంచి 12.04.2024 వరకు
» **ఈఏపీసెట్ పరీక్షలు:** 09.05.2024 , 10.05.2024 తేదీల్లో ఇంజనీరింగ్, 11.05.2024, 12.05.2024 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలు జరుగుతాయి.
» **వెబ్‌సైట్:** https://eapcet.tsche.ac.in

తెలంగాణ ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల సంస్థ(టీఎస్ఈఎస్)..23ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈఎంఆర్ఎస్ సెలక్షన్ టెస్ట్ (ఈఎంఆర్ఎస్ఎస్టీ)–2024 పరీక్ష నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, విద్య, శిక్షణ అందిస్తారు. బోధనా మాధ్యమం ఆంగ్లంలో సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తారు.

» **మొత్తం సీట్ల సంఖ్య:**23 విద్యాలయాల్లో 1380(690బాలురు,690బాలికలు)సీట్లు ఉన్నాయి.
» **అర్హత:** గిరిజన, ఆదివాసీ గిరిజన, సంచార గిరిజన, పాక్షిక సంచార గిరిజన, డీనోటిఫైడ్ ట్రైబ్ కేటగిరీలకు చెందిన విద్యార్థులు అర్హులు. 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష(పట్టణ ప్రాంతం), రూ.లక్షన్నర(గ్రామీణ ప్రాంతం) మించకూడదు.
» **వయసు:** 31.03.2024 నాటికి ఆరో తరగతికి 10 నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలి. దివ్యాంగులకు రెండేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ప్రశ్నాపత్రం 100 మార్కులకు ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ(50 ప్రశ్నలు)–50 మార్కులు, అర్థమేటిక్(25 ప్రశ్నలు)–25 మార్కులు, లాంగ్వేజ్(25 ప్రశ్నలు)–25 మార్కులు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**22.03.2024
» **హాల్‌టిక్కెట్‌ల డౌన్‌లోడ్ తేది:** పరీక్షకు ఒక వారం ముందు
» **పరీక్ష తేది:** 21.04.2024.
» **వెబ్‌సైట్:** https://tsemrs.telangana.gov.in

ఐఐఎస్ఈఆర్‌లో బీఎస్-ఎంఎస్, బీఎస్ ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్) 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్–ఎంఎస్(డ్యూయల్ డిగ్రీ), బీఎస్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్–2024 పరీక్ష నిర్వహిస్తుంది. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు:** బెర్హంపూర్, భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణె, తిరువనంతపురం, తిరుపతి.

కోర్సులు

» **బీఎస్–ఎంఎస్(డ్యూయల్ డిగ్రీ):** కోర్సు వ్యవధి–ఐదేళ్లు.
» **బీఎస్ డిగ్రీ:** కోర్సు వ్యవధి–నాలుగేళ్లు.
» **అర్హత:** కనీసం 60శాతం మార్కులతో ఇంటర్మీడియట్(సైన్స్ స్ట్రీమ్) 2022, 2023, 2024 లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 01.04.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.05.2024
» **ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐఏటీ):** 09.06.2024
» **వెబ్‌సైట్:** https://iiseradmission.in

సత్వర ఉపాధికి మార్గం.. పాలిటెక్నిక్స్

పదో తరగతి తర్వాత సత్వర ఉపాధికి మార్గం.. పాలిటెక్నిక్ కోర్సులు!! పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్నాక.. ఉద్యోగాలతోపాటు ఉన్నత విద్య కోసం బీటెక్‌లో చేరే అవకాశం కూడా ఉంది. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి మార్గం.. పాలిసెట్. రెండు తెలుగు రాష్ట్రాల్లో వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ఏపీ పాలిసెట్-2024, టీఎస్ పాలిసెట్-2024లకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. పాలిసెట్‌ల వివరాలు, పరీక్ష విధానం, పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులతో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..

» 2024కు ఏపీ, టీఎస్‌లో పాలిసెట్ నోటిఫికేషన్స్ విడుదల
» డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి పాలిసెట్స్ నిర్వహణ
» కోర్సులు పూర్తి చేసుకుంటే సత్వర ఉపాధి, ఉన్నత విద్య
» బీటెక్‌లో నేరుగా రెండో ఏడాదిలో అడుగు పెట్టే అవకాశం

ఆంధ్రప్రదేశ్‌లో 267 పాలిటెక్నిక్ కళాశాలల్లో 31 బ్రాంచ్‌ల్లో మొత్తం 82,870 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా తెలంగాణలో 118 పాలిటెక్నిక్ కళాశాలల్లో 32 బ్రాంచ్‌లలో మొత్తం 29,790 సీట్లు ఉన్నాయి. వీటితోపాటు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలోని 11 అగ్రికల్చర్ పాలిటెక్నిక్స్‌లో అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో 280 సీట్లు, రెండేళ్ల వ్యవధిలోని అగ్రికల్చరల్ డిప్లొమా కోర్సుల్లో 450 సీట్లు; అగ్రికల్చర్ ఇంజనీరింగ్ డిప్లొమా (ఇంగ్లిష్ మీడియం)లో 90 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

పాలిసెట్‌లో ర్యాంకుతో సీట్ల భర్తీ

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పాలిటెక్నిక్ కాలేజీలు అందించే డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ప్రతి ఏటా పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పాలిసెట్)ను నిర్వహిస్తున్నారు.

ఏపీ, టీఎస్ పాలిసెట్‌కు అర్హతలు

పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి. 2024లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం ఇలా

- ఏపీ పాలిసెట్‌ను మూడు సబ్జెక్ట్‌లలో 120 మార్కులకు నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలు–50 మార్కులు, ఫిజిక్స్ 40 ప్రశ్నలు–40 మార్కులు; కెమిస్ట్రీ 30 ప్రశ్నలు–30 మార్కులకు ప్రశ్నా పత్రం ఉంటుంది. రెండు గంటల వ్యవధిలో పరీక్ష జరుగుతుంది.
- టీఎస్ పాలిసెట్‌ను 150 మార్కులకు నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్ 60 ప్రశ్నలు –60 మార్కులు; ఫిజిక్స్ 30 ప్రశ్నలు–30 మార్కులు; కెమిస్ట్రీ 30ప్రశ్నలు–30 మార్కులు; బయాలజీ 30 ప్రశ్నలు–30 మార్కులకు ప్రశ్నా పత్రం ఉంటుంది. రెండున్నర గంటల వ్యవధిలో పరీక్ష జరుగుతుంది.

ఉమ్మడి కౌన్సెలింగ్

పాలిసెట్‌లో ఉత్తీర్ణత ఆధారంగా ఉమ్మడి కౌన్సెలింగ్ నిర్వహించి.. అభ్యర్థులు పొందిన మార్కులు, అందుబాటులో ఉన్న సీట్లను పరిగణనలోకి తీసుకొని ప్రవేశాలు కల్పిస్తారు. సీట్ అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు సంబంధిత పాలిటెక్నిక్ కళాశాలలో నిర్దేశిత తేదీలోగా రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

డిప్లొమా కోర్సులు ఇవే

రెండు తెలుగు రాష్ట్రాల్లోని పాలిటెక్నిక్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న డిప్లొమా కోర్సుల వివరాలు.. సివిల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, మెకానికల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్; ఎలక్ట్రికల్ వెహికిల్ టెక్నాలజీ; ఈసీఈ; ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్); ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్; అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్; కంప్యూటర్ ఇంజనీరింగ్; ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్; 3–డి యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్; ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్; కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్); క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా; కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్; మైనింగ్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్; అపరెల్ డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ; మెటలర్జికల్ ఇంజనీరింగ్; టెక్స్‌టైల్ ఇంజనీరింగ్; బయో మెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ (ఆయిల్ టెక్నాలజీ); కెమికల్ ఇంజనీరింగ్ (పెట్రో కెమికల్స్), కెమికల్ ఇంజనీరింగ్ (ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్); కెమికల్ ఇంజనీరింగ్ (షుగర్ టెక్నాలజీ); సెరామిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ; ప్యాకేజింగ్ టెక్నాలజీ, లెదర్ అండ్ గూడ్స్ టెక్నాలజీ; ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజనీరింగ్; సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా; ప్రింటింగ్ టెక్నాలజీ; హోమ్ సైన్స్; మైనింగ్ ఇంజనీరింగ్.

ఉన్నత విద్య.. ఉద్యోగాలు



టీఎస్/ఏపీ పాలిసెట్-2024

- పాలిసెట్ ర్యాంకు ఆధారంగా ఆయా డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. వీరు పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. నెలకు రూ.20 వేల వరకు వేతనం లభిస్తుంది. అదే విధంగా.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే ఏఈఈ పోస్ట్‌లకు, రాష్ట్ర స్థాయిలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే ఏఈఈ పోస్ట్‌లకు పోటీ పడొచ్చు.
- ఉన్నత విద్య: పాలిటెక్నిక్ డిప్లొమా అర్హతతో నిర్వహించే ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఈ–సెట్)లో ర్యాంకు ఆధారంగా లేటరల్ ఎంట్రీ విధానంలో నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో అడుగు పెట్టే అవకాశం ఉంది.

స్కాలర్‌షిప్ సదుపాయం

- పాలిసెట్ ర్యాంకుతో డిప్లొమా కోర్సుల్లో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి.
- ఏఐసీటీఈ–ప్రగతి స్కాలర్‌షిప్ పేరుతో.. దేశ వ్యాప్తంగా అయిదు వేల మంది మహిళా విద్యార్థులకు సంవత్సరానికి రూ.50 వేలు చొప్పున స్కాలర్‌షిప్ మొత్తాన్ని అందిస్తారు.
- అదే విధంగా సాక్షమ్ స్కాలర్‌షిప్ పేరుతో దివ్యాంగ విద్యార్థులకు సంవత్సరానికి రూ.50 వేల మొత్తాన్ని స్కాలర్‌షిప్‌గా అందిస్తారు.

పరీక్షలో రాణించేలా

మ్యాథమెటిక్స్

పదో తరగతి పాఠ్య పుస్తకంలోని ప్రతి చాప్టర్‌ను చదివి.. వాటికి సంబంధించిన ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యా వ్యవస్థ; బీజగణితం; నిరూపక రేఖాగణితం; క్షేత్రమితి;త్రికోణమితి; సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై పట్టు సాధించాలి. అదేవిధంగా ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. పాఠ్యపుస్తకంలోని ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు; సమితులు; బహుపదులు; రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు; సంభావ్యత; సాంఖ్యక శాస్త్రం ; త్రికోణమితి; క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలపై పట్టు సాధించాలి.

ఫిజిక్స్

ఈ సబ్జెక్ట్‌కు సంబంధించి.. ప్రయోగాలు–క్షేత్ర పర్యటనలు; సమాచార నైపుణ్యాలు –ప్రాజెక్ట్ పనులు; పటాలు–వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా కృషి చేయాలి. కాంతి పరావర్తనం , కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలను శ్రద్ధతో చదవాలి. అదే విధంగా.. మూలకాల ధర్మాలు–వర్గీకరణ, రసాయన సమీకరణాలను ప్రాక్టీస్ చేయాలి.

కెమిస్ట్రీ

ఆమ్లాలు, క్షారాలు; లవణాలు, పరమాణు నిర్మాణం, పి–బ్లాక్ ఎలిమెంట్స్, పిరియాడిక్ టేబుల్, మూలకాల వర్గీకరణ, అయోనైజేషన్ ఎనర్జీ, ఎలక్ట్రోనెగెటివిటీ, మెటాలిక్, నాన్–మెటాలిక్ ప్రాపర్టీస్, కెమికల్ బాండింగ్, ప్రిన్సిపుల్స్ ఆఫ్ మెటలర్జీ, కార్బన్ కాంపౌండ్స్ తదితర ముఖ్యమైన యూనిట్లలోని అన్ని అంశాలను అధ్యయనం చేయాలి.

బయాలజీ

ఈ సబ్జెక్ట్‌లో మంచి స్కోర్ కోసం ఒక అంశాన్ని నేర్చుకున్న తర్వాత.. దాన్ని వాస్తవ పరిస్థితులతో అన్వయించే నేర్పు సొంతం చేసుకోవాలి. డయాగ్రమ్స్‌ను ప్రాక్టీస్ చేసి.. భాగాలను గుర్తించడమే కాకుండా..వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా పదో తరగతి చాప్టర్స్‌లోని ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందడం మేలు చేస్తుంది. ఆయా అంశాలకు సంబంధించి చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, బేధాలు తెలుసుకుంటూ చదవాలి.

ముఖ్య సమాచారం

ఏపీ పాలిసెట్ ముఖ్య తేదీలు:

- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 5
- హాల్ టికెట్ డౌన్‌లోడ్: 2024, ఏప్రిల్ 20 నుంచి
- పాలిసెట్ పరీక్ష తేదీ: 2024, ఏప్రిల్ 27 (ఉదయం 11 నుంచి 1 వరకు)
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://polycetap.nic.in/Default.aspx

టీఎస్ పాలిసెట్ ముఖ్య తేదీలు:

- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 22
- పాలిసెట్ తేదీ: 2024, మే 17
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://polycet.sbtet.telangana.gov.in/#!/index

క్లుప్తంగా...

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

పీఆర్సీ కమిషన్‌కు సీపీఎస్ యూనియన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రెండో పే రివిజన్ కమిషన్‌కు విజ్ఞప్తి చేసింది. యూనియన్ అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో పీఆర్సీ కమిషన్ చైర్మన్ శివశంకర్‌ను కలసి ఈ మేరకు ప్రభుత్వానికి సిఫారసులు చేయాలని వినతిపత్రం అందజేశారు. పదవీ విరమణ చేసిన, చనిపోయిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాల స్థితిగతులపై 20 పేజీల నివేదికను అందజేశారు. సీపీఎస్ అమలు కోసం ఏటా ఉద్యోగి, ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ కలిపి మొత్తం రూ.3,000 కోట్లు ఎన్పీఎస్ ట్రస్టుకు చెల్లిస్తున్నారని తెలిపారు.

కనీస వేతనంగా రూ.32 వేలు ఇవ్వాలి

పే రివిజన్ కమిషన్ చైర్మన్‌ను కోరిన టీజీవో సంఘం

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల కనీస వేతనంగా రూ.32 వేలు ఇవ్వాలని, ఫిట్‌మెంట్ 40 శాతం కలిపి వేతన స్కేలును నిర్ధారించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం టీజీ వో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీని వాసరావు, సత్యనారాయణ బీఆర్‌కేఆర్ భవన్‌లో రెండో పే రివిజన్ కమిషన్ చైర్మన్ శివశంకర్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. అ నంతరం సచివాలయ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. గ్రాట్యుటీని రూ. 25 లక్షల వరకు పెంచాలని వారు కోరారు. అలాగే కనీస కుటుంబ పెన్షన్‌ను రూ.9,500 నుంచి రూ. 16 వేలకు పెంచాలని, ఉద్యోగుల పదవీ విరమణను 58 నుంచి 61 ఏళ్లకు పెంచిన నేపథ్యంలో ఎర్న్‌డ్ లీవ్‌లను కూడా పెంచాలని అన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌ను మహిళా ఉద్యోగులకు 180 రోజులు ఇవ్వాలన్నారు. అలాగే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కనీస వేతనం రూ. 30 వేలు ఇవ్వాలి

టీఎస్‌యూటీఎఫ్

సాక్షి, హైదరాబాద్: కనీస వేతనం రూ. 30 వేలు ఇవ్వాలని, మాస్టర్ స్కేలును కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) కోరింది. ఈ మేరకు సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో పే రివిజన్ కమిషన్‌కు టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి కలిసి వినతి పత్రం సమర్పించారు. ఫిట్‌మెంట్ 30 శాతం తగ్గకుండా ఉండాలని, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీంను ఆరు దశలుగా నిర్ణయించాలని, ఇంటి అద్దె అలవెన్స్ పెంచాలని వివరించారు. ఏజెన్సీ, కన్వేయన్స్ డ్యూటీ అలవెన్స్‌లు రెట్టింపు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష తదితర కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం టేబుల్/ బేసిక్ పే ఇవ్వాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, శిశుసంరక్షణ సెలవు రెండేళ్లకు పెంచాలని తెలిపారు.

మా వేతన స్కేళ్లను పెంచండి

పే రివిజన్ కమిషన్‌కు టీపీఎస్ఏ వినతి

సాక్షి, హైదరాబాద్: గ్రామాల్లో రోజువారీ పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణతో పాటు వివిధ విధులు నిర్వహిస్తున్న గ్రేడ్ 1,2,3,4 పంచాయతీ కార్యదర్శుల వేతన స్కేళ్లను పెంచాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ (టీపీఎస్ఏ) రెండో వేతన సవరణ కమిషన్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేసింది. రోజూ దాదాపు 12 గంటల పాటు విధులు నిర్వహిస్తున్న తమకు పదోన్నతుల అవకాశాలు తక్కువగా ఉన్నాయని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఎక్కువలో ఎక్కువగా గ్రేడ్-1 సెక్రటరీగా రిటైర్ అయ్యే అవకాశాలున్నందున తమ పే స్కేళ్లను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం కమిషన్ చైర్మన్‌కు టీపీఎస్ఏ అధ్యక్షుడు పి.మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో నేతలు ఈ.శ్రీనివాస్, ఎమ్మెస్ఎస్ వాణి, జె.పండరీనాథ్ వినతిపత్రం సమర్పించారు.

వేతన స్కేల్‌ను స్థిరీకరించాలి

సాక్షి, హైదరాబాద్: నర్సింగ్ ఆఫీసర్స్ వేతన స్కేల్‌ను స్థిరీకరించాలని తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు సోమవారం పే రివిజన్ చైర్మన్ శివశంకర్‌ను తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయమ్మ, మరియమ్మ కలిసి వినతిపత్రం సమర్పించారు. చీఫ్ నర్సింగ్ ఆఫీసర్స్‌కు రవాణా సౌకర్యం అలవెన్స్ కల్పించాలని, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్‌కి గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. గత పీఆర్సీలో ఏ అలవెన్స్ కూడా పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పెన్షనర్లకు 75 శాతం బేసిక్ పేతో చెల్లించాలి

సాక్షి, హైదరాబాద్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షనర్లకు 75% బేసిక్ పేతో చెల్లించాలని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం కోరింది. ఈ మేరకు సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో పే రివిజన్ కమిషన్ చైర్మన్ శివశంకర్‌ను సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.మోహన్‌నారాయణ, నర్సరాజు కలిసి వినతిపత్రం సమర్పించారు. కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్ (సీవోపీ)ను 12 ఏళ్ల వరకు మాత్రమే కట్టడి చేయాలని, ఫిట్‌మెంట్‌ను 45% ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

డీఎడ్ అర్హులకే ఎస్జీటీ పోస్టులు

- రిజర్వేషన్ కేటగిరీలకు ఇంటర్ మార్కుల్లో సడలింపు
- పరీక్ష మొత్తం ఆన్‌లైన్ విధానంలోనే
- గరిష్ట వయోపరిమితి 46 ఏళ్లు
- సమాచార బులెటిన్ విడుదల చేసిన విద్యాశాఖ
- మొదలైన దరఖాస్తుల ప్రక్రియ



సాక్షి, హైదరాబాద్: మెగా డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ అర్హులే దరఖాస్తు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రాథమిక పాఠశాలల్లో బోధించేందుకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పేపర్-2 ఉత్తీర్ణులైన వారికి అవకాశం కల్పించడం లేదని వెల్లడించింది. బీఈడీ నేపథ్యంతో ఉన్న వాళ్లంతా స్కూల్ అసిస్టెంట్ పోస్టులకే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల విద్యాశాఖ డీఎస్సీ విధి విధానాలను రూపొందించింది. ఇందుకు సంబంధించిన సమాచార బులెటిన్‌ను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఇప్పటికే డీఎస్సీకి దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. ఏప్రిల్ 2వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారు. సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులకు దరఖాస్తు చేసే వారికి, ఈసారి రిజర్వేషన్ అభ్యర్థులకు కొత్తగా ఇంటర్ మార్కుల అర్హతలో 5 మార్కులు సడలింపు ఇచ్చారు. టెట్ ఉత్తీర్ణులై, బీఈడీ, డీఎడ్ ఆఖరి సంవత్సరంలో ఉన్న వారు కూడా డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది.

11,062 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మొత్తం 11,062 పోస్టుల భర్తీకి ఇటీవల డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. పరీక్ష మొత్తం ఆన్‌లైన్ విధానంలో ఉంటుందని, 11 పట్టణాల్లో పరీక్ష నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. కొత్తగా దరఖాస్తు చేసే వాళ్లు రూ.వెయ్యి పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులు తిరిగి దరఖాస్తు చేయాల్సినవసరం లేదు.

పరీక్షాకేంద్రాలు ఇవీ..


మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి. అయితే ఈ పట్టణాల్లో ఎన్ని పరీక్షాకేంద్రాలు ఉండాలనేది వచ్చే దర ఖాస్తుల ఆధారంగా నిర్ణయిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తారు. మహిళలకు మూడోవంతు పోస్టులు ఉంటాయి.

వయో పరిమితి

మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసేవారు 18-46 ఏళ్ల వయసు కలిగి ఉండాలి. 2005 జూలై 7కు ముందు పుట్టి ఉండాలి. 1977 జూలై 2 నుంచి పుట్టిన వారిని గరిష్ట వయో పరిమితిగా పరిగణిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులకు 5 ఏళ్లు, మాజీ సైనికోద్యోగులకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. హాల్ టికెట్లు, పరీక్ష కేంద్రాలు, రోస్టర్ విధానాన్ని తర్వాత వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.

నియామక విధానం

- రాత పరీక్షకు 80 మార్కులుంటాయి. టెట్ వెయిటేజ్ 20 శాతం ఉంటుంది. టీఎస్, ఏపీ టెట్, కేంద్ర టెట్‌లను పరిగణనలోనికి తీసుకుంటారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తు చేసే వారు యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50% మార్కులతో (ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 45%) డిగ్రీ ఉండాలి. బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి. ఆఖరి సంవత్సరం బీఈడీ అభ్యర్థులు నియామకం జరిగే నాటికి సర్టిఫికెట్ పొంది ఉండాలి. టెట్ పేపర్ 2 ఉత్తీర్ణులై ఉండాలి. భాషా పండితులు, పీఈటీలు, సబ్జెక్టు టీచర్లు ఆయా సబ్జెక్టులతో బీఈడీ చేసి ఉండాలి. ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు 50% మార్కులతో ఇంటర్మీడియెట్ (రిజర్వేషన్ అభ్యర్థులకు 40%) పూర్తి చేసి ఉండాలి. రెండేళ్ల కాలపరిమితి గల డీఎడ్, నాలుగేళ్ల స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి. పేపర్-1 టెట్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. భాషా పండితులు, పీఈటీలు సంబంధిత సబ్జెక్టుల్లో డీఎడ్ చేయాలి.



ఏలియన్లు వచ్చేశాయా?

భూమ్మీదికి గ్రహాంతర వాసులు వచ్చారని, ఎగిరే పళ్లాల (ఫ్లయింగ్ సాసర్ల)లో చక్కర్లు కొడుతున్నారని వచ్చే వార్తలు కొత్తేమీ కాదు. తాము విమానాలు నడుపుతున్నప్పుడు గాల్లో ఏవో గుర్తు తెలియని వస్తువులు ఎగురుతుండగా చూశామంటూ కొందరు పైలట్లు, నావికాదళం రిటైర్డ్ అధికారులు కూడా ప్రకటించారు. అయితే ఇటీవల అమెరికాలోని ఫ్లోరిడా ప్రాంతంలోని మేఘాల్లో గుండ్రటి ఆకారంలో రంధ్రాలు ఏర్పడిన ఘటన మాత్రం కలకలం రేపుతోంది. కొందరు వీటిని ఫొటోలు తీసి సోషల్ మీడియాలో కూడా పెట్టారు. ఏలియన్ల ఫ్లయింగ్ సాసర్లు భూమిపైకి దిగినప్పుడు, తిరిగి పైకి ఎగిరినప్పుడు.. మేఘాల్లో అలా రంధ్రాల్లా ఏర్పడ్డాయనే ప్రచారం మొదలైంది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' తీసిన శాటిలైట్ చిత్రాల్లోనూ ఈ చిత్రమైన మేఘాలు కనిపించడం గమనార్హం.

- అయితే స్ట్రాటోస్ఫియర్ మధ్య భాగంలో ఏర్పడే 'ఆల్టోక్యుమ్యులస్' మేఘాల రసాయనిక పరిస్థితే ఈ చిత్రమైన పరిస్థితికి కారణమని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఈ మేఘాల్లో స్వచ్ఛమైన నీటి ఆవిరి ఉంటుందని.. వాటికి సమీపంగా జెట్ విమానాలు ప్రయాణించినప్పుడు పీడనం ప్రభావానికి లోనవుతాయని తెలిపారు. అలా ప్రభావం పడినచోటికి చుట్టూ ఉన్న ఆవిరి చేరి చిక్కబడుతుందని.. ఆ మేర మేఘానికి రంధ్రం పడినట్టుగా ఏర్పడుతుందని వివరించారు.

– సాక్షి సెంట్రల్ డెస్క్



రామోజీ ఫిల్మ్‌సిటీలో రామోజీతో భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కిరణ్

రామోజీరావును కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఫిలింసిటీలో ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావును కలిశారు. ఆదిలాబాద్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం, అనంతరం అక్కడ నుంచి హెలికాప్టర్‌లో నేరుగా రామోజీ ఫిలింసిటీ చేరుకున్నారు. అక్కడ ఆయన దాదాపు గంటసేపు గడిపారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జరుగుతున్న అభివృద్ధి, మారిన ప్రజాపాలనా విధానాలపైన రామోజీరావుతో చర్చించారు. దేశంలో, రాష్ట్రంలోనూ సమకాలీన రాజకీయ పరిస్థితులపై మాట్లాడుకున్నారు. లౌకికవాదాన్ని పరిరక్షించుకోవడం, భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీలు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ భేటీలో ముఖ్యమంత్రితోపాటు ఆయన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి రాంరెడ్డితో పాటు ఈనాడు ఎండీ కిరణ్ కూడా ఉన్నారు.

డీఎస్పీ ప్రణీత్‌రావుపై సస్పెన్షన్ వేటు?

సాక్షి, హైదరాబాద్: డీజీపీ కార్యాలయంలో ప్రస్తుతం డీఎస్పీగా పనిచేస్తున్న దుగ్యాల ప్రణీత్‌రావును ప్రభుత్వం సస్పెండ్ చేసినట్టు సమాచారం. గతంలో స్పెషల్ ఇంటిలిజెన్స్‌బ్యూరో(ఎస్ఐబీ)లో డీఎస్పీ గా పనిచేసిన ప్రణీత్‌రావుపై గత కేసీఆర్ ప్రభు త్వ హయాంలో తన అధికారాలను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ప్రణీత్‌రావు నేతృత్వంలో 30 మంది పోలీస్ అధికారుల బృందం ప్రతిపక్ష నాయకుల ఫోన్లను ట్యాప్ చేస్తోందంటూ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆరోపించారు. ప్రణీత్‌రావుపై వచ్చిన ఆరోపణలకు తగిన ఆధారాలు లభించడంతో సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

రూ.43,57,000 వడ్డీతో సహా చెల్లించండి

'తారాపోరేవాలా'కు వినియోగదారుల కమిషన్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వైద్య సేవలు కల్పించడంలో విఫలమైనందుకు బాధితులకు రూ.43,57,000ను పిటిషన్ వేసిన నాటి నుంచి 7% వడ్డీతో చెల్లించాలని తారాపోరేవాలా నర్సింగ్ హోమ్‌ను వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. ఇందులో సగం మొత్తాన్ని బాధితుల్లో ఒకరైన చిన్నారి పేరుపై ఆమె మేజర్ అయ్యే వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని స్పష్టం చేసింది. దీని కోసం నర్సింగ్ హోమ్‌కు నెల రోజులు సమయం ఇచ్చింది. '2010లో నా వివాహం జరిగింది. 2013లో నా భార్య సికింద్రాబాద్‌లోని తారాపోరేవాలా నర్సింగ్ హోమ్‌లో సాధారణ ప్రసవంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత ఆమెకు తీవ్ర రక్తస్రావం జరిగినా ఆస్పత్రి వర్గాలు.. అది పెద్ద సమస్య కాదు అని చెప్పారు. సమస్య తీవ్రంగా ఉంటే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలిస్తామని చెప్పినా వారు అంగీకరించలేదు. ఈ క్రమంలోనే నా భార్య మృతి చెందింది. ఆస్పత్రి వర్గాల నిర్లక్ష్యమే ఈ మృతికి కారణం'అంటూ ప్రైవేట్ ఉద్యోగి హరిప్రసాద్ (29)తో పాటు అతని కూతురు (3 నెలలు-పిటిషన్ వేసే నాటికి) వినియోగదారుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. రూ.99 లక్షల పరిహారంతో పాటు రూ.50 వేల ఖర్చులు కూడా చెల్లించేలా ఆస్పత్రికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. డాక్టర్ శిరిన్ ఎస్.తారాపోరేవాలాను కూడా పార్టీగా చేర్చారు. ఫిర్యాదుదారు తరఫున న్యాయవాది గౌరీశంకర్‌రావు వాదించారు. వాద నలు విన్న కమిషన్ ఇన్‌చార్జి అధ్యక్షురాలు మీనారామనాథన్, జ్యుడీషియల్ సభ్యుడు శేషుబాబు తమ తీర్పు వెలువరించారు.

శంషాబాద్ విమానాశ్రయానికి జాతీయ అవార్డు

శంషాబాద్ రూరల్: శంషాబాద్‌లో జీఎంఆర్ నిర్వహిస్తున్న హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం 'ఏఎస్ఆర్ఈఎక్స్'హాల్ ఆఫ్ ఫేమ్ జాతీయ అవార్డు అందుకుంది. ఎనర్జీ ఎఫీషియెన్సీ, సస్టెయినబిలిటీ కోసం కమర్షియల్ బిల్డింగ్ విభాగంలో దేశంలోని అగ్రశ్రేణి కార్పొరేట్ కార్యాలయాలు, భవనాలను అధిగమించి జీహెచ్ఐఏఎల్ మొదటి స్థానంలో నిలిచింది. ఇటీవల ఢిల్లీలో ఈ పోటీల విజేతను ప్రకటించారు. శాస్త్రవేత్తలు, వాస్తు శిల్పులు, సాంకేతిక నిపుణులతో కూడిన విశిష్ట జ్యూరీతో మూల్యాంకనం చేసి శక్తి సామర్థ్యం, స్థిరత్వ కార్యక్రమాలకు అసాధారణమైన నిబద్ధతను ప్రదర్శించే సంస్థలను ఈ పోటీల్లో గుర్తిస్తారు.

శంషాబాద్‌లో రూ.6 కోట్ల విలువైన బంగారం పట్టివేత

శంషాబాద్ రూరల్: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. విదేశాల నుంచి పలువురు ప్రయాణికులు అక్రమంగా తీసు కొచ్చిన 13.65 కిలోల బంగారాన్ని సోమవారం కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బంగారం విలువ రూ.6.03 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపా రు. ప్రయాణికులు తమ లగేజీ సూట్‌కేసులో హార్డ్ వేర్ పరికరాలు, కదుపులో, మెర్క్యురీ కోటెడ్ చైన్లలో బంగారం దాచి తీసుకొస్తూ పట్టుబడ్డారు. మొత్తం 28 సూట్‌కేసుల్లో ఈ బంగారం లభించగా.. ముగ్గురిని అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

క్రిష్.. పిటిషన్ ఉపసంహరణ

సాక్షి, హైదరాబాద్: రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ వ్యవహారంలో ముందస్తు బెయిల్ కోసం దర్శకుడు క్రిష్ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం ఆయన ఉపసంహరించుకున్నారు. రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు వివేకానంద వాంగ్మూలం మేరకు.. పోలీసులు క్రిష్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చడం తెలిసిందే. దీంతో ఈ కేసులో ముందస్తు బెయిల్, సీఆర్‌పీసీ 41ఏ నోటీసులు ఇచ్చిన తర్వాతే విచారణ చేపట్టేలా పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ క్రిష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి సోమవారం విచారణ చేపట్టారు. కేసులో విచారణకు హాజరుకావాలని పోలీసులు క్రిష్‌కు 41ఏ నోటీసులు జారీ చేశారు. దీంతో క్రిష్.. తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. దీనికి న్యాయమూర్తి అనుమతిస్తూ.. వాదనలను ముగించారు.

యాదాద్రిలో నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఆచార్యులు పూర్తి చేశారు. పాంచాహ్నిక దీక్షతో చేపట్టే ఈ ఉత్సవాల్లో మొదటి రోజైన మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్వస్తివాచనం జరిపిస్తారు. 6వ తేదీన ధ్వజారోహణం, భేరీపూజ, దేవతాహ్వానం, అగ్ని ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తారు. 7వ తేదీ రాత్రి 7 గంటలకు రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ ఉత్తర మాడవీధిలోని కల్యాణ మండపంలో జరిపిస్తారు. 8వ తేదీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయం నుంచి అభిషేకాలు, రాత్రి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం, 9వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లక్ష బిల్వార్చన, రాత్రి శ్రీరామలింగేశ్వరస్వామి రథోత్సవం, 10వ తేదీన మధ్యాహ్నం పూర్ణాహుతి, రాత్రి డోలోత్సవం ఉంటాయి. దీంతో వేడుకలు ముగుస్తాయి.

పూజలకు టికెట్లు..

రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే ఆయా పూజల్లో పాల్గొనే భక్తులు టికెట్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. 7వ తేదీన నిర్వహించే శివ కల్యాణోత్సవంలో రూ.516 టికెట్ కొనుగోలు చేసి ఇద్దరు పాల్గొనవచ్చు. 8వ తేదీ మహా శివరాత్రి రోజున జరిపే అభిషేకంలో రూ.300 టికెట్, రాత్రి జరిగే శత రుద్రాభిషేకంలో రూ.516 టికెట్ కొనుగోలు చేసి పూజల్లో పాల్గొనాల్సి ఉంటుంది. ఇక 9వ తేదీన జరిగే లక్ష బిల్వార్చన పూజల్లో సైతం పాల్గొనేందుకు రూ.516 టికెట్ కొనుగోలు చేయాలి.

వెంట్రుకల ఎగుమతి కేసులో ప్రాసిక్యూషన్‌కు ఓకే

ఈడీ ఫిర్యాదును అనుమతించిన కోర్టు

సాక్షి, హైదరాబాద్: విదేశాలకు మానవ వెంట్రుకల అక్రమ ఎగుమతి కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును నాంపల్లి పీఎంఎల్ఏ ప్రత్యేక న్యాయ స్థానం అనుమతించింది. వెంట్రుకల అక్రమ ఎగుమతిపై ఈడీ అధికారులు నైల ఫ్యామిలీ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌కు చెందిన లూకాస్ తంగ్మాంగ్లియానా, మరో 16 మందిపై మనీలాండరింగ్ చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందుకు సంబంధించి గతేడాది ఆగస్టు 21న ప్రాసిక్యూషన్ ఫిర్యాదును ఈడీ కోర్టులో దాఖలు చేసింది. ఈ ఫిర్యాదును కోర్టు ఈ నెల 1న అనుమతించినట్టు ఈడీ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తప్పుడు ధ్రువపత్రాలు, బినామీ ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్ కోడ్ (ఐఈసీ)లను వినియోగించి నైల ఫ్యామిలీ ఎక్స్‌పోర్ట్స్ ప్రై.లిమిటెడ్, ఇతరులు మానవ వెంట్రుకలను మిజోరం వద్ద భూమార్గాల ద్వారా మయన్మార్, బంగ్లాదేశ్, వియత్నాం, చైనాలకు ఎగుమతి చేస్తున్నట్టు ఆధారాలు లభించడంతో హైదరాబాద్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇందులో మనీలాండరింగ్‌పై ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో కీలక నిందితుడైన మిజోరంకు చెందిన లూకాస్ తంగ్మాంగ్లియానా దేశసరిహద్దుల్లో ఈ అక్రమ రవాణా చేస్తున్నట్టు ఈడీ అధికారులు గుర్తించారు. కేసు దర్యాప్తులో భాగంగా మిజోరం, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో సోదాలు జరిపి రూ.1.21 కోట్ల లెక్కల్లో లేని నగదును స్వాధీనం చేసుకోవడంతోపాటు 100కు పైగా బ్యాంకు ఖాతాల్లోని రూ.7.85 కోట్లు స్తంభింపజేశారు. హైదరాబాద్‌లోని పలు మానవ వెంట్రుకల ఎగుమతి కంపెనీలు సైతం ఈ బ్యాంకు ఖాతాల నుంచి నగదు పొందినట్టు, హవాలా మార్గంలోనూ నగదు లావాదేవీలు జరిగినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. తాజాగా ఈ కేసులో ప్రాసిక్యూషన్ ఫిర్యాదును కోర్టు అనుమతించినట్టు ఈడీ అధికారులు తెలిపారు.

ఆవుల దత్తత పేరుతో 'సైబర్' దందా!

- సరికొత్త సైబర్ స్కామ్ తెరపైకి తెచ్చిన నేరగాళ్లు
- రోజువారీగా లాభాలు పొందొచ్చని గాలం
- తస్మాత్ జాగ్రత్త అంటున్న సైబర్ భద్రత నిపుణులు

సాక్షి, హైదరాబాద్: ప్రజల అత్యాశ..అమాయకత్వమే పెట్టుబడిగా సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త తరహా నేరానికి తెరతీస్తున్నారు. తాజాగా 'ఆవులు దత్తత తీసుకోండి..రోజూ లాభాలు పొందండి'అంటూ ఇంటర్‌నెట్‌లో ఊదరగొడుతున్నారు. మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాలకు ఇది సరికొత్త రూపంగా సైబర్ భద్రతా నిపుణులు పేర్కొంటున్నారు. ఈ స్కాంలో పలు రకాల ఆవులకు కొంత మొత్తం ధర చెబుతారు. ఆ మొత్తాన్ని చెల్లిస్తే.. చెల్లించిన మొత్తానికి కొంత లాభాన్ని తిరిగి ఇస్తారు. ఇలా పెట్టిన పెట్టుబడికి లాభం పొందవచ్చు. అదేవిధంగా ఈ స్కీంలో మరో ముగ్గురిని సిఫారసు చేస్తే వినియోగదారుడి ఖాతాలో కొంత గుడ్‌విల్ మొత్తం వేస్తారు. ఇలా ఒకరి ద్వారా చేర్చిన ముగ్గురు మరో ముగ్గురి చొప్పున చేర్చిన ప్రతిసారీ వినియోగదారులకి వచ్చే లాభం పెరుగుతుందని ఆశలు కల్పిస్తారు. గతంలో ఈ తరహా మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాలు ఎన్నో వెలుగులోకి వచ్చాయి. అయితే ఇది కొత్త తరహాగా ఉండటంతో ప్రజలు వీటిని నమ్మి మోసపోతున్నట్టు నిపుణులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో డబ్బులు సంపాదించాలన్న ఆసక్తి ఉన్నవారిని ఈ సైబర్ మోసగాళ్లు ప్రధానంగా టార్గెట్ చేస్తున్నారని అంటున్నారు.

ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్న మోసాలు..

ప్రధానంగా ఈ తరహాలో మోసాలకు వరల్డ్‌ఫాం, వరల్డ్‌ఫాం ప్రో, వరల్డ్‌ఫామ్ రాంచ్‌గోల్డ్ పేరిట ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో యాప్‌ల గురించి యాడ్స్ ఇస్తున్నారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ఇక ఈ యాప్‌లు నిజమైనవేనని నమ్మించేలా నకిలీ డౌన్‌లోడ్‌లు, రివ్యూలను సైతం ఆయా సంస్థలు ఏర్పాటు చేస్తున్నాయని, యూట్యూబ్‌లలోనూ ప్రమోషన్ పేరిట ఫేక్ స్టోరీలను పెడుతున్నట్టు సైబర్ భద్రతా నిపుణులు పేర్కొన్నారు. ఇలాంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకున్నవారి వ్యక్తిగత, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్న తర్వాత మోసానికి తెరతీస్తున్నారు. మొదట ఖాతాలోకి లాభాలను జమచేస్తారు. అనంతరం రివార్డ్ పాయింట్లు, మానిటరీ బెనిఫిట్ల పేరిట ఖాతాలో డబ్బు జమ అవుతున్నట్టుగా యాప్‌లో చూపుతున్నారు. అయితే ఖాతాదారుడికి డ్రా చేసుకునే అవకాశం ఇవ్వరు. చివరకు కమీషన్ తీసుకుని లాభాలు చెల్లించే పేరిట భారీగా డబ్బులు లాగి ఆ తరువాత యాప్ అందుబాటులో లేకుండా చేస్తున్నారు.

అత్యాశకు పోయి మోసపోవద్దు..

సైబర్ నేరగాళ్లు తేలిగ్గా డబ్బు సంపాదించాలన్న మన బలహీనతను ఆసరాగా చేసుకుని ఇలాంటి మోసాలకు తెరతీస్తున్నారు. ఆవుల దత్తత మోసాలు గతంలో మనం చూసిన మల్టీలెవల్ మార్కెటింగ్‌లాంటిదే. తేలిగ్గా లాభాలు రావడం అంటేనే మోసమని గ్రహించాలి. గుర్తింపులేని ఎటువంటి యాప్‌లను డౌన్‌లోడ్‌చేసి డబ్బులు చెల్లించవద్దు. ఈ తరహా మోసాల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– డా.ప్రసాద్ పాటిబండ్ల, సైబర్ ఇంటెలిజెన్స్ నిపుణుడు, న్యూఢిల్లీ

ఈనాడు యాజమాన్యం ఒత్తిళ్లతో మహిళా ఉద్యోగిని ఆత్మహత్య

- కార్యాలయం నాలుగో అంతస్తు నుంచి దూకి బలవన్మరణం
- సోమవారం ఉదయం రామోజీ ఫిల్మ్‌సిటీలో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త.. అతను కూడా ఈనాడు ఉద్యోగే
- పూర్వాపరాలు చెప్పనివ్వకుండా అడ్డుకున్న సంస్థ సిబ్బంది



సాయికుమారి (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఈనాడు దినపత్రిక యాజమాన్యం ఒత్తిళ్లు తట్టుకోలేక ఓ మహిళా ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడింది. సంస్థలో గత కొంత కాలంగా ఎదురవుతున్న ఒత్తిళ్లను, అనుభవిస్తున్న మానసిక క్షోభను భర్తతో పంచుకున్నప్పటికీ.. అవి మరింత తీవ్రతరం కావడంతో తనకిక చావే శరణ్యం అనుకుంది. తాను పనిచేస్తున్న ఈనాడు కార్యాలయ భవనం నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామోజీ ఫిల్మ్‌సిటీలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు, మృతురాలి భర్త పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. పెద్ద అంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని కుంట్లూర్ రెవెన్యూ గజ్జి స్వామియాదవ్ కాలనీలో నివాసముండే ఎర్రగొల్ల శ్రీనివాస్, సాయికుమారి (34)కి పదేళ్ల క్రితం వివాహం అయ్యింది. శ్రీనివాస్ పదిహేనేళ్లుగా, సాయికుమారి తొమ్మిదేళ్లుగా రామోజీ ఫిల్మ్‌సిటీలోని ఈనాడు సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. ఈనాడు కాల్ సెంటర్‌లో పనిచేసే సాయికుమారికి కొంతకాలంగా సంస్థలో ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. దీంతో తరచూ ఇబ్బంది పడుతుండేది. భర్తకు చెప్పుకుని బాధ పడేది.

ఆదివారం సరదాగా గడిపి..

ఈ క్రమంలోనే భార్యకు మానసిక ధైర్యాన్నిచ్చేందుకు శ్రీనివాస్ ఆదివారం సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాలకు తీసుకెళ్లి తిప్పాడు. ఇద్దరూ సరదాగా గడిపారు. సోమవారం విధుల్లో భాగంగా రామోజీ ఫిల్మ్‌సిటీకి బయలుదేరిన సాయికుమారిని ఉదయం 6 గంటలకు తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి జాతీయ రహదారి వద్ద దిగబెట్టి ఇంటికి వచ్చాడు. అయితే 9 గంటల సమయంలో ఈనాడు హెచ్ఆర్ విభాగం నుంచి శ్రీనివాస్‌కు ఫోన్ వచ్చింది. సాయికుమారి నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకి చనిపోయిందని చెప్పడంతో హుటాహుటిన ఫిల్మ్‌సిటీకి వెళ్లాడు. అప్పటికే తలకు తీవ్ర గాయమైన సాయికుమారి మృతి చెందింది. శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఈనాడు సిబ్బంది అత్యుత్సాహం

ఈనాడు సంస్థ ఒత్తిళ్ల కారణంగా తన భార్య ఆత్మహత్యకు పాల్పడిందని శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పీఎస్‌లో ఉన్న శ్రీనివాస్ నుంచి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకునేందుకు మీడియా ప్రతినిధులు ప్రయత్నించారు. అయితే అతని చుట్టూ కంచెలా ఉన్న ఈనాడు సిబ్బంది అడ్డుకున్నారు. తన భార్య మృతికి దారితీసిన పరిస్థితులను మీడియాకు వివరించేందుకు సిద్ధమవుతున్న శ్రీనివాస్‌ను బలవంతంగా తమ కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.